


నిజాల నిగ్గు తేల్చే
# చర్చ
తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 24 సంచిక : 35 గురువారం, అక్టోబర్ 30, 2025 , పేజీలు - 12 వెల : 2/-

## రఫేల్ యుద్ధ విమానంలో విహరించిన రాష్ట్రపతి

- రాష్ట్రపతి ముర్ముతో రఫేల్ రాణి శివాంగీ సింగ్


2లో

## సిఎం, పిఎం సీటు ఖాళీగా లేదు

- తేజస్వీ, రాహుల్‌కు నిరాశ తప్పదు
- బీహార్ ఎన్నికల ప్రచారంలో అమిత్ షా




పట్నా, అక్టోబర్ 29 : బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తోన్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఎన్డీయే, ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ అధికారాన్ని చేజిక్కించు కోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. విపక్ష కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ అని ఇప్పటికే ప్రకటన రాగా.. ఎన్డీయే ముఖ్యమంత్రి అభ్యర్థిపై మాత్రం స్పష్టత లేదు. దానిపైనే మిగతా2లో...

## మొంథా ప్రభావంతో
# తెలంగాణలో వర్షాలు

**ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయండి**

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సిఎం ఆదేశం**





హైదరాబాద్,అక్టోబర్29: మొంథా తుపాను తీవ్ర వాయుగుండంగా మారి భారీ వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణలో కూడా దాని ప్రభావం తీవ్రంగా ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీరం దాటిన తుఫాన్ భద్రాద్రి కొత్తగూడం మీదుగా తెలంగాణలో ప్రవేశించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణలో వాయుగుండం ప్రభావంపై సీఎం అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని.. దిశానిర్దేశం చేశారు. పలు చోట్ల కల్లాల్లో ధాన్యం ఆరబోసినందున ఎటువంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ప్రభావం ఎక్కువగా ఉండటంతో పాటు.. హైదరాబాద్, ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నందున అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గోల్కొండ, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోవడం.. పలు రైళ్లను దారి మళ్లించినందున ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సమన్వయం చేసుకోవాలని... కలెక్టర్లు ఆయా బృందాలకు దిశా నిర్దేశర చేయాలని సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం లేకండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో మిగతా2లో...

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఉచిత రేషన్

**అధికారులను ఆదేశించిన డిప్యూటీ సిఎం**



అమరావతి, అక్టోబర్ 29 :తుపాను ప్రభావిత ప్రాంత ప్రజలకు నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. తుపాను బాధిత కుటుంబానికి 25 కేజీల చొప్పున బియ్యాన్ని ఉచితంగా ఇవ్వాలని ఆదేశించింది. నిత్యావసర సరుకుల పంపిణీపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సామాజిక మిగతా2లో...

## బీహార్‌లో రిమోట్ కంట్రోల్ పాలన

- నితీశ్‌ను ముందు పెట్టి నడుపుతున్న బిజెపి
- ఎన్నికల ప్రచారంలో రాహుల్ విమర్శలు



పాట్నా, అక్టోబర్ 29 : నీతీశ్ కుమార్‌ను ఎదురుగా పెట్టి బిహార్‌లో భాజపా రిమోట్ కంట్రోల్ సర్కారు ను నడుపుతోం దని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భాజపా నేతృత్వంలోని కేంద్రం మిగతా2లో...

## మరో 51మంది మావోల లొంగుబాటు


2లో

## 8వ వేతన సవరణ సంఘంతో గొప్ప నిర్ణయం

**కేబినెట్ నిర్ణయంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హర్షం**


2లో


## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ

- కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పాచిక
- మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి
- 31న ప్రమాణ స్వీకారానికి రంగం సిద్ధం
- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానం
- సిఎం రేవంత్‌తో అజారుద్దీన్ భేటీ





హైదరాబాద్, అక్టోబర్ 29 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పాచిక పన్నుతోంది. ఇంతకాలం కేబినేట్‌లో మైనార్టీలకు చోటుదక్క లేదు. తాజాగా మహమ్మద్ అజహరుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. శుక్రవారం తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కార్యక్రమం జరగనుంది. అజహరు ద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. ఈ మేరకు రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. ఇదిలావుంటే తాజాగా అజారుద్దీన్‌ను సిఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలుసుకోవడం, వార్తలకు బలం చేకూరింది. తనకు మంత్రి పదవి ఇవ్వాలన్న నిర్ణయంపై ధన్యవాదాలు తెలిపినట్లు తెలుస్తోంది. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ మిగతా2లో...



## అవసరమైతే తప్ప బయటకు రావద్దు

- వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయొద్దు
- పంటల విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి
- తుపాను ప్రభావం తగ్గే వరకు ప్రభుత్వ సూచనలు పాటించాలి
- అధఙాకరులతో సమీక్షించిన పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్, అక్టోబర్ 29 : భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క సూచించారు. తుపాను ప్రభావంపై మహబూబాబాద్, ములుగు, అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పరిస్థి తులు సమీక్షిస్తూ అత్యవసర చర్యలకు అధికారులు సిద్ధంగా ఉం డాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. పలు రైళ్లు నిలిచిపోయి నందున ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికా రులను ఆదేశించారు. తుపాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు.. ప్రభుత్వ సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. మొంథా తుఫాను నేపథ్యం లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీతక్క దిశానిర్దే శం చేశారు. తుఫాను పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, మిగతా2లో...

## మూడు జిల్లాల్లో నేడు స్కూళ్లకు సెలవు


2లో

# రఫేల్ యుద్ధ విమానంలో విహరించిన రాష్ట్రపతి

**న్యూఢిల్లీ,అక్టోబర్ 29 :**

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. హరియాణాలోని అంబాలా వైమానిక స్థావరంలో దేశ ప్రథమ పౌరురాలు, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపది ముర్ము భారత వైమానికి దళానికి చెందిన రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. ముందుగా భద్రతా దళాల నుంచి సైనిక వందనం స్వీకరించారు. ఫ్లైయింగ్ సూట్ ధరించిన రాష్ట్రపతి ప్రస్తుతం రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేసారు. ఇందులో యుద్ధ విమాన పైలట్ శివాంగీ సింగ్‌తో దిగిన ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఆమెని బంధించినట్లు పాక్ ప్రచారం చేయడంతో సింగ్ పేరు అప్పట్లో మార్మోగింది. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో దాయాది పాకిస్థాన్ సోషల్ మీడియాలో విపరీతంగా అసత్య ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే భారత్‌కు చెందిన రఫేల్ సహా పలు యుద్ధ విమానాలను నేలకూల్చామని, ఓ మహిళా పైలట్‌ను బంధించామని పాక్ అబద్దాలు ప్రచారం చేసింది. ఈ ప్రచారాన్ని భారత్ అప్పట్లోనే ఖండించింది. దీంతో నాడు శివాంగీ సింగ్ పేరు నెట్టింట తెగ వైరల్‌గా మారింది. ఇప్పుడు ఆమెతో రాష్ట్రపతి ముర్ము ఫొటో దిగడంతో శివాంగీ మరోసారి వార్తల్లో నిలిచారు. ఆమె కోసం నెటిజన్లు శోధిస్తున్నారు. సింగ్ స్వస్థలం వారణాసి. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె.. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం లో డిగ్రీ పట్టా అందుకున్నారు. ఈ క్రమంలోనే ఎన్‌సీసీలో చేరారు. ఆపై 2016లో ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. చిన్నతనం నుంచీ పక్షిలా ఆకాశంలో ఎగరాలని కలలు కన్న ఆమె.. ఎప్పటికైనా పైలట్ అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశ యుద్ధ విమాన పైలట్లుగా నియమితులైన మోహనా సింగ్, భావనా కాంత్, అవనీ చతుర్వేది స్ఫూర్తితో పైలట్‌గా శిక్షణ తీసుకున్నారు. 2017లో రెండో దశ యుద్ధ విమాన పైలట్లలో ఒకరిగా ఎంపికైన శివాంగీ.. మిగ్–21 బైసన్ యుద్ధ విమానాలు నడపడంలో ప్రావీణ్యం సాధించారు. మిగ్ ఫైటర్ జెట్లు నడిపిన అనుభవంతోనే 2020లో దేశంలోనే అత్యాధునిక రఫేల్ యుద్ధ విమానాన్ని నడిపే అవకాశం దక్కించుకున్నారు. అప్పటి నుంచి అంబాలా ఎయిర్‌బేస్‌లోని 'గోల్డెన్ యారోస్' స్క్వాడ్రన్ బృందంలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్నారు. 2022లో జరిగిన గణతంత్ర వేడుకల్లో 'భవిష్యత్తు కోసం భారత వైమానిక దళం రూపాంతరం చెందుతోంది' అనే థీమ్‌తో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ శకటాన్ని ప్రదర్శించింది. ఈ శకటంలో రఫేల్స్ ÷ట్రైర్ జెట్ యుద్ధ విమానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ శకటంపై శివాంగి సింగ్ సెల్యూట్ చేస్తూ కనిపించారు. గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొన్న రెండో పైలట్‌గా ఘనత సాధించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా 'రఫేల్ రాణి' అంటూ చేసిన పోస్ట్ ఆకట్టుకుంది.

# సిఎం, పిఎం సీటు ఖాళీగా లేదు

(మొదటి పేజీ తరువాయి)

విపక్షాలు ప్రశ్నలు సంధిస్తున్నాయి. దాంతో తాము నీతీశ్ నాయకత్వంలో బిహార్ ఎన్నికలకు వెళ్తామని ఇటీవల మోదీ ప్రకటించారు. ఆయనే సీఎంగా కొనసాగుతారని తాజాగా అమిత్ షా స్పష్టంచేయడంతో ఎన్డీయే సీఎం అభ్యర్థి ఎవరన్న అంశంపై ఉన్న సందిగ్ధత వీడిపోయింది. ఈ క్రమంలో రాజకీయాల్లో ఏ సీటూ ఖాళీగా లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. నీతీశ్ కుమార్ బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానిగా ఉంటారని వ్యాఖ్యానించారు. బిహార్‌లో దర్భంగాలో బుధవారం జరిగిన ర్యాలీలో అమిత్ షా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్, ఆర్జేడీపై ఆయన వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తన కుమారుడు తేజస్వీయాదవ్‌ను ముఖ్యమంత్రిని చేయాలను కుంటున్నారని, కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తన కుమారుడు రాహుల్ గాంధీని పీఎంను చేయాలనుకుంటున్నారని అమిత్ షా విమర్శించారు. కానీ ఆ రెండు స్థానాలు ఖాళీగా లేవంటూ మహాగఠ్‌బంధన్ పార్టీలను ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చి.. రాష్ట్ర ప్రతిష్ఠను పెంచారని ఈ ఎన్నికల ప్రచారం సందర్భంగా అమిత్‌షా వ్యాఖ్యానించారు. అలాగే పహల్గాం దాడి గురించి ప్రస్తావించారు. ఆ ఉగ్రదాడి జరిగిన వెంటనే మోదీ ఆపరేషన్ సిందూర్‌కు ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ

(మొదటి పేజీ తరువాయి)

వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు. ముస్లిం మైనార్టీ వర్గానికి ఏదో విధంగా మంత్రివర్గంలో స్థానం కల్పించాలనే ఆలోచనతో కాంగ్రెస్ అధిష్ఠానం ఉంది. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపినట్టు సమాచారం. మంత్రివర్గ విస్తరణపై గత రెండ్రోజులుగా ఏఐసీసీలో విస్తృతంగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అయితే బిసి రిజర్వేషన్లపై కసరత్తు జరుగుతున్న వేళ కేబినేట్‌లో బిసిల కోటాను పెంచాలని డిమాండ్ వచ్చింది. దీనిని కాంగ్రెస్ పట్టించుకున్నట్లు లేదు. మొదటి సారి ముఖ్యమంత్రితో పాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో కాంగ్రెష్ అధిష్ఠానం ముస్లిం మైనారిటీకి అవకాశం కల్పించింది. ఒక వేళ గవర్నర్ కోటాలో అజాహరుద్దీన్‌కు అవకాశం దక్కని పక్షంలో.. త్వరలో కొన్ని ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 6 నెలల్లో అజాహరుద్దీన్‌ను ఎమ్మెల్సీని చేసే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గానికి ఇవ్వాలనే దానిపై కసరత్తు కొనసాగు తున్నట్టు తెలుస్తోంది. దీంతో బిసి సామాజిక వర్గాలు ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, బీర్ల అయిలయ్యలు ఎప్పటి నుంచో మంత్రిపదవికి డిమాండ్ చేస్తున్నారు.

# తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఉచిత రేషన్

(మొదటి పేజీ తరువాయి)

మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి, ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, చేనేత కార్మికులకు నిత్యావసరాలను ఉచితంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమైందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశిరచిన విధంగా అధికార యంత్రాంగం నిత్యావసరాలను సమకూర్చిందని చెప్పారు. బియ్యం 25 కేజీలు (మత్స్యకారులకు, చేనేత కార్మికులకు 50 కేజీలు), కందిపప్పు కేజీ, పామాయిల్ ఒక లీటర్, ఉల్లిపాయలు కేజీ, బంగాళాదుంపలు కేజీ, పంచదార కేజీ చొప్పున అందిస్తారన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలను అనుసరించి ఆ శాఖ అధికార యంత్రాంగం అన్ని రేషన్ షాపులకు వీటిని చేర్చిందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని 14,415 రేషన్ షాపుల్లో 1 లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం, 3424 మెట్రిక్ టన్నుల పంచదారతో పాటు ఇతర నిత్యావసరాలను పంపిణీకి సిద్ధంగా ఉంచారన్నారు. నిత్యావసరాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారని చెప్పారు. హోమ్, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి సత్య అనగాని సహాయ చర్యలను, ఆహారం, నిత్యావసరాల పంపిణీని సమన్వయం చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు.

# మూడు జిల్లాల్లో నేడు స్కూళ్లకు సెలవు

**హైదరాబాద్,అక్టోబర్29:** మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా సిద్దిపేట, హన్మకొండ, ములుగు జిల్లాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో నదులు, వాగులు పొంగిప్రవహిస్తున్నాయి. రహదారులపై నీరు చేరి రాకపోకలు అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా కలెక్టర్లు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు సంయుక్తంగా సమీక్ష నిర్వహించి, వర్షపాతం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గురువారం సిద్దిపేట, హన్మకొండ, ములుగు జిల్లాల్లోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థలు ఈ నిర్ణయానికి లోబడుతాయి. అలాగే వాతావరణ శాఖ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకుని అధికారులు ప్రజలను జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తుఫాన్ ప్రభావం కొనసాగుతున్నందున అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని విజ్ఞప్తి చేశారు. తక్కువ ఎత్తు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సమీపంలోని సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. హన్మకొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం, గోవిందరావుపేట, తాడ్వాయి, వెంకటాపురం మండలాల్లో వాగులు పొంగి రహదారులు తెగిపోయాయి. కొందరు గ్రామాలు రోడ్డు మార్గం ద్వారా సంబంధాలు కోల్పోయాయి. స్థానిక ఎన్‌డీఆర్ఎఫ్, ౹÷ర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నారు. అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేసి, పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

# మరో 51మంది మావోల లొంగుబాటు

**రాయ్‌పూర్,అక్టోబర్ 29 :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 51మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 20మందిపై మొత్తంగా రూ.66 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు బుధవారం ప్రకటించారు.51మందిలో తొమ్మిది మంది మహిళలు ఉన్నారు. లొంగిపో యిన వారిలో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ) బెటాలియన్ నెంబర్01 మరియు నెంబర్లు 01,02 మరియు 05కు చెందిన ఐదుగురు సభ్యులు, ఏరియా కమిటీ మరియు గ్రూప్‌కు చెందిన ఏడుగురు సభ్యులు ఉన్నారు. స్థానిక సంస్థ స్క్వాడ్ (ఎల్ఓఎస్) గ్రూప్‌కు చెందిన ముగ్గురు సభ్యులు, ఒక మావోయిస్టు గ్రూప్ కమాండర్, మావోయిస్టుల బృందానికి చెందిన 14మంది సభ్యులు, 20మంది దిగువ స్థాయి సభ్యులు ఉన్నారని బీజాపూర్ ఎస్పి తెలిపారు. 2024 జనవరి నుండి, బీజాపూర్‌లో మొత్తం 650మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో చేరారని, ఎన్‌కౌంటర్లలో 196మంది మరణించారని అన్నారు. 986మంది మావోయిస్టులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

# మొంథా ప్రభావంతో తెలంగాణలో వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులపై జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే స్పందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని.. నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు.పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించా లన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాల న్నారు. వర్షం నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు. వైద్యారోగ్య శాఖ తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని... అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# అవసరమైతే తప్ప బయటకు రావద్దు

(మొదటి పేజీ తరువాయి)

అత్యావసర చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో మంత్రి సీతక్క మాట్లాడారు. తుఫాను కారణంగా అధికారులు చేపట్టిన చర్యలపై మంత్రి సీతక్క తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకి కీలక ఆదేశాలు జారీ చేశారు. చలిగాలులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. రైతులు పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మార్గనిర్దేశర చేశారు. పశువుల కాపరులు తమ పశువులని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ప్రజలు వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయొద్దని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. పలు చోట్ల రైళ్లు నిలిచిపోయినట్లు సమాచారం అందుతున్న క్రమంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు ఆహారం, తాగునీరు వంటి అవసరాలు వెంటనే అందించాలని ఆదేశించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని మంత్రి సీతక్క సూచించారు.

# 8వ వేతన సవరణ సంఘంతో గొప్ప నిర్ణయం

**హైదరాబాద్,అక్టోబర్29:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ దిశగా కేంద్ర కేబినెట్ తీసుకున్న కీలక నిర్ణయంపై కేంద్రమంత్రి జీ. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 8వ వేతన సవరణ సంఘం విధివిధానాలను ఆమోదించినందుకు కేంద్ర కేబినెట్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన స్పందించారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్' అనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ నినాదం ఆధారంగా దేశంలోని ప్రతివర్గం సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కృషికి సరైన గుర్తింపు ఇవ్వడమే కాకుండా, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఈ నిర్ణయం కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. వేతన సవరణతో ఉద్యోగుల్లో ఉత్సాహం పెరగడంతో పాటు, కేంద్ర సంస్థల్లో ఉత్పాదకత పెరిగి ప్రజా సేవల నాణ్యత మరింత మెరుగవుతుందన్నారు. ఉద్యోగుల ఆర్థిక స్థితి మెరుగుపడటం ద్వారా దేశీయ వినియోగం పెరిగి, ఆర్థిక వృద్ధికి కూడా ఊతమిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమం, ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ఆయన పేర్కొం టూ మోదీ నాయకత్వం వహించిన తర్వాత 2016లో 7వ వేతన సవరణ కమిషన్ ద్వారా ఉద్యోగు లకు అనుకూలమైన సంస్కరణలు తీసుకువచ్చారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. 31 నుంచి కేటీఆర్ రోడ్‌షోలు..!

**హైదరాబాద్,అక్టోబర్29:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక సందర్భంగా ఈ నెల 31 నుంచి




బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు విస్తృత ప్రచారం చేపట్టనున్నారు. శుక్రవారం నుంచి నవంబర్ 9 వరకు పలుచోట్ల రోడ్‌షోలు చేపట్టనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన అక్టోబర్ 31న షేక్‌పేట్, నవంబర్ 1న రెహమత్ నగర్, నవంబర్ 2న యూసుఫ్‌గూడ, నవంబర్ 3న బోరబండ, నవంబర్ 4న సోమాజిగూడ, నవంబర్ 5న వెంగళరావు నగర్, నవంబర్ 6న ఎర్రగడ్డ డివిజన్లలో వరుసగా రోడ్ షోలు నిర్వహిస్తారు. నవంబర్ 8న షేక్‌పేట్, యూసుఫ్‌గూడ, రెహమత్ నగర్ డివిజన్లలో రోడ్ షో కార్యక్రమాల్లో పాల్గొంటారు. నవంబర్ 9న షేక్‌పేట్ నుంచి బోరబండ వరకు బైక్ ర్యాలీలో పాల్గొని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం ప్రచారం నిర్వహించనున్నారు.ఉప ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న కొద్ది బీఆర్ఎస్ నేతలు ఇప్పటికే జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటర్ల వద్దకు వెళుతూ ఉప ఎన్నికల్లో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య, బీఆర్ఎస్ అభ్యర్థి సునీతను గెలిపించాలని కోరుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు చేపడుతూ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని నేతలు ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

# బిహార్‌లో రిమోట్ కంట్రోల్ పాలన

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక న్యాయానికి వ్యతిరేకమని విమర్శించారు. ప్రతిపక్షాలు పట్టుబట్టడం వల్లే మోదీ ప్రభుత్వం కుల గణనకు అంగీకరించిందన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముజఫ్ఫర్‌పుర్‌లో నిర్వహించిన తన తొలి ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్ల చోరీ జరిగిందని, బిహార్‌లోనూ ఇది పునరావృతమవుతుందని ఆరోపించారు. బిహార్ ప్రభుత్వం రిమోట్ కంట్రోల్ ద్వారా నడుస్తోందని తేజస్వీ యాదవ్ ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నాను. భాజపా కేవలం నీతీశ్ కుమార్‌ను వాడుకుంటోంది. దేశసంపద కొంతమంది సంపన్నుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. బిహార్ వంటి ప్రాంతాలు పేదరికంలో కూరుకుపోవడానికి ఇదే కారణం. నోట్ల రద్దు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టంపై ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు. ఛఠ్ పూజ సందర్భంగా దిల్లీలోని యుమునా నది ఘాట్ వద్ద పూజలు చేయనున్నట్లు ప్రకటించిన ఆయన.. ఆ తర్వాత అది కృత్రిమంగా నిర్మించిందని తెలుసుకుని వెనకడుగు వేశారని రాహుల్ విమర్శించారు. ఓట్ల కోసం ప్రధాని మోదీ ఎంతకైనా వెళ్తారంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. బిహార్ లో 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రయోజనాలు

## ఫీజు బకాయిలను వెంటనే చెల్లించండి: కృష్ణయ్య

**/హైదరాబాద్,అక్టోబర్29:** స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం త్వరలో బీసీ రథయాత్ర చేపట్టనున్నట్లు తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ రిజర్వేషన్ల అమలును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తి చేయకపోతే నవంబరు రెండవ వారంలో రథయాత్ర ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీ కాలేజీ విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలని ఎంపీ ఆర్. కృష్ణయ్య మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

# విశ్వాసనీయతకు చిరునామా మా ప్యానల్

**భారీ మెజార్టీతో గెలిపించండి**
**అర్బన్ బ్యాంకును విజయపతంలో నడిపిస్తాం**
**అగ్రగామిగా నిలుపుతాం**
**పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తాం**
**ఖాతాదారులకు రక్షణగా ఉంటాం**
**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**
**ప్యానల్ అభ్యర్థుల గెలుపు కోసం లేక్ పోలీస్ స్టేషన్, మానేరు డ్యాం పై ప్రచారం**





చర్చ :- కరీంనగర్విశ్వాసంగా సేవలందించడమే ధ్యేయంగా మీ ముందుకు వచ్చిన మా పానల్ అభ్యర్థులను అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. విశ్వాసనీయతకు చిరునామా మా ప్యానల్ అభ్యర్థులు అనీ ఏలాంటి లాభాపేక్ష లేకుండా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని, వారిని ఎన్నికల్లో ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉదయం కరీంనగర్ లోని లేక్ పోలీస్ స్టేషన్, మానేరు డ్యాం కట్టపై అర్బన్ బ్యాంకు అభ్యర్థుల గెలుపు కోసం వెలిచాల రాజేందర్ రావు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వాకర్స్, మహిళలు సీనియర్ సిటిజన్స్, పలువురు ప్రతినిధులను కలిసి తమ ప్యానల్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వాకర్స్, స్విమ్మర్స్, క్రీడాకారులు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో రాజేందర్ రావు ప్రత్యేకంగా మాట్లాడారు. విశ్వాసంగా. అవినీతి రహితంగా సభ్యులు మెచ్చేలా.. డిపాజిట్ల కు రక్షణ కల్పించేలా.. వారిలో నమ్మకం కలిగేలా అర్బన్ బ్యాంకును తెలంగాణ రాష్ట్రంలోనే స్మార్ట్ బ్యాంకుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. జాతీయ బ్యాంకులకు దీటుగా అర్బన్ బ్యాంకును తీర్చిదిద్దుతామని మెరుగైన సేవలు అందించేలా డిజిటలైజేషన్ హామీ ఇచ్చారు. ఖాతాదారులకు వెంట వెంటనే సేవలు అందేలా బ్యాంకును సంస్కరిస్తామని చెప్పారు. అర్బన్ బ్యాంకు అభివృద్ధిలో మా తండ్రి మాజీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ జగపతిరావు కీలక పాత్ర ఉందని తెలిపారు. గతంలో అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో నాలుగుసార్లు సొంతంగా ప్యానల్ ఏర్పాటు చేసి గెలిపించుకున్నారనీ, రెండుసార్లు ముద్దసాని కనుకయ్య ఒకసారి బొమ్మరాతి రాజేశం మరోసారి డి శంకర్ కు అర్బన్ బ్యాంక్ చైర్మన్ గా అవకాశం కల్పించారని తెలిపారు. తన తండ్రి అర్బన్ బ్యాంకు అభివృద్ధికి ఏ విధంగా కృషి చేశారో.. అదే విధంగా తాను ముందుండి బ్యాంకును అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తాను ముందుండి బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తాననీ, ఎక్కడికెళ్లినా అర్బన్ బ్యాంక్ మెంబర్లు తమ ప్యానెల్ కు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారనీ, వారినీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో తమ ప్యానల్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని రాజేందర్ రావు కోరారు. గతంలో అవినీతి ఆరోపణలు చేసుకున్న వారు ఎన్నికలను ఆపిన వారు మళ్లీ అధికారం కోసం ప్రాకులాడు తున్నారనీ, వారి పట్ల అర్బన్ బ్యాంక్ మెంబర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. వారు మళ్లీ ముందుకు వచ్చి ఓట్లు అడగడం విచిత్రంగా ఉందని పేర్కొన్నారు. అర్బన్ బ్యాంక్ మెంబర్లు అప్రమత్తంగా ఉండి తమ ప్యానెల్ ను ఆదరించాలని రాజేందర్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థులు మూల వెంకట రవీందర్ రెడ్డి, ఇ లక్ష్మణ్ రాజు, అనురాసు కుమార్, వజీర్ అహ్మద్, ఉయ్యాల ఆనందం, చిందం శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, మన్నె అనంత రాజు, మునిఫల్లి ఫణిత, దామెర శ్రీలత రెడ్డి కాంగ్రెస్ నాయకులు, ఆకుల ఉదయ్ అనంతుల రమేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యాప్తంగా ఎడతెరగని వర్షం ఇండ్లలోకి వరద నీరు

హైదరాబాద్ చర్చ ప్రతినిధి.తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు హైదరాబాద్ నగరంతో పాటు జిల్లాల్లోనూ దంచికొడుతున్న వానలు ఇప్పటివరకు నాగర్‌కర్నూల్‌లో 19.9 సెంటీమీటర్ల అత్యధిక భారీ వర్షపాతం నమోదు నల్గొండలో 17.75 సెంటీమీటర్ల అత్యధిక భారీ వర్షపాతం నమోదు నాగర్‌కర్నూల్‌లోని పెద్ద ముద్నూర్‌లో 13.35 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదు వనపర్తిలో 11.4, మహబూబ్‌నగర్‌లో 10 సెం.మీ భారీ వర్షపాతం నమోదు నేడు ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం

## "మొంథా" తుఫాను ప్రభావం తో కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు



చర్చ :- కరీంనగర్ రైతులకు నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, మార్కెటింగ్, రెవిన్యూ, డిఆర్డీఓ సంబందిత శాఖల అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన వరి ధాన్యం నిల్వలతో పాటు ఆయా ప్రాంతాల్లో ఆరబెట్టిన పంట ధాన్యం వర్షానికి తడిసి నష్టపోకుండా రైతులకు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. తుపాను ప్రభావం గురించి రైతులకు తెలియజేస్తూ, అప్రమత్తం చేయాలని తెలిపారు.. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు వరి కోతలు జరపకుండా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు ధాన్యం పంపిన వెంటనే దిగుమతి చేసుకునేలా అధికారులు పర్యవేక్షణ జరపాలని, వెంటవెంటనే ట్రక్ షీట్లు తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేయించాలని అధికారులను ఆదేశించారు.తడిసిన ధాన్యం పాడవకుండా రైతులు వ్యవసాయ అధికారులు సూచించే పద్ధతులు పాటించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలోని రైస్ మిల్లులో భారీ పేలుడు జరిగిన విషయం తెలిసిన వెంటనే పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు శ్రీ గడ్డం వంశీ కృష్ణ గారు ఆ సంఘటనపై ఆరా తీశారు



పెద్దపల్లి జిల్లా :ఎంపీ గారు స్థానిక ఎసిపి శ్రీ కృష్ణ గారితో టెలిఫోన్ ద్వారా మాట్లాడి, జరిగిన ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుత పరిస్థితి, ఎవరైనా గాయపడ్డారా లేదా ప్రాణనష్టం జరిగిందా అనే వివరాలను తెలుసుకున్నారు. అలాగే బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందేలా అధికారులను సూచించారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీ గారు కోరారు. ఘటనపై గాఢమైన విచారం వ్యక్తం చేస్తూ, గాయ పడిన వారికి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి

నల్గొండ జిల్లా చర్చ ప్రతినిధి : పురస్కరించుకొని ప్రజలలో జాతీ య సమైక్యతను దేశభక్తిని పెంపొందించేందుకుగాను, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్ మరియు ఎన్ఎస్ఎస్ సహకారంతో "సర్దార్ ఏ150 యూనిట్ మార్చ్" ను నిర్వహించనున్నట్లు ఎంపీ, రాజ్యసభ సభ సభ్యులు కేసరి దేవ్ సిన్హ జ్వాల తెలిపారు.సర్దార్ఏ 150 యూనిటీ మార్చ్ కార్యక్రమం అమలులో భాగంగా ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్చార్జిగా నియమితులైన ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నల్గొండ, సూర్యాపేట జిల్లాల అధికారుల తో కలిసి మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫెరెన్స్ లో మాట్లాడారు. సర్దార్ ఏ 150 యూనిటీ మార్చ్ కార్యక్రమంలో భాగంగా జాతీయ సమైక్యత,దేశభక్తి ని పెంపొందించడం, ప్రత్యేకించి జాతిని ఏకీకృతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర , జాతి నిర్మాణంలో యువతను ప్రోత్సహించడం ద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 31 నుండి నవంబర్ 25 వరకు జిల్లాలలో విడత లవారీగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, సర్దార్ ఏ 150 యూనిటీ మార్చ్ లో 3 రోజుల పాదయాత్రను జిల్లా స్థాయిలో నిర్వహించాలని, ప్రతి పాదయాత్ర 8 నుండి 10 కిలో మీటర్లు ఉండేలా చూడాలని, ఈ పాదయాత్రలో కనీసం 500 మంది యువత, విద్యార్థులు పాల్గొనేలా చూడాలని ఆయన అధికారులతో కోరారు. సర్దార్ఏ 150 యూనిటీ మార్చ్ నిర్వహించడంలో భాగంగా జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అధికారులతో కోర్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని , ఇందులో విశ్రాంత ఐఏఎస్ అధికారులు, జిల్లా యువజన సర్వీస్ల అధికారి, ఇతర అధికారులు, ప్రతినిధులతో కో-ఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ విషయమై ప్రతివారం జాతీయ స్థాయి కోర్ కమిటీ సమీక్షలు నిర్వహిస్తున్నదని వెల్లడించారు. సర్దార్ఏ150 యూనిటీ మార్చ్ కార్యక్రమాలలో భాగంగా జిల్లా స్థాయిలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితానికి సంబంధించి ప్రజలకు యువతకు తెలియజేయడం, వైద్య శిబిరాల నిర్వహణ ,యోగ క్యాంపులు, ఎగ్జిబిషన్లు, వర్క్ షాప్ ల నిర్వహణ ,కళాశాల,పాఠశాల విద్యార్థులకు డిబేట్,ఇతర కాంపిటీషన్ల నిర్వహణ, వీధి నాటకాలు, ప్రచారాలు, స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టాలని ఆయన తెలిపారు. ఇందుకుగాను ఆయా జిల్లాల వారీగా రూట్ మ్యాప్ ను రూపొందించాలన్నారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాలో నవంబర్ 12, 13 తేదీలలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన జిల్లా యంత్రాంగాన్ని ఇదే అంశంపై నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఎంపీ, రాజ్యసభ సభ్యులు కేసరి దేవ్ సిన్హ జ్వాల ,కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్గొండ జిల్లాలో సర్దార్ ఏ 150 యూనిట్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అడిషనల్ ఎస్పీ రమేష్, డిపిఆర్ఓ వెంకటేశ్వర్లు ,జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎం డి అక్బర్ అలీ, జెడ్పి సీఈఓ శ్రీనివాసరావు, మెప్మా పిడి శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి ,మై భారత్ ప్రతినిధి కృష్ణ ,సామాజిక కార్యకర్త సురేష్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్దార్ ఏ150 యూనిటీ మార్చి పై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- కలెక్టర్ పమేలా సత్పతి**



చర్చ :- కరీంనగర్ తుఫాన్ నేపథ్యంల జిల్లాలో 2 రోజుల పాటు భారీ నుంచి కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ఒక ప్రకటనలో కోరారు.వాతావరణ శాఖ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో అక్టోబర్ 29, 30 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి వనరులలో నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు.జిల్లా వ్యాప్తంగా మత్స్యకారులు ఎవరు చేపలు పట్టడానికి వెళ్ళవద్దని సూచించారు. కల్వర్టులు దాటువద్దని, నీటి వనరుల సమీపంలో ప్రయాణాలు చేయవద్దని, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అత్యవసమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుండి బయటకు రావద్దని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు

# అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు - పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా మెగా రక్తదాన శిబిరం - సీపీ గౌష్ ఆలం








చర్చ :- కరీంనగర్ పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని, బుధవారంనాడు కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలోగల అస్త్ర కన్వెన్షన్ హాలు నందు రక్తదాన శిబిరం (బ్లడ్ డొనేషన్) కార్యక్రమం నిర్వహించినట్లు కరీంనగర్ పోలీసు కమీషనర్ సీపీ గౌష్ ఆలం తెలిపారు. నగరంలోని ఈ కార్యక్రమంలో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీసు కమీషనర్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21 ఇండో - చైనా సరిహద్దుల్లో (లఢక్ ) లో జరిగిన సంఘటనలో 10 మంది జవానులు మృతి చెందినందున ప్రతీ సంవత్సరం అక్టోబర్ నెల 21 వ తేదీన పోలీసు అమరవీరుల దినోత్సవం దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామన్నారు. అక్టోబర్ 21వ తేదీ నుండి 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల సంస్మరణార్ధం వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రజలను భగస్వామ్యులను చేస్తూ పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దీని ముఖ్య ఉద్దేశం శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు తమ విధులను నిర్వహించే విధానాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటు పోలీసు అమరవీరులను స్మరిస్తామన్నారు. ఇందులో భాగంగా మెగా రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. రక్తదానం వలన అత్యవసర పరిస్థితుల్లో రోగి ప్రాణాలను కాపాడుతుందన్నారు. తలసీమియా బాధితులకు ఎంతో అవసరమన్నారు. సామజిక బాధ్యతతో అందరూ రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా 160 యూనిట్లను సేకరించామని , సేకరించిన రక్తాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ సెంటర్ కు అందజేశామని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశ్యంతో అక్టోబర్ 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పోలీస్ కమీషనర్ శ్రీ గౌష్ ఆలం తెలిపారు. ఈ వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఈ పోటీలలో మరియు కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీం రావు, ఏసీపీల ు వెంకటస్వామి, విజయకుమార్, యాదగిరిస్వామి లతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి లతో పాటు వివిధ పలు సంస్థల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# నేడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం: ఎమ్మెల్యే



చర్చ, అశ్వారావుపేట:దమ్మపేట మండలం గండుగులపల్లి ప్రైమరీ స్కూల్ గ్రౌండ్‌లో హైదరాబాద్‌కు చెందిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం నిర్వహిస్తారని, స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా సంపూర్ణంగా నయం చేయవచ్చని, ముఖ్యంగా లక్షణాలు లేకున్నా ముందు జాగ్రత్తగా పరీక్ష చేయించుకోవడం అత్యవసరమని ఎమ్మెల్యే తెలిపారు. 30 ఏళ్లు పైబడిన మహిళలు, పొగాకు ఉత్పత్తులు, మద్యం సేవించే అలవాటు ఉన్నవారు, కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు, తరచూ అనారోగ్య లక్షణాలు, అసాధారణ మార్పులు గమనించినవారు శిబిరానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్య బృందం ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసి, అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యకరమైన జీవనానికి ముందస్తు పరీక్షలు తప్పనిసరని ఎమ్మెల్యే ఆదినారాయణ కోరారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన సుడా చైర్మన్

**- లెక్చరర్లకు తగు సూచనలు చేసి విద్యార్థినులకు భరోసా కల్పించారు**





చర్చ :-బుధవారం : 29గంగాధర మండలం కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఘటన దృష్ట్యా కరీంనగర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను నేడు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి లెక్చరర్లకు సిబ్బందికి ఎప్పట ికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించి విద్యార్థినులకు భరోసా కల్పించారు.కళాశాలలో వసతులపై ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం విద్యకు వైద్యానికి ప్రాధాన్యత ఇస్తుందని సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సాయంత్రం విద్యార్థినులు ఇంటికి వెళ్లే సమయంలో మెయిన్ గేటు వద్ద ఆకతాయిలు ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థినులు సుడా చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే పోలీసు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు పోలీసులు మెయిన్ గేటు వద్ద పర్యవేక్షణ చేసి విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.డిఈవో గంగాధర్,ప్రిన్సిపాల్ నిర్మల, సూపరిం టెండెంట్ కిరణ్ కుమార్,లెక్చరర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## హరీష్ రావుని పరామర్శించిన రేగా, మెచ్చా



**చర్చ, అశ్వరావుపేట:** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మృతిచెందగా, హైదరాబాద్‌లోని హరీష్ రావు స్వగృహానికి వెళ్లిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావులు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హరీష్‌రావును పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పినపాక మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సతీష్ రెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు లక్క మధు, పొనుగోటి కిషన్ రావు ఉన్నారు.

## మొంథా తుఫాన్ ప్రభావంతో నేలవాలిన పంటచేలు






**చర్చ, అశ్వారావుపేట:** ఉమ్మడి తెలుగు రాష్ట్రాలపై మొంథా తుఫాను ప్రభావంతో ప్రజలు వణికిపోతున్నారు. గత మూడు రోజులుగా ఎడితెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కేవలం ఆంధ్రా ప్రాంతమే కాకుండా తెలంగాణా రాష్ట్రంలోని సరిహద్దు ప్రాంతాలు కూడా తడిసి ముద్దయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎక్కడా లేనివిధంగా అశ్వారావుపేట నియోజకవర్గంలోని 52.4 % వర్షపాతం నమోదైంది. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయడంతో వరిపైరు మొత్తం నేలవాలిన పరిస్థితి నెలకొంది. ఆరుగాలం శ్రమించి వేసిన పంటల పరిస్థితి చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన పంట ఎక్కడ నాశనం అవుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి, మినుములు, వరి, అన్ని పంటలు చేతికి వచ్చే సమయానికి ఇలాంటి ఉపద్రవం రావడంతో దిక్కుతోచక అయోమయంలో పడ్డారు. అక్కడక్కడ వర్షభావం వల్ల చెట్ల కొమ్మలు కరెంట్ తీగలపై పడటంతో మంటలు చెలరేగుతున్నాయి. దీనితో అటుగా వెళ్లే ప్రయాణికులు భయందోళనలకు గురి అవుతున్నారు. వెంటనే అధికారులు కరెంట్ వైర్లపై పడిన వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

## లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు అందచేసిన ఎస్పీ



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** నిషేధిత మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ ఇటీవల జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిన ముగ్గురు సభ్యులకు ప్రభుత్వం నుండి మంజూరైన రివార్డు నగదును జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అందించారు. గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ముగ్గురికి రూ.9.5 లక్షల విలువ చేసే చెక్కులను అందించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. రామ్ సింగ్ కొడేకు రూ.5 లక్షలు, ముచ్చికి సోందాల్‌కు రూ.3,75,000, సోడి భీమేకు రూ.75 వేల చొప్పున రివార్డులను ఇచ్చినట్లు వివరించారు. లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నుండి మంజూరైన రివార్డు నగదులను వారి పునరావాసం కోసం అందజేయడం జరిగిందన్నారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో స్వార్థ ప్రయోజనాల కోసం మావోయిస్టు పార్టీ నాయకులు అమాయకులైన ఆదివాసీలను బలవంతంగా తమ పార్టీలోకి చేర్చుకుని, వారిచేత చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయించారని తెలిపారు. లొంగిపోయిన నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ సభ్యులకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు. మిగిలిన నాయకులు, సభ్యులు ఆయుధాలను వీడి ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల హక్కుల తరుపున పోరాడాలని కోరారు. లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునేవారు తమ బంధుమిత్రుల ద్వారా గానీ, స్థానిక పోలీస్ అధికారుల ద్వారా గానీ లేదా స్వయంగా తన వద్దకు వచ్చి లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) నరేందర్, ఆర్ఐ (ఆపరేషన్స్) రవి పాల్గొన్నారు.

## జాబ్ ఆఫర్ లెటర్స్ అందజేసిన ఎమ్మెల్యే మట్టా రాగమయి



**చర్చ, సత్తుపల్లి:** ఇటీవల సత్తుపల్లిలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సింగరేణి సంస్థ వారిచే నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు పొందిన యువతీ యువకులకు జాబ్ ఆఫర్ లెటర్స్‌ను ఎమ్మెల్యే మట్టా రాగమయి అందించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువతీ యువకుల కోసం జాబ్ మేళా నిర్వహించగా, 4,611 మందికి ఉద్యోగాలు లభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. హైదరాబాద్ వెళ్లి జాబ్ కోసం అనేక కంపెనీలు తిరుగుతూ ఇబ్బంది పడే పరిస్థితి రాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో స్థానికంగా జాబ్ మేళా నిర్వహించినట్లు వివరించారు. 80కి పైగా కంపెనీలచే నిర్వహించిన జాబ్ మేళాలో నియోజకవర్గంలోని యువతీ యువకులు ఉద్యోగాలు సంపాదించడం అభినందనీయమన్నారు. జాబ్ మేళాకు సహకరించిన సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు చేసే అవకాశం రావాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా జాబ్ ఆఫర్ లెటర్స్ తీసుకున్న యువతీయువకులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# గ్రామాలను పరిశుభ్రంగా తయారు చేయాలి- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- అనుమతి లేకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారి పై కఠిన చర్యలు
- నవంబర్ 1 నుంచి నవంబర్ 7 వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్
- పంచాయతీ శాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్
- గ్రామాలను పరిశుభ్రంగా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.





**చర్చ:- కరీంనగర్. పెద్దపల్లి**

బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పంచాయతీ శాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, గ్రామాల్లో అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేయరాదని. అక్రమ నిర్మాణాల చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని, నవంబర్ 1నుంచి నవంబర్ 7 వరకు పెద్దపల్లి జిల్లాలోని ప్రతి గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని , గ్రామాలలో ప్లాస్టిక్ ఎక్కడ ఉండడానికి వీలు లేదని, చిన్న కవర్ కూడా ఉండవద్దని, ఆ రితీలో పారిశుధ్య పనులు చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో ఖాళీ స్థలాం ఎక్కడ చెత్త ఉండకుండా చూసుకోవాలని, ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణకు నిర్దిష్ట షెడ్యూలు ఫాలో కావాలని, ప్రజలు ఎవరు బయట చెత్త వేయడానికి వీలు లేదని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాలలో ఉన్న పిచ్చి మొక్కలను, పొదలను పూర్తి స్థాయిలో తొలగించాలని , కాల్వల పక్కన ఉన్న చెత్త శుభ్రం చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, పంచాయతీ భవనం, ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, గ్రామాలలో అందుబాటులో ఉన్న ట్రాక్టర్లను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో స్పష్టమైన మార్పు కనిపించేలాగా పారిశుధ్య నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో పన్ను వసూలు చాలా తక్కువగా ఉందని , నవంబర్ 7 నాటికి కనీసం నిర్దేశించుకున్న లక్ష్యంలో 60% పన్ను వసూలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించడం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాలలో త్రాగునీటి సరఫరా వ్యవస్థను చెక్ చేసుకోవాలని ఎక్కడైనా చిన్న చిన్న ఇబ్బందులు ఏర్పడితే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య , ఎంపిఓ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి అధిక మొత్తంలో కేంద్ర నిధులు

- 15వేల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు
- అంగన్వాడీ టీచర్లకు ఉచితంగా ట్యాబ్స్
- కేంద్ర పథకాల నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లించవద్దు
- ప్రభుత్వాసుపత్రుల్లో మందులకు నిధులు ఇస్తాం
- పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు
- మంజూరైన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, దిశ కమిటీ చైర్మన్ బండి సంజయ్ కుమార్







**చర్చ :- కరీంనగర్** పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, రాష్ట్రంలో అత్యధికంగా కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గానికి కేంద్ర నిధులు తీసుకువచ్చామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, జిల్లా అభివృద్ధి, కోఆర్డినేషన్%డ% మానిటరింగ్ కమిటీ (దిశ) చైర్మన్ బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అభివృద్ధి, కోఆర్డినేషనమానిటరింగ్ కమిటీ (దిశ)సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి ఎన్నో నిధులు మంజూరు చేయించి పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఏ పార్టీకి చెందిన వారైనా నియోజకవర్గ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని తెలిపారు. రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులే కారణమని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని వెల్లడించారు. 851 కోట్ల రూపాయల ఎంపీ నిధులను కరీంనగర్ అభివృద్ధికి కేటాయించామని అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఆధునిక సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో హుజురాబాద్ హుస్నాబాద్ జమ్మికుంట సిరిసిల్ల ఆసుపత్రులకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయిస్తున్నామని, అందుకు తగిన విధంగా సిబ్బందిని వైద్యులను నియమించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు 15వేల సైకిళ్లు ఉచితంగా అందజేశామని మరో 5 వేల సైకిల్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ తగ్గాయని అన్నారు. పీఎం శ్రీ నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్ళిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్స్, మౌలిక సదుపాయాలు అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీ నిధుల ద్వారా మంజూరైన పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. గన్నేరువరం బ్రిడ్జి, కేంద్రం సేతు బంధన్ పథకం ద్వారా మంజూరు చేసిన కరీంనగర్ ఆర్ఓబి నిర్మాణం తదితర పనులన్నీ వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రానున్న నాలుగు సంవత్సరాల కాలానికి సరిపడా మందుల ఇండెంట్ తనకు సమర్పించాలని, నిధులు సమకూరుస్తానని వెల్లడించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. కరీంనగర్ సిరిసిల్ల జిల్లాలోని అంగన్వాడీ టీచర్లకు రోజువారి నివేదికల సమర్పించేందుకు ఉచితంగా ట్యాబ్ అందజేస్తామని తెలిపారు. సోలార్ పవర్ వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలను గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. తన క్షేత్రస్థాయి పర్యటనలో అనేక పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని వెల్లడించారు. కస్తూరిబా పాఠశాలల్లో సిబ్బంది వేతనాలు పెంచాలని, మోడల్ స్కూల్ సిబ్బందికి ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని సూచించారు. మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. విద్య, వైద్యం తదితర రంగాల్లో కేంద్రం అనేక నిధులు వెచ్చించి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకునేలా వారికి గ్రామస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారుల్లో ఉందని అన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సిరిసిల్ల ఇన్చార్జి కలెక్టర్ గరీమా అగర్వాల్, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల విద్యార్థిని శ్రీ వర్షిత కుటుంబాన్ని పరామర్శించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

- శ్రీ వర్షిత ఆత్మహత్య పై విచారణ జరిపించాలి
- శ్రీ వర్షిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి





**చర్చ :- కరీంనగర్** వంగర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న శ్రీ వర్షిత కుటుంబాన్ని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి బుధవారం రోజున స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులు మనోధర్యం కలిగి ఉండాలని, ఆత్మహత్య చేసుకున్న శ్రీ వర్షిత విషయంలో న్యాయం జరిగే వరకూ బిజెపి అండగా ఉంటుందని గంగాడి కృష్ణారెడ్డి భరోసా ఇచ్చి మాట్లాడారు. హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన శ్రీ వర్షిత అనే బాలిక ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. వంగర గురుకు ల రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న శ్రీ వర్షిత ఆత్మహత్య విషయంలో ఆ పాఠశాల ప్రిన్సిపల్ పై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ప్రభుత్వ విద్యావ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు . ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అవసరాలను తీర్చడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని , ఫుడ్ పాయిజన్ లు శర మామూలుగా మారిపోయాయని ఆయన ఘాటుగా విమర్శించారు . విద్యాశాఖను చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ప్రభుత్వ పాఠశాలను చక్కదిద్దాలనే ఆలోచన లేకపోవడం తోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి , సర్కార్ బడులు, రెసిడెన్షియల్ పాఠశాల లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి తక్షణం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఆత్మహత్య చేసుకున్న శ్రీ వర్షిత విషయంలో పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీ వర్షిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో పరామర్శ మండల అధ్యక్షులు రాముల కొమురయ్య , పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు , మండల ప్రధాన కార్యదర్శులు మోడెపు వినయ్, పారిపెల్లి కొండాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు మర్రి రవీందర్, కార్యదర్శి చిదురాల శ్రీనివాస్ రెడ్డి, యువ మోర్చాల అధ్యక్షులు నరెడ్ల చైతన్య రెడ్డి, మహిళా మోర్చాల ప్రధాన కార్యదర్శి బండారి లావణ్య, మీడియా కన్వీనర్ మూదం మధు, పట్టణ కన్వీనర్ గంగిశెట్టి ప్రభాకర్, రాంపూర్ బూత్ అధ్యక్షులు మంతెన వరదేశ్వర్, గాలీబ్ కుమార్, బద్దం రాజీ రెడ్డి, మండల నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్చ
తెలుగు దిన పత్రిక
గురువారం, అక్టోబర్ 30, 2025



# ఒకే ఇంట్లో రెండుసార్లు దొంగతనం చేసి దొరికిపోయిన దొంగ అట్టి వ్యక్తి నుండి సుమారు 12 లక్షల రూపాయలు విలువగల బంగారం సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు

**చర్చ :- కరీంనగర్** కరీంనగర్ రూరల్, తీగలగుట్టపల్లి లోని రెవెన్యూ కాలనీలో ఈ సంవత్సరం ఫిబ్రవరి జూన్ నెలలలో ఒకే ఇంటిలో రెండుసార్లు దొంగతనం జరగగా కరీంనగర్ రూరల్ పిఎస్ లో కేసు నమోదు అయినది కాగా కరీంనగర్ సిపి శ్రీ గౌష్ ఆలం ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ్ కుమార్ గారు అట్టి దొంగతనంలను చేదించుటకై కరీంనగర్ రూరల్ సిఐ ఏ.నిరంజన్ రెడ్డి మరియు సిసిఎస్ సిఐ ప్రకాష్ గౌడ్ లకు అప్పగించగా వారు ఈ కేసును ఛేదించారు, తీగలగుట్టపల్లి లోని రెవెన్యూ కాలనీకి చెందిన మహమ్మద్ ముస్తాక్ తండ్రి అక్బర్ అనునతడు ఆన్లైన్ బెట్టింగ్ గేమ్ డాష్ రమ్మీ అను అప్లికేషన్ను తన ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని గత రెండు సంవత్సరాల నుండి ఆడుతూ అట్టి ఆటకు అలవాటు పడి లక్షల్లో నష్టపోయి అప్పులల్లో కూరుకుపోయి వాటిని తీర్చుటకు దొంగగా మారినాడు, వివరాల్లోకి వెళితే మహమ్మద్ ముస్తాక్ గత సంవత్సరంన్నర నుండి కోదాడ దగ్గరలోని మేళ్లచెరువు వద్ద బాయిలర్ ఆపరేటర్ గా పని చేస్తున్నాడు ఆన్లైన్ బెట్టింగ్ గేమ్ డాష్ రమ్మీ ఆడుటకు అలవాటు పడి తన తల్లిదండ్రులకు తెలియకుండా తన స్నేహితులు మరియు తెలిసిన వారి వద్ద డబ్బులు అప్పుచేసి డాష్ రమ్మి అను ఆన్లైన్ బెట్టింగ్ యాప్ దానిలో ఆడి పోగొట్టుకొని తిరిగి చెల్లించలేక దొంగగా మారాడు ఇందుకోసం ఇదే సంవత్సరం ఫిబ్రవరి జూన్ నెలలో తాళం వేసి




ఉన్న ఇండ్లను గుర్తించి తీగల గుట్టపల్లి లోని ఒకే ఇంట్లో రెండుసార్లు కిటికీ యొక్క గ్రిల్ తొలగించి ఇంట్లోకి చొరబడి బంగారం మరియు నగదును దొంగతనం చేసినాడు మరియు జూబ్లీ నగర్ లోని దర్గా సమీపంలో గల ఒక ఇంట్లోకి చొరబడి టీవీని దొంగలించినాడు. బంగారం ఇక్కడ ఎవరూ కొనక పోవడంతో కోదాడ వెళ్లి అక్కడ అమ్మడానికి ప్రయత్నించాడు అక్కడ కూడా ఎవరూ కొననందున తిరిగి తీగలు గుట్టపల్లి కి వచ్చి కరీంనగర్ లో గాని వరంగల్ లో గాని మంచిర్యాలలో గాని అమ్ముదామని నిర్ణయించుకొని ఈరోజున తీగల గుట్టపల్లి లోని రైల్వే స్టేషన్ కు వచ్చి బయట నిలబడి ఉండగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించుచుండగా కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి మరియు సిబ్బంది పట్టుకొని అతని వద్ద దొంగలించబడిన సొమ్ము సుమారు 91 గ్రాముల బంగారం, 5 వేల రూపాయల నగదు మరియు ఒక సెల్ ఫోను పోలీసులు స్వాధీనపరచుకొని పిఎస్ కు తిరిగి వచ్చి తదుపరి చర్య నిమిత్తం రిమాండ్ కు తరలించనైనది, ఇట్టి దొంగతనంలో కేసుల్లోని నేరస్తుడైన మహమ్మద్ ముస్తాక్ ను పట్టుకున్న కరీంనగర్ రూరల్ సీఐ ఏ.నిరంజన్ రెడ్డి సిసిఎస్ సిఐ ప్రకాష్ గౌడ్ ను ఎస్సై లక్ష్మారెడ్డి మరియు సిసిఎస్ హెచ్ సి ఎండి హసనోద్దీన్ పిసి ఎన్.శేఖర్ పిసి ఎండి ఖలీఫా రూరల్ హెచ్సి శ్రీరాములు పిసి సల్మాన్ లను సిపి గౌష్ ఆలం ఐపిఎస్ గారు ఏసిపి విజయ్ కుమార్ లు అభినందించినారు మరియు సిబ్బందికి నగదు రివార్డును అందజేయనైనది.

# మహా పడిపూజ ఏర్పాట్లను పరిశీలించిన మువ్వా విజయ్ బాబు



**చర్చ, సత్తుపల్లి:** పట్టణంలో జేవీర్ పార్క్ ఎదురుగా ఉన్న హరిహరాత్మజ అయ్యప్పస్వామి ఆలయం దశమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించనున్న మహా పడిపూజ, అన్నదాన ఏర్పాట్లను టీజీఐడిసి చైర్మెన్ మువ్వా విజయ్‌బాబు బుధవారం పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున స్వాములకు, భవానీలకు, భక్తులకు అసౌకర్యం కలగకుండా అయ్యప్పస్వామి ఆలయం ఎదురుగా ఉన్నటువంటి సాయిబాలాజీ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. రాత్రి మహా పడిపూజ అనంతరం కూడా సాయిబాలాజీ ఫంక్షన్ హాల్ నందు అల్పాహారం ఏర్పాట్లు చేస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలయ కమిటీ, అయ్యప్ప స్వాములు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న ఫీస్ రియంబర్స్మెంట్ మరియు ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని లేకపోతే మా ఉద్యమాలతో రాష్ట్రాన్ని రణరంగం గా మార్చుతాం

**-పొన్నం అనిల్ కుమార్ గౌడ్**
**- మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్**




**చర్చ :- కరీంనగర్**
కరీంనగర్ లో పోలీస్ ల నిర్బంధాల మధ్య తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కి భారీగా విద్యార్థులు తరలి వచ్చారు సుమారు 2000 మంది విద్యార్థులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తెలంగాణ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు బారీ ర్యాలీ నిర్వహించారు అక్కడ కలెక్టరేట్ ముందు విద్యార్థులు వారికి రావలసిన పెండింగ్ లో ఉన్న ఫీస్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ గర్జించారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ గ్రంథాలయం సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక తుగ్లక్ పాలన నడుస్తుందని విద్యాశాఖని సీఎం తన దగ్గరనే పెట్టుకుని ఎలాంటి రివ్యూ లు లేకుండా ఎవరు ఏది ప్రశ్నించినా స్పందించకుండా నియంత పాలన కొనసాగిస్తున్నాడని తెలంగాణ రాష్ట్రం లోని విద్యార్థులు పట్ల ఈ ప్రభుత్వం మొండి వైఖరి నశించాలని



అన్నారు , సీఎం ఇప్పటికైనా పెండింగ్ లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థుల కొరకై పోరాటంలో ముందుండి అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకుని సీఎం కన్ను తెరిచి బుద్ధి తెచ్చుకునే వరకు రాష్ట్రాన్ని రణరంగం చేసి వెంబడిస్తామని హెచ్చరించారు కరీంనగర్ లో ఎక్కడా లేని విధానంగా పోలీస్ లు విద్యార్థుల ను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు కళాశాలల యాజమాన్యాలను బెదిరించారని కానీ నిర్బంధాలన న్నింటినీ తెంచుకుని ఇంత పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలియ చేశారు , పోలీస్ ల లాటి లు తూటా లు విద్యార్తుల ఉద్యమాలకు అడ్డు కాలేవని నిరూపించారని అన్నారు ఇది ఆరంభం మాత్రమే అని ఇక నుండి ప్రత్యేక కార్యాచరణ రూపొందిశ్రామని అన్నారుదీ.జిల్లా కోఆర్డినేటర్ ధ్యావ మధుసూదన్ రెడ్డి గారు మాట్లాడుతూ విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం బాగుపడలేదని ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా విద్యార్థుల ఆర్తనాదాలతో చెలగాటం ఆడుతోందని వారి ఉద్యమ పోరాటం ఒక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిందని ఇప్పుడు కూడా ప్రభుత్వం స్పందించకపోతే ఈ



ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ , జిల్లా కోఆర్డినేటర్ ధ్యావ మధుసూదన్ రెడ్డి , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, బండారపు అజయ్ కుమార్ గౌడ్ , శాతవాహన యూనివర్సిటీ ఇంచార్జ్ చుక్కా శ్రీనివాస్ , నగర అధ్యక్షులు బొంకూరి మోహన్ , శాతవాహన జాక్ నేత చెన్నమళ్ల చైతన్య ,ఆరే రవి గౌడ్ , నియోజక వర్గ యూత్ అధ్యక్షులు గంగాధర చందు , నారదాసు వసంత్ ,వడ్లకొండ పరుశురామ్ , రవి తేజ మున్నా ,బండ వేణు యాదవ్ , ధీరజ్ , పబ్బతి శ్రీనివాస్ రెడ్డి,ఆవుల తిరుపతి , ఒడ్నాల రాజు , ఆలేటి శ్రీరామ్ , సుమంత్ , ఓంకార్ , మణి దీప్ నాయుడు , దినేష్ , తరుణ్ , రావణ్ , కొమ్ము నరేష్ , వొళ్లాల శ్రీకాంత్ , అనిల్ , కౌశిక్ , సంపత్ , హరీష్ , శివ , అకిల్ , అంజి , ప్రశాంత్ , తిరుపతి , జగదీష్ , కైఫ్ ,సాయి తదితరులు జిల్లా లోని మరియు నాయకులు పాల్గొన్నారు.విద్యార్థి నాయకులను తోపులాటలో మధ్యలో అక్రమంగా అరెస్ట్ చేసి కి తరలించారు ..

# వరి రైతుకు తీరని నష్టం




**చర్చ, సత్తుపల్లి:**మొంథా తుఫాన్ ప్రభావం సత్తుపల్లి నియోజకవర్గంపై తీవ్రంగా పడింది. మంగళవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జన జీవనం స్థంభించింది. అకాల వర్షానికి వరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వరి పంటలు కోతలు కోసి ధాన్యం రాశులను కల్లాల్లో అరబోయటంతో వర్షానికి తడిసి ముద్దైంది. కొన్నిచోట్ల వరిపైరు నేల వాలిపోయింది. చేతికి వచ్చిన పంట తుఫాన్ ప్రభావంతో నీట మునగటంతో అన్నదాతలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క వర్షంతోపాటు చల్లటి ఈదురు గాలులు వీస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు.

# నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి సింగరేణికి రూ.7 కోట్ల నష్టం




**చర్చ, సత్తుపల్లి:**మొంథా తుఫాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సత్తుపల్లి పరిధిలోని ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. ఓసీలలోని క్వారీల్లోకి భారీగా వర్షం నీరు వచ్చి నిలిచింది. సింగరేణి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఓసి1, ఓసీ2 లలో సుమారు 35,000 టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. సుమారు రూ.7 కోట్ల నష్టం జరిగిందని అధికారులు తెలియజేశారు. వర్షం ఇదేవిధంగా కొనసాగితే నష్టం శాతం ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఐ

# సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను విజయవంతం చేయండి

**- బిజెపి సీనియర్ నాయకులు, స్టాచు ఆఫ్ యూనిటి ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ గుజ్జ శ్రీనివాస్**

**చర్చ :- కరీంనగర్** అక్టోబర్ 31 సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతిని పురస్కరించుకొని పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయడానికి నగర బిజెపి పశ్చిమ జోన్ బిజెపి బాధ్యులందరూ కృషి చేయాలని బిజెపి సీనియర్ నాయకులు, స్టాచు ఆఫ్ యూనిటి ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ గుజ్జ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం రోజున కరీంనగర్లో బిజెపి పశ్చిమ జోన్ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుజ్జ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. ప్రధానంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా పార్టీ



ఆధ్వర్యంలో ఐక్యత మార్చ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 31వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు కరీంనగర్లోని తెలంగాణ చౌక్ నుండి ఈ ఐక్యత మార్చ్ ప్రోగ్రాం ప్రారంభమవుతుందన్నారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి శ్రేణులు అందరూ పాల్గొని ప్రోగ్రాంలో సక్సెస్ చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు, పశ్చిమ జూన్ అధ్యక్షులు జాడి బాల్ రెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి, ఎన్నం ప్రకాష్, బండ రమణారెడ్డి, బేతి మహేందర్ రెడ్డి, బండారు శ్రీనివాస్, తిరుమల్ రెడ్డి, కొంగల రాజిరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు భోనస్ డబ్బులు వెంటనే విడుదల చేయాలి

**- బుగ్గా రం ఎక్స్ రోడ్డులో రైతులు, బీజెపి నేతల నిరసన**




**జగిత్యాల, అక్టోబర్ 29:** రైతులు పండించే సన్న వడ్లకు క్వింటాల్ కు ఇస్తానన్న ఐదు వందల బోనస్ ను వెంటనే విడుదల చేయాలని బుగ్గా రం గ్రామ రైతులు, బీజెపి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బుగ్గా రం ఎక్స్ రోడ్డులో తమ బోనస్ విడుదల చేయాలనే డిమాండ్ తో చేపట్టిన ధర్నా కార్యక్రమానికి బీజెపి నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్బంగా ప్రభుత్వం రైతులు పండించే సన్న వడ్లకు చెల్లిస్తామ్మన్న బోనస్ సొమ్ములు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా కు దిగారు. దీంతో ధర్మ పురి- జగిత్యాల రహదారి పై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ రైతులు నినాదాలు చేశారు. ఈ ధర్నాకు సంఘీభావ మద్దతు ను తెలిపిన బీజెపి మండల అధ్యక్షులు మేడవేణి శ్రీధర్, మంచే రాజేష్ లు మాట్లాడారు. ఎన్నికల హామీలో రైతులు పండించే సన్న వడ్లకు ఐదు వందలు బోనస్ గా చెల్లిస్తామని ఇచ్చిన హామీ హామీగానే మిగిలిపోయిందన్నారు. అరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్న ల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి బకాయి ఉన్న బోనస్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటను విక్రయించి అరునెలలు గడుస్తున్నా బోనస్ డబ్బులు అందక రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం బోనస్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో బుగ్గా రం రైతులు, బీజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాల్వంచ సొసైటీ ద్వారా 5 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

**చర్చ, పాల్వంచ:**పాల్వంచ కో%-%ఆపరేటివ్ సొసైటీ ద్వారా మండలం పరిధిలో 5 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ మద్దతు ధరకు రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయనున్నామని సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ సహకార సంఘం కార్యాలయంలో బుధవారం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండల పరిధిలోని రెడ్డిగూడెం(ప్రభాత్ నగర్), కారేగట్టు, సోములగూడెం, నాగారం, మున్సిపాలిటీ పరిధిలోని పేటచెరువు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఈ సంవత్సరం వరి ధాన్యం



సాధారణ రకం రూ.2,369/%-%, ఏ%-%గ్రేడ్ రకం రూ.2,389/%-% ప్రభుత్వ మద్దతు ధర ప్రకటించింది అన్నారు. సన్నరకం దాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వనున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రామమోహనరావు, కనగాల నారాయణరావు, చౌగాని పాపారావు, సామా జనార్ధన రెడ్డి, జరభన సీతారాం బాబు, భూక్య కిషన్, ఎర్రంశెట్టి మధుసూదన్ రావు, కార్యదర్శులు బివి ప్రసాద్, జి. లక్ష్మీనారాయణ, ఏఈఓ అణురిక, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష

**చర్చ, కొత్తగూడెం లీగల్:**అక్రమ సంబంధం నేపథ్యంలో భార్య, భర్తల మృతికి కారణమైన వ్యక్తికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.కిరణ్ కుమార్ బుధవారం తీర్పు చెప్పారు. కేసు పూర్వాపరాలిలా ఉన్నాయి. ఎల్బీనగర్‌కు చెందిన పిప్పళ్ళ రాజేశ్వరికి డోర్నకల్ మండలం చిక్కుడు గ్రామానికి చెందిన కొలిపాక అశోక్‌తో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహానంతరం వారు పాల్వంచ మండలం మంచికంటినగర్‌లో ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నారు. కొద్దిరోజుల తరువాత రాజేశ్వరికి ఎదురింటిలో ఉండే మాచర్ల ఏసుబాబుతో పరిచయం ఏర్పడి తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండగా, భర్త అశోక్ పెద్ద మనుషుల వమక్షంలో పంచాయతీ చేసి సర్దిచెప్పారు. అయినప్పటికి రాజేశ్వరి.. యేసుబాబుతో మాట్లాడుతుండటంతో 2019 నవంబర్ 5న అశోక్ తన భార్యను రాడ్డుతో తలపై కొట్టి, అతను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య రాజేశ్వరి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతులకు పిల్లలు ఉన్నారు. మృతురాలి సోదరి సుమలత ఫిర్యాదు మేరకు అప్పటి పాల్వంచ టౌన్ ఎస్సై జె. ప్రవీణ్ కేసు నమోదు చేయగా, అప్పటి సర్కిల్ ఇన్స్%వా%్పక్టర్లు ఎం.అబ్బయ్య, పి. నవీన్‌లు దర్యాప్తుచేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. 16 మంది సాక్షులను విచారించిన అనంతరం ఏసుబాబుపై నేరం రుజువు కావడంతో ఏడు సంవత్సరాల కఠిన కారగార శిక్ష, రూ.10 వేల జరిమానా చెల్లించాలని, జరిమానా చెల్లించని యెడల మూడు నెలల సాధారణ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారం రాజారావు నిర్వహించగా, కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్సై జి. రాఘవయ్య, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్, ( కోర్టు డ్యూటీ ఆఫీసర్) పిసి జరుపుల రవిలు సహకరించారు.

# సాంబాయిగూడెంలో 30 కుటుంబాలు సిపిఐలో చేరిక






**చర్చ, మణుగూరు:**మండల పరిధిలోని సాంబయ్యగూడెం గ్రామానికి చెందిన సుమారు 30 కుటుంబాలు సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా సమక్షంలో పార్టీలో చేరగా, వీరికి ఎర్రజెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సాంబాయిగూడెం గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం పులిగల రమేష్ అధ్యక్షత జరిగిన సమావేశంలో సాబీర్ పాషా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిన 100 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసినట్లు చెప్పారు. భూస్వాములకు వ్యతిరేకంగా, పీడిత ప్రజానీకానికి అండగా ఉంటూ, కార్మిక, కర్షక, పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యల సాధన కోసం పనిచేస్తుందని అన్నారు. పినపాక నియోజకవర్గంలో గల్లీ నుంచి ఢిల్లీ వరకు అనేక పదవులు అనుభవించిన చరిత్ర సిపిఐదని అన్నారు. అధికారం ఉన్నా లేకున్నా పేద ప్రజల కోసం నిత్యం పనిచేసే కమ్యూనిస్టు పార్టీని ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరడం శుభ పరిణామం అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి పనిచేసి ముందుకు సాగాలన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతజయంతి ముగింపు వేడుకల్లో ప్రతి ఒక్కరు కదం తొక్కాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ అనునిత్యం పేద ప్రజల సమస్యల పట్ల నిత్యం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీకుమారి, మణుగూరు మండల, పట్టణ కార్యదర్శులు జక్కుల రాజబాబు, దుర్గ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, మాజీ ఎంపిపి ఎడారి రమేష్, సొందే కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజులు భారీ వర్షాలు

**– ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**



**చర్చ, జగిత్యాల, అక్టోబర్ 29:** రాష్ట్రంలో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జగిత్యాల జిల్లా ప్రజలు అందరూ అప్రమత్తం గా వుండాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ కోరారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో అక్టోబర్ 29, 30 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అందరు అధికారులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి వనరులలో నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్ళవద్దని కలెక్టర్ కోరారు. కల్వర్టులు దాటవద్దని, నీటి వనరుల సమీపంలో ప్రయాణాలు చేయవద్దని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుండి బయటకు రావద్దని కలెక్టర్ కోరారు.

# వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే పాయం








**చర్చ, మణుగూరు:**మండలంలోని అశోక్ నగర్‌లోగల గిరిజన బాలుర వసతి గృహాన్ని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అమలు చేస్తున్న భోజన మెనూ గురించి ఆరా తీశారు. హాస్టల్ పరిసర ప్రాంతాలు, సౌకర్యాల గురించి స్వయంగా విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, కావాల్సిన ఇతర మౌలిక సదుపాయాల గురించి ఆరాదీశారు. విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన ఆహారాన్ని పరిశీలించారు. స్వయంగా తరగతి గదులకి, విశ్రాంతి గదులను, వంటశాల, స్టోర్ రూములకు వెళ్లి పరిశీలించారు. వసతి గృహాల్లో చేరిన విద్యార్థుల సంఖ్యను ధ్రువీకరించి, ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులకు కల్పించే వసతి సౌకర్యాలను హాస్టల్ సిబ్బంది తెలిపారు. విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాస్మెటిక్ చార్జెస్ పెంచడం జరిగిందని చెప్పారు. విద్యార్థులకు ఉన్నతమైన విద్య, పౌష్టిక ఆహారం, వసతులు విషయంలో రాజీ పడకుండా నిధులను మంజూరు చేస్తుందని, విద్యార్థులందరూ శ్రద్ధగా చదువుకొని ఉన్నతమైన స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మహిళా నాయకురాలు మానస తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్ స్థల పరిశీలన చేసిన పాయం




**చర్చ, మణుగూరు:** స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్టాండ్ ఏర్పాటు చేయాలని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌కు సూచించారు. ఈ మేరకు బస్టాండ్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కమిషనర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. అనంతరం ప్రజలతో మమేకమై వారితో కూర్చుని టీ తాగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు, సమస్యల పరిష్కారానికి ఈ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మండలం ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు షెల్టర్స్ ఏర్పాటు చేయాలి

**- ఎస్ఓ టు జిఎంకు ఐఎఫ్‌టియు వినతి**



**చర్చ, మణుగూరు:**సింగరేణి మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు రక్షణతో కూడిన షెల్టర్స్ ఏర్పాటు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలనీ కోరుతూ ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఏరియా ఇన్‌ఛార్జ్ ఎస్ఓ టు జిఎం డి.వి.రామారావుకి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్.డి. నాసర్ పాషా మాట్లాడుతూ మణుగూరు ఏరియా ఎస్ అండ్ పిసీకి అనుబంధంగా పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు సంబంధించి అటవీ ప్రాంతాలలో కొన్ని చోట్ల రక్షణతో కూడిన షెల్టర్స్ లేని కారణంగా ప్రమాద సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. మంగళవారం సెకండ్ షిఫ్ట్‌లో ఓసి%-% 2 అటవీ ప్రాంతంలో డ్యూటీలో ఉన్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ డి. శ్రీనివాస్ పాముకాటుకు గురయ్యారని, అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడని అన్నారు. విష సర్పాలు, మృగాలు, వర్షాలు, ఎండలు, ప్రమాదాలకు అవకాశం ఉన్న సెక్యూరిటీ పోస్ట్‌లను గుర్తించి రక్షణతో కూడిన షెల్టర్స్ ఏర్పాటు చేయాలని, లైటింగ్ ఏర్పాటు, పిచ్చి మొక్కలు తొలగించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగోత్ మంగీలాల్ పాల్గొన్నారు.

# పేకాట ఆడుతున్న మహిళలపై కేసు

**చర్చ, ములకలపల్లి:**పేకాట ఆడుతున్న మహిళలు పోలీసులకు పట్టుబడ్డారు. మండల పరిధిలోని మాధారం గ్రామంలో బుధవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మాధారం గ్రామ శివారులో పేకాట అడుతున్నారనే సమాచారంతో స్థానిక పోలీసులు పేకాట స్థావరంపై దాడులు చేశారు. అయితే పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు అక్కడి దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయారు. పేకాట ఆడుతున్నది మహిళలు అని తెలియడంతో అవాక్కయ్యారు. ఐదుగురు మహిళలతోపాటు మరో వ్యక్తి కూడా పేకాట ఆడుతూ అడ్డంగా దొరికిపోయారు. వారి వద్ద నుంచి రూ.5,150 నగదును, ఒక సెల్ ఫోన్ స్వాధీనపరుచుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మదు ప్రసాద్ తెలిపారు.

# జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవల కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి

**- 1 కోటి 50 లక్షల సి ఎస్ ఆర్ నిధులతో 15 రకాల వైద్య పరికరాలను అందించిన కేంద్రమంత్రి బండి సంజయ్**

**- రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధిని విస్మరించిం జమ్మికుంట ఆసుపత్రిలో అనేక సమస్యలున్నాయి**

**- జమ్మికుంట ప్రభుత్వాసుపత్రికి అవసరమైన వైద్యులను వెంటనే నియమించాలి**

**- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**





**చర్చ :- కరీంనగర్**


జమ్మికుంట ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పనిచేస్తున్నారని , ఆ దిశగా రూ.1 కోటి 50 లక్షల సి ఎస్ ఆర్ నిధులతో 15 రకాల విలువైన వైద్య పరికరాలు సామాగ్రిని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అందించారని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సిఎస్ఆర్ నిధులతో వైద్య పరికరాలను అందజేసిన నేపథ్యంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి బుధవారం రోజున స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆస్పత్రి స్థితిగతులను గంగాడి కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తుందన్నారు. జమ్మికుంట ప్రాంతంలో పేద , మధ్యతరగతి ప్రజల ఆరోగ్య సమస్యలకు పెద్ద దిక్కుగా ఉన్న జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో నేడు అనేక సమస్యలతోకొట్టుమిట్టాడుతుందన్నారు. ఆసుపత్రిలో వివిధ విభాగాల కు అవసరమైన వైద్యుల కొరత ఇక్కడ తీవ్రంగా ఉందన్నారు. సరైన మందులు, ఆరోగ్య పరీక్షలు కూడా లభించలేని స్థితిలో జమ్మికుంట ప్రభుత్వాసుపత్రి ఉందన్నారు. ఇక్కడి ఆసుపత్రిలో అవసరమైన వైద్య సేవలు లభించకపోవడంతో జమ్మికుంట ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇక్కడి ప్రాంత ఆస్పత్రి సమస్యలను తెలుసుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ జమ్మికుంట ఆసుపత్రి కి అవసరమైన వైద్య పరికరాల కొరతను తీర్చాలనే ఉద్దేశంతో, పేద మధ్యతరగతి ప్రజల ఆరోగ్య అవసరాల కోసం వినియోగించే విలువైన 15 రకాల వైద్య పరికరాలను అందించారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల సమస్యల పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా తమ పద్ధతి మార్చుకోవాలని , ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రధానంగా జమ్మికుంట ప్రభుత్వాసుపత్రిలో వివిధ విభాగాల్లో పని చేసే వైద్యుల కొరత తీవ్రంగా ఉందని , వెంటనే ఆ సమస్యను పరిష్కరించడానికి , ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావుని పరామర్శించిన సర్దార్ రవీందర్ సింగ్



**చర్చ :- కరీంనగర్** తెలంగాణ రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు గారి తండ్రి తన్నీరు సత్యనారాయణ గారు అనారోగ్యంతో మరణించడం బాధాకరమని సర్దార్ రవీందర్ సింగ్ గారు పేర్కొన్నారు.నేడు తన్నీరు హరీష్ రావు గారి ఇంటి వద్ద ఉన్న కీ..శే.. తన్నీరు సత్యనారాయణ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన కరీంనగర్ జిల్లా మాజీ మేయర్ , రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ గారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన్నీరు సత్యనారాయణ మృతి చెందడం కుటుంబానికి ఎంతో లోటు అని అన్నారు. అనంతరం తన్నీరు సత్యనారాయణకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.ఈ కార్యక్రమానికి న్యాయవాది తేజ్ దీప్ రెడ్డి , విద్యార్థి జెఏసి నాయకులు సూర రాము యాదవ్ , కరీంనగర్ జిల్లా ఫిల్టర్ బెడ్ యూనియన్ అధ్యక్షులు సాయి ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం సమీపంలో మొంథా ఆరు గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం




**భద్రాచలం :** మొంథా తుపాన్ క్రమంగా బలహీనపడుతోంది. ఇప్పటికే తీవ్ర వాయుగుండంగా బలహీనపడ్డ మొంథా.. ఉత్తర వాయువ్య దిశగా కదులుతోంది. భద్రాచలం పట్టణానికి సమీపంలో ఉన్న ఈ తీవ్ర వాయుగుండం రాబోయే ఆరు గంటల్లో వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.మొంథా తుపాన్ తీవ్ర వాయుగుండంగా మారి ఉత్తర వాయవ్య దిశగా కదులుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. గడిచిన ఆరు గంటల్లో 15కి.మీ. వేగంతో ఉత్తర వాయువ్య దిశగా కదిలిందని పేర్కొంది. ఇవాళ ఉదయం 8.30 గంటల సమయానికి తెలంగాణ ప్రాంతంలో 17.3 ఉత్తర అక్షాంక్షం, 81.2 తూర్పు రేఖాంశంలో భద్రాచలానికి 50 కి.మీ. దూరంలో, ఖమ్మం పట్టణానికి తూర్పున 110 కి.మీ. దూరంలో ఇది కేంద్రీకృతమైందని చెప్పింది. నైరుతి దిశలో ఒడిశాలోని మల్కాన్‌గిరికి 130 కి.మీ. దూరంలో, ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌కు 220 కి.మీ. దూరంలో కేంద్రీకృతమైందని తెలిపింది. ఇది ఏపీ, దానికి ఆనుకుని ఉన్న తెలంగాణ, దక్షిణ చత్తీస్‌గఢ్ మీదుగా ఉత్తర వాయువ్య దిశగా కదులుతోందని చెప్పిందది. రాబోయే ఆరు గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని అంచనా వేసింది.శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, ఏలూరు, పశ్చిమ గోదావరి, గుంటూరు, బాపట్ల, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కోస్తా జిల్లాలో గంటకు 60 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది. తీరం వెంబడి గంటకు 45 నుంచి 65 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. రాష్ట్రంలోని అన్ని పోర్టులకు మూడో నంబర్ ప్రమాద హెచ్చరికను జారీ చేసింది. పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రేపు ఉత్తరాంధ్రలోని అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది.

## భారీ వర్షానికి శ్రీశైలం ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండచరియలు



**శ్రీశైలం :** మొంథా తుఫానుప్రభావంతో ఏపీ వ్యాప్తంగా భారీ వర్షాలు ) కురుస్తున్నాయి. కుండపోత వర్షాలకు నదులు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. తాజాగా భారీ వర్షాలకు శ్రీశైలం ఘాట్‌రోడ్డులో భారీ కొండచరియలు విరిగిపడ్డాయి.తుఫాను ప్రభావంతో శ్రీశైలం లో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. ఈ వర్షానికి డ్యామ్ ఘాట్ రోడ్డుపై భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. అప్రమత్తమైన పోలీసులు జేసీబీ సాయంతో రోడ్డుపై పడిన బండరాళ్లను తొలగిస్తున్నారు. మరోవైపు లింగాలగట్టు చెక్ పోస్ట్ వద్ద వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది.

## మొంథా తుపాన్ ఎఫెక్ట్ 127 రైళ్లు రద్దు




**అమరావతి, అక్టోబరు 29:** మొంథా తుపాను, భారీ వర్షాల నేపథ్యంలో భారీగా రైళ్లు రద్దయ్యాయి. 127 రైళ్లను రద్దు చేసినట్లు గా దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. మరో 14 రైళ్లను దారి మళ్లించినట్లు పేర్కొంది. ఫలక్‌నుమా, ఈస్ట్ కోస్ట్, గోదావరి, విశాఖ, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు వెల్లడించింది.భారీ వర్షాల కారణంగా పలు రైల్వే స్టేషన్లలో రైళ్లు నిలిచిపోయాయి. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా గుండ్రాతిమడుగులో కోణార్క్ ఎక్స్‌ప్రెస్, డోర్నకల్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయాయి. ఏపీలోకి కృష్ణా జిల్లా కొండపల్లిలో సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. ఇక మరో 12 గూడ్స్ రైళ్లు ఏపీలో పలు రైల్వే స్టేషన్లలో ఆగిపోయాయి. భారీ వర్షాల నేపథ్యంలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని రైల్వే శాఖ సూచించింది. రద్దయిన రైళ్ల వివరాలను ప్రయాణికుల మొబైల్‌కు పంపించినట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్లలో టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులకు పూర్తి స్థాయి రిఫండ్ చేయనున్నట్లు వెల్లడించారు. తమ ప్రయాణానికి ముందే తమ ప్రయాణించాల్సిన రైలు స్టేటస్‌ను తెలుసుకోవాలన్నారు.

## మొంథా తుపాన్ బాధితులకు ఆర్థిక సాయం




**అమరావతి, అక్టోబరు 29 :** మొంథా తుపాన్ బాధితులకు ఏపీ ప్రభుత్వం అండగా నిలబడింది. వారికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. పునరావాస కేంద్రాలకు వచ్చిన బాధితులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది.కుటుంబంలో ముగ్గురి కంటే ఎక్కువ ఉన్నప్పటికీ.. ఒక కుటుంబానికి గరిష్ఠంగా రూ.3వేలు నగదు అందజేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. పునరావాస కేంద్రం నుంచి ఇంటికి వెళ్లేముందు ఈ డబ్బును అందజేయనున్నారు. ఈ మేరకు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సీఎస్ సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.మరోవైపు తుపాన్ ప్రభావిత ప్రాంతాలను ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పరిశీలించారు. హెలికాప్టర్‌లో ఏరియల్ వ్యూ ద్వారా ఆయా ప్రాంతాలను ఆయన పరిశీలించారు. బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఏలూరు, కోనసీమ జిల్లాల్లోని ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలిస్తున్నారు.మొంథా తుపాన్ ప్రభావంపై తన కార్యాలయ అధికారుల ద్వారా క్షేత్ర స్థాయిలో పవన్ కల్యాణ్ సమాచారం తెలుసుకుంటున్నారు. అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్ల నుంచి పేషీ అధికారులు క్షేత్ర స్థాయి సమాచారం తీసుకొన్నారు. అర్ధరాత్రి తుపాను తీరం దాటిన క్రమంలో తీవ్రమైన ఈదురు గాలులు, భారీ వర్షాల మూలంగా కలిగిన నష్టంపై వివరాలు తెలుసుకున్నారు.పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటంతో విద్యుత్ తీగలు పడటం, అదే విధంగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన క్రమంలో వాటి పునరుద్ధరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

# చచ్చినా.. చావేనా..!?





- స్మశానవాటిక లేక అంత్యక్రియలకు అంతరాయాలు.. - వైకుంఠధామానికి నోచుకోని పరదేశీయులు ప్రాంతాలు











**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :** వివిధ కారణాలతో చనిపోయిన వారికి ప్రశాంతంగా అంత్యక్రియలు కూడా నిర్వహించలేని పరిస్థితి నెలకొందంటూ పరదేశీ కుటుంబాలవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబాలు నివసించే ప్రాంతాల్లో వైకుంఠధామాలు ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడ తమవారి దహన సంస్కారాలు నిర్వహించాలంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి తమ సమస్యకు పరిష్కారం చూపే నాధుడే కరువయ్యాడని వాపోతున్నారు. ఎవరికి విన్నవించినా ఫలితం మాత్రం దక్కడం లేదని, గత ప్రభుత్వ హయాంలో అన్ని ప్రాంతాలకు వైకుంఠధామాలు ఏర్పాటు చేసినా తమకు మాత్రం ఆ భాగ్యం దక్కలేదని అంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణ పరిధిలోని 13, 14, 15వ నెంబర్ బస్తీలు, జగదాంబ సెంటర్, కొత్త కాలనీ, జెకె కాలనీ, వెంగళరావు కాలనీ, లలితాపురం మెయిన్‌రోడ్ తదితర ప్రాంతాల్లో ఉత్తర భారతానికి చెందిన పాసి, కోరి, లోథ్ కుటుంబాలవారు అధిక సంఖ్యలో నివాసం ఉంటున్నారు. అయితే వీరి కుటుంబాల్లో మతిచెందిన వారికి అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా స్మశానవాటిలు లేకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

**- వానొస్తే అంత్యక్రియలకు ఆటంకమే...**

పరదేశీయులకు ప్రత్యేకంగా స్మశానవాటిక లేకపోవడంతో వారు ఏదో ఒక ప్రాంతాన్ని వెతుక్కుని తమ బంధువుల అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తుంది. దీంతో ఆ ప్రాంతంలో సౌకర్యాలు లేక, పిచ్చిమొక్కలు పెరిగిపోయి భయం భయంగా అంతిమ సంస్కారాల్లో పాల్గొంటున్నారు. ఎండాకాలంలో నిలువ నీడ లేకపోవడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన వారు చెట్టుకొకరు, పుట్టకొకరు నిలబడాల్సి వస్తోంది. ఇక వర్షం వచ్చిందంటే అంత్యక్రియలు సైతం నిలిచిపోయే పరిస్థితి దాపురించింది. ఒకవైపు వర్షం వస్తుంటే మరోవైపు పక్కనే ఉన్న సమాధుల వద్ద నిలబడి అంత్యక్రియలను చూడాల్సి వస్తుందని వాపోతున్నారు. పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి పాములు, తేళు వంటి విష జీవులు సంచరిస్తున్నాయని, ఫలితంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని అంటున్నారు.

**స్నానాలు, క్షవరాలకూ తప్పని ఇబ్బందులు**

అంత్యక్రియలు పూర్తయిన తరువాత నిర్వహించే స్నానాలు, క్షవరాల వంటి కార్యక్రమాలకు అవసరమైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదని అంటున్నారు అక్కడివారు. ట్యాంకర్ మాట్లాడుకుని తీసుకు వచ్చి, ఆ ట్యాంకర్ నీటితో స్నానాలు చేస్తున్నామని, మహిళలు అయితే స్నానాలు చేసేందుకు, దుస్తులు మార్చుకునేందుకు సదుపాయాలు లేవని వాపోతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడిగేందుకు వచ్చిన ప్రతీసారి నాయకులకు తమ సమస్యను విన్నవిస్తున్నామని, కాని వారు పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరదేశీయులు నివసించే ఎక్కువ శాతం ప్రాంతాలు సింగరేణి సంస్థ పరిధిలో ఉన్నందున కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద అయినా సంస్థ స్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని పరదేశీయులు కోరుతున్నారు.

**ప్రత్యేకంగా స్మశాన వాటికను కేటాయించాలి**

**: రామ్ లాల్ పాసి**



పరదేశీయులు నివాసం ఉండే 13, 14, 15వ నెంబర్ బస్తీలు, జగదాంబ సెంటర్ , కొత్త కాలనీ, జెకె కాలనీ, వెంగళరావు కాలనీ, లలితాపురం మెయిన్‌రోడ్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా స్మశాన వాటికలను ఏర్పాటు చేయాలి. దహన సంస్కారాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి. సింగరేణి యాజమాన్యం కాని, ప్రభుత్వం కాని తమ సమస్యను పరిష్కరించేందుకు కషి చేయాలి.

**పంపులు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలి**

**: అనిత పాసి**



స్మశాన వాటికల్లో అవసరాల మేరకు మహిళలు స్నానం చేసేందుకు, దుస్తులు మార్చుకునేందుకు అవసరమైన పంపులు, గదులు నిర్మించాలి. అదేవి ధంగా షెడ్లు ఏర్పాటు చేస్తే వర్షాకాలం, ఎండాకాలంలో అంత్యక్రియలు చేసేంధుకు వచ్చిన వారికి నీడ లభిస్తుంది.

**ప్రజా ప్రతినిధులు స్పందించాలి**

**: ఊర్మిళా భాయి పాసి**



ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు స్పందించి మేం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. గతంలో ఇల్లందు 15వ నెంబర్ బస్తిలో స్నాన ఘట్టాల కోసం స్థలాన్ని కేటాయించి ఎటువంటి గదులు నిర్మించకపోవడంతో ఆ ప్రాంతమంతా పిచ్చి మొక్కలతో పెరిగిపోయింది. గతంలో ఎమ్మెల్యే, మాజీ మున్సిపల్ చైర్మన్ ఈ ప్రాంతానికి వచ్చి సందర్శి ంచి గదులు నిర్మాణం చేపడతామని చెప్పి వెళ్లారు. ఇక్కడ ఎటు వంటి పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

**వందేళ్ళ చరిత్ర ఉన్నా వైకుంఠధామం లేని దుస్థితి**

**: చిన్న రాజ్ కుమార్ ఆటో డ్రైవర్**



బ్రిటిష్ కాలంలో బొగ్గు గనుల్లో పనులు చేయడానికి ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, బల్లార్షా తదితర ప్రాంతాల నుంచి ఇక్కకికి వచ్చి స్థిరపడ్డాము. మా తాత ముత్తాతల నుంచి ఇదే ప్రాంతంలో జీవనం సాగిస్తున్నాము. కానీ సింగరేణి అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవరూ తమ సమస్యను పట్టించుకోవడం లేదు.

## గోశాల నిర్వహణ సరిగ్గా లేదంటే అప్పుడు కేసులు పెట్టారు

**అమరావతి, అక్టోబరు 29:** టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిపై మాజీ చైర్మన్, వైసీపీ అధినేత భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ఆయన చైర్మన్ పదవి స్వీకరించినప్పటి నుంచి గోశాలలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. గోశాలను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వాలన్న ఆలోచన తప్పే కదా అని ప్రశ్నించారు.గోశాల నిర్వహణ సరిగ్గా లేదు అనే విషయం బోర్డు దృష్టికి వచ్చింది అని టీటీడీ చైర్మన్ బి.ఆర్ నాయుడు స్వయంగా చెప్పారని భూమన కరుణాకర్ రెడ్డి గుర్తుచేశారు. గోశాల నిర్వహణకు ప్రత్యేక కమిటీని వేసి నిపుణుల కమిటీని వేసి గోశాలను స్వచ్ఛంద సేవా సంస్థలకు ఎవరికైనా సంస్థలకు ఇచ్చేటువంటి ఆలోచన ఉందన్నారని తెలిపారు. వచ్చే బోర్డు సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుం టామని అన్నారని చెప్పారు.సరిగ్గా ఏప్రిల్ నెలలో నేను గోశాల నిర్వహణ సరిగ్గా లేనందువలన గోవులకు అపాయకర మైనటు వంటి పరిస్థితి వచ్చిందని.. గోవుల మరణాలు జరిగాయని చెప్పాను కదా అని ఈ సందర్భంగా బీఆర్ నాయుడికి భూమన కరుణాకర్ రెడ్డి గుర్తుచేశారు. బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డిని తనపై ఉసిగొల్పి గోవుల మరణం నేను ప్రకటించడం కారణంగా మత విద్వేషాలను, హిందూ ధార్మికతను దెబ్బతీస్తున్నానని, మతవిద్వేషాలను రెచ్చగొడుతున్నాడు అని నామీద అనేక సెక్షన్లతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు రిజిస్టర్ కూడా చేశారని.. దానిపై విచారణకు కూడా హాజరయ్యానని పేర్కొన్నారు. నిన్న ప్రెస్‌మీట్‌లో బహిరంగంగా మీరు కూడా గోశాల నిర్వహణ సరిగ్గా లేదని అన్నారు కాబట్టి.. నా మీద ఏ సెక్షన్లతో కేసులు పెట్టారో.. అవే సెక్షన్లు మీకు కూడా వస్తాయని బీఆర్ నాయుడిని ఉద్దేశించి అన్నారు.గోశాల సంరక్షణ బాధ్యత సరిగ్గా లేదు అని చెప్పిన దానికి నామీద అనేక నిందారోపణలు వేశారని బీఆర్ నాయుడు అన్నారు. నన్ను గోశాలకు రానివ్వకుండా 8 మంది శాసనసభ్యులతో అక్కడ పెద్ద ఎత్తున రాద్ధాంతం చేయించి పాలకమండలి సభ్యులు కూడా అక్కడ ఉన్నారని తెలిపారు. నేను గతంలో చెప్పిందే బీఆర్ నాయుడు నిన్న మీడియా సమావేశంలో చెప్పారని అన్నారు.దాదాపు 70ఏళ్లుగా టీటీడీ ఆధ్వర్యంలో అతి గొప్పగా నిర్వహిస్తున్న గోశాల బీఆర్ నాయుడు టీటీడీ చైర్మన్ అయిన తర్వాత నిర్వీర్యం అయిపోయిందని భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. దీన్ని ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వాలా అన్నటువంటి ఆలోచన రావటం కూడా తప్పే కదా అని ప్రశ్నిం చారు. మీ హయాంలో మీరు వైకుంఠ ఏకాదశి నిర్వహణను సరిగ్గా చేయలేరని.. గోశాలను సరిగ్గా నిర్వహించలేరని విమర్శిం చారు. అంటే మీ పాలకమండలి నిర్వాహంలో మీరు ఏ విషయాన్ని కూడా సమర్థవంతంగా చేయలేరని అన్నారు. ఒక వాస్తవాన్ని ప్రజలకు తెలియజే యాలనే ఆరోజు ప్రయత్నించానని భూమన కరుణాకర్

## జగన్ హయాంలో రాజకీయంగా లబ్ధి పొందేందుకు జిల్లాలు పునర్విభజించారు

**అమరావతి, అక్టోబరు 29 :** గత వైసీపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా జిల్లాలని పునర్విభజించిదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌విమర్శలు చేశారు. జగన్ హయాంలో రాజకీయంగా లబ్ధి పొందేందుకు జిల్లాలు పునర్విభజించిదని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో పరిపాలన సౌలభ్యం ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పుకొచ్చారు. పరిపాలన సక్రమంగా జరిగేలా జిల్లాలు పునర్విభజజలో మార్పులు, చేర్పులు చేశామని స్పష్టం చేశారు. సోమవారం లేదా మంగళవారం మరోసారి భేటీ అయ్యి తుది నివేదిక సిద్ధం చేసి సీఎం చంద్రబాబుకి ఇస్తామని పేర్కొన్నారు మంత్రి అనగాని సత్యప్రసాద్.జిల్లాల పునర్వ్యవస్థీకరణపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ ఇవాళ(బుధవారం) ఏపీ సచివాలయంలో సమావేశం అయింది. ఈ సమావేశానికి మంత్రులు నారాయణ, వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, అనగాని సత్య ప్రసాద్, నిమ్మల రామానాయుడు హాజరయ్యారు.




ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రులు చర్చించారు. సీఎం చంద్రబాబుతో) మంత్రి వర్గ ఉపసంఘం సమావేశమైంది. సీఎం చంద్రబాబు ఇచ్చిన సూచనలపై అధికారులతో మంత్రులు చర్చిస్తున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు మంత్రి అనగాని సత్యప్రసాద్.గత జగన్ ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనను సరిదిద్దడంపై ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. జిల్లాల విభజనతో ఉన్న ఇబ్బందులను తీరుస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని నెరవేర్చే విధంగా ఇచ్చిన నివేదికపై సీఎం చంద్రబాబు కొన్ని మార్గదర్శకాలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. వాటితోపాటు లో ఉన్న మంత్రులు ఇచ్చిన సూచనలను కూడా కూలంకుషంగా చర్చించామని పేర్కొన్నారు. మండలాలు, పంచాతీయలు విభజన చేయకుండా నియోజకవర్గమంతా ఒకే డివిజన్‌లో ఉండాలని నిర్ణయించామని అన్నారు. మరోసారి ఈ విషయంపై సమావేశమై నివేదికను రూపొందించి సీఎంకు అందజేస్తామని స్పష్టం చేశారు మంత్రి అనగాని సత్యప్రసాద్.

# నితీష్ రిమోట్ కంట్రోల్ బీజేపీ చేతుల్లో ఉంది



**ముజఫర్‌పూర్:** బిహార్‌కు రెండు నెలలుగా ముఖం చూపించడం లేదంటూ తనపై బీజేపీ చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ తిప్పికొట్టారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఫేస్ చూపిస్తూ రిమోట్ కంట్రోల్ మాత్రం బీజేపీ తమ చేతుల్లో పెట్టుకుందని, సామాజిక న్యాయానికి పాతరేసిందని విమర్శించారు. ముజఫర్‌పూర్ లో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ, నితీష్ నాయకత్వం అంటూ బయటకు చూపిస్తూ అసలైన పవర్ అంతా తమ చేతుల్లోనే బీజేపీ పెట్టుకుందని, ఆయన ఫేస్ వాడుకుంటూ రిమోట్ తమ చేతుల్లో పెట్టుకుందని అన్నారు.సామాజిక న్యాయానికి బీజేపీ వ్యతిరేకం బిహార్‌లో సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం లేవని, కేవలం ముగ్గురు నలుగురు బీజేపీ నేతలు రిమోట్ కంట్రోల్‌ను తమ చేతుల్లో పెట్టుకున్నారని రాహుల్ ఆరోపించారు. దీనిని దృష్టిలో ఉంచుకునే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని తాను పార్లమెంటులో డిమాండ్ చేశానని చెప్పారు. ఇదే మాట లోక్‌సభలో ప్రధానమంత్రికి నేరుగా సూచించానని, అయితే ఆయన ఒక్క మాట కూడా మాట్లాడలేదని అన్నారు. సామాజిక న్యాయానికి బీజేపీ పూర్తిగా వ్యతిరేకమని, దాన్ని వాళ్లు కోరుకోవడం లేదని తప్పుపట్టారు. నితీష్ కుమార్ రెండు దశాబ్దాల పాలనలో బిహార్ ప్రజలు ఎలాంటి ప్రగతికి నోచుకోలేదని రాహుల్ విమర్శించారు. 'బిహార్‌లో సొంత ప్రజలకే భవిష్యత్తు లేదు. ఇది నిజం' అని అన్నారు. తాను బాగా వెనుకబడిన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినని నితీష్ తరచు చెబుతుంటారని, అయితే ప్రజలకు కనీస అవసరాలు అందించడంలో సైతం ఆయన విఫలమయ్యారని ఆరోపించారు. విద్య, ఆరోగ్యం. ఉపాధి విషయంలో నితీష్ గత 20 ఏళ్లలో ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. 'మీ కోసం ఏమి చేయని బిహార్ అవసరమా? అలాంటి బిహార్ మనకు అవసరం లేదు. ఆరోగ్యం, విద్య, ఉపాధి పుష్కలంగా ఉండే బిహార్ మనకు కావాలి' అని అన్నారు. కాగా, 243 మంది సభ్యుల బిహార్ అసెంబ్లీకి నవంబర్ 6,11 తేదీల్లో ఎన్నికలు జరుగనుండగా, నవంబర్ 14న ఫలితాలు వెలువడతాయి.

# కారు లేని అబ్బాయిలతో అమ్మాయిలకు పెళ్లి చేయరు



**బెంగళూరు:** కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. కారు లేని అబ్బాయిలకు తమ అమ్మాయిలను ఇచ్చి జనం పెళ్లి చేయబోరని అన్నారు. ఈ సామాజిక సమస్యను పరిష్కరించడానికే బెంగళూరు సొరంగం రోడ్డు ప్రాజెక్టు చేపడుతున్నట్లు తెలిపారు. ఆ రాష్ట్రంలోని ప్రతిపక్ష బీజేపీ ఈ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ ఎంపీ తేజస్వి సూర్య, మంగళవారం డీకే శివకుమార్‌ను కలిశారు. పర్యావరణానికి ముప్పు కలిగించే సొరంగం రోడ్డు ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బస్సులు, మెట్రో రవాణాను విస్తరించాలని సూచించారు.కాగా, బీజేపీ ఎంపీతో సమావేశం తర్వాత డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడారు. జనం కార్లు కొనడం వెనుక ఉన్న సామాజిక బాధ్యతలను తేజస్వి సూర్య అర్థం చేసుకోలేదని అన్నారు. 'మీరు మీ వాహనాన్ని తీసుకురాకుండా నేను ఆపగలనా? ఇది సామాజిక బాధ్యతకు సంబంధించిన విషయం. ప్రజలు తమ కుటుంబాలతో కలిసి తమ సొంత వాహనాల్లో ప్రయాణించడానికి ఇష్టపడతారు. వారు తమ కార్లను ఉపయోగించకుండా మనం నిరోధించగలమా? కార్లను ఇంట్లో వదిలి ప్రజా రవాణాను ఉపయోగించమని తమ నియోజకవర్గ ప్రజలకు ఎంపీలు విజ్ఞప్తి చేయవచ్చు. ఎంతమంది దానిని నిజంగా అనుసరిస్తారో చూద్దాం. నేడు ప్రజలు తమ కుమార్తెలను కారు లేని అబ్బాయిలకు ఇచ్చి వివాహం చేయడానికి కూడా వెనుకాడతారు' అని అన్నారు. ఐటీ రాజధానిలో ట్రాఫిక్ సమస్యలకు సొరంగం రోడ్డు ప్రాజెక్టు దీర్ఘకాలిక పరిష్కారమని ఆయన స్పష్టం చేశారు.

# అది మహాగఠ్‌బంధన్ కాదు దొంగబంధన్- ఆ కూటమి అధికారంలోకి వస్తే కార్యకర్తలు జైల్లో ఉంటారా



బిహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆర్?జేడీ, కాంగ్రెస్ కూటమిపై విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేసిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) సంస్థకు చెందిన కార్యకర్తలను మహాగఠ్ బంధన్ బిహార్‌లో అధికారంలోకి వస్తే జైలులోనే ఉంటారా? అని ప్రశ్నించారు. పట్నాలోని ఫుల్వారీ షరీఫ్‌లో పీఎఫ్ఐ కార్యకర్తలు చురుకుగా ఉన్నారని ఆరోపించారు. దర్భాంగాలో జరిగిన ర్యాలీలో మహాగఠ్ బంధన్‌పై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.'అది మహాగఠ్ బంధన్ కాదు దొంగ బంధన్"పీఎఫ్ఐ సంస్థను ఎన్‌డీఏ ప్రభుత్వమే నిషేధించింది. దేశవ్యాప్తంగా సోదాలు నిర్వహించి పీఎఫ్ఐ కార్యకర్తలను జైలులో పెట్టాం. బిహార్‌లో ఆర్‌జేడీ–కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే పీఎఫ్ఐ కార్యకర్తలు జైలులోనే ఉంటారా బీజేపీ చాలా మంది యువకులకు టికెట్లు ఇచ్చింది. కానీ ఆర్?జేడీ, కాంగ్రెస్ పార్టీలు యువతకు టికెట్లు ఇవ్వలేదు. ఎందుకంటే ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ తన కుమారుడు తేజస్వీ యాదవ్‌ను బిహార్ ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తన కుమారుడు రాహుల్‌ను ప్రధానిగా చేయాలని కోరుకుంటున్నారు. లాలూ ప్రసాద్ దాణా, ల్యాండ్ ఫర్ జాబ్ స్కామ్‌లో ఉన్నారు. కాంగ్రెస్ రూ. 12 లక్షల కోట్ల అవినీతి కేసుల్లో చిక్కుకుంది. అది మహాగఠ్ బంధన్ కాదు 'దొంగ బంధన్" అని అమిత్ షా వ్యాఖ్యానించారు.ఎన్‌డీఏ ప్రభుత్వం బిహార్‌లోని 8.52 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇస్తుందని, మఖానా బోర్డును ఏర్పాటు చేసిందని అమిత్ షా తెలిపారు. గృహ వినియోగదారులకు 125 యూనిట్ల ఉచిత విద్యుత్?ను అందిస్తోందని గుర్తు చేశారు. దర్భాంగాకు త్వరలో మెట్రో రైలు వస్తుందని, ఇప్పటికే విమానాశ్రయం నిర్మితమైం దని పేర్కొన్నారు. ఎయిమ్స్ నిర్మాణ దశలో ఉందని వెల్లడించారు. మిథిలాలో సీతాదేవి ఆలయం నిర్మిస్తున్నామని, ఆమె సందర్శించిన అన్ని ప్రదేశాలు రామ్ సర్క్యూట్‌కు అనుసంధానిస్తామని హామీ ఇచ్చారు. ఎన్?డీఏ సర్కార్ ప్రభుత్వం మైథిలికి అధికారిక హోదా ఇచ్చిందని అన్నారు."550 ఏళ్లు రామ్ లల్లా ఒక గుడారంలో ఉన్నాడు. మేము అయోధ్యలో ఒక గొప్ప రామాలయాన్ని నిర్మించాం. ఆర్జేడీ, కాంగ్రెస్, టీఎంసీ, బీఎస్పీ, ఎస్పీ రామాలయ నిర్మాణాన్ని వ్యతిరేకించాయి. కాంగ్రెస్, లాలూ ప్రసాద్ యాదవ్ అండ్ కంపెనీ 70 ఏళ్లుగా ఆర్టికల్ 370ని రక్షించాయి. దాన్ని 2019 ఆగస్టు 5న శాశ్వతంగా రద్దు చేశాం. శత్రుదేశం పాక్?పై ఒకసారి సర్జికల్ స్ట్రైక్ చేశాం. మరొకరి వైమానిక దాడులు జరిపాం. మూడోది ఆపరేషన్ సిందూర్. ఈ చర్యల ద్వారా శత్రుదేశానికి తగ్గిన బుద్ధి చెప్పాం." అని అమిత్ షా వ్యాఖ్యానించారు.నెహ్రూ జయంతికి అదే తగిన నివాళి : రాజ్ నాథ్ సింగ్బిహార్‌లో ఎన్డీఏ 2/3 వంతు మెజారిటీ సాధించి నవంబర్ 14న నెహ్రూ పుట్టినరోజున ఆయనకు తగిన నివాళి అర్పిస్తుందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ తెలిపారు. బిహార్‌కు గూండా రాజ్ అవసరం లేదని ఎద్దేవా చేశారు. బిహార్ సీఎం నీతీశ్ కుమార్ ఆర్జేడీ జంగిల్ రాజ్ పాలన వల్ల జరిగిన నష్టాన్ని అరికట్టడంలో చాలావరకు విజయం సాధించారన్నారు. ప్రతిపక్ష పార్టీలుచొరబాటుదారుల ఓట్లను పొందాలనుకుంటున్నాయని విమర్శించారు. పట్నాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో మహాగఠ్ బంధన్ పై రాజ్ నాథ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు."ఆర్జేడీ ప్రపంచవ్యాప్తంగా బిహార్‌ను అప్రతిష్టపాలు చేసింది. బిహార్?ను ఆటవిక రాజ్యం రోజులకు తీసుకెళ్తారా? లేదా అభివృద్ధి మార్గంలో కొనసాగిస్తారా?. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ఆర్జేడీ బూటకపు హామీ ఇచ్చింది. నీతీశ్ 20 ఏళ్ల పాలనలో ఆయనపై ఎటువంటి అవినీతి ఆరోపణ రాలేదు. లాలూ కుటుంబం మొత్తం అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మహాగఠ్ బంధన్ అధికారంలోకి వస్తే వక్ఫ్ చట్టాన్ని రద్దు చేస్తామని తప్పుడు వాగ్దానం చేసింది. పార్లమెంటులో ఆమోదం పొందిన చట్టాన్ని వారు రద్దు చేయలేరు. బీజేపీ మత, కుల రాజకీయాలను పాల్పడదు. న్యాయమైన, స్వచ్ఛమైన రాజకీయాలు చేస్తుంది. ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా ఇచ్చింది రాహుల్ గాంధీ కాదు, ప్రధాని మోదీ" అని రాజ్ నాథ్ సింగ్ తెలిపారు.

# బాలిక పైనుంచి కారు నడిపిన మైనర్ బాలుడు



**అహ్మదాబాద్:** మైనర్ బాలుడు కారు డ్రైవ్ చేశాడు. ఒక వీధి మలుపులో మూడేళ్ల బాలిక పైనుంచి కారు నడిపాడు.అదృష్టవశాత్తు ఆ బాలిక ప్రాణాలతో బయటపడింది. అయితే కారు నడిపిన ఆ బాలుడిపై ఆ చిన్నారి తల్లిదండ్రులు దాడి చేశారు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. బుధవారం ఉదయం శివ్ బంగ్లా రెసిడెన్షియల్ ప్రాంతంలోని వీధిలో కొందరు పిల్లలు ఆడుకుంటున్నారు.కాగా, ఒక మైనర్ బాలుడు కారు డ్రైవ్ చేశాడు. వీధి మలుపు వద్దకు మూడేళ్ల బాలిక వచ్చింది. టర్న్ తీసుకుంటున్న కారును చూసి వెనుకకు పరుగెత్తింది. అయితే ఆ బాలుడు ఆ బాలిక పైనుంచి కారు నడిపాడు. అదృష్టవశాత్తు కారు టైరు కింద ఆ చిన్నారి పడలేదు. కారు మధ్యలో పడిన బాలిక దాని వెనుక నుంచి బయటకు వచ్చింది.మరోవైపు ఇది చూసిన స్థానికులు తమ ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. కారు దిగిన ఆ బాలుడు, బాలిక గాయపడిందా? అన్నది పరిశీలించాడు. ఇంతలో ఆ చిన్నారి తల్లిదండ్రులు అతడ్ని చుట్టుముట్టి కొట్టారు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మైనర్ బాలుడు నడిపిన కారు యజమానిని గుర్తించి చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారి తెలిపారు. కాగా, ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# తొలి విడత బరిలో ఇద్దరు డిప్యూటీ సీఎంలు, 14మంది మంత్రులు- వీరి ప్లస్‌లు, మైనస్‌లు ఏంటి




బిహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్‌లో ఇద్దరు డిప్యూటీ సీఎంలు సహా 16 మంది మంత్రుల భవితవ్యం తేలనుంది. నవంబరు 6న 121 అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ జరగనుండగా, ప్రధానమైన 16 సీట్ల వైపే అందరి చూపులు ఉన్నాయి. వీటిలో 11 చోట్ల బీజేపీ మంత్రులు, 5 చోట్ల జేడీయూ మంత్రులు పోటీ చేస్తున్నారు. ఈ జాబితాలో డిప్యూటీ సీఎంలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా కూడా ఉన్నారు. విపక్ష కూటమి సీఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ పోటీ చేస్తున్న స్థానంలోనూ తొలివిడతలోనే ఓటింగ్ జరగనుంది. రాష్ట్ర మంత్రుల భవితవ్యం ఎలా ఉండబోతోంది వారి ప్లస్‌లు, మైనస్‌లు ఏమిటి ఆయా సీట్లలో ఫలితాలను ఏయే అంశాలు ప్రభావితం చేయబోతున్నాయి ఈ కథనంలో తెలుసుకుందాం.డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి : తారాపుర్‌బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్సీగా ఉన్నారు. తొలిసారిగా ఆయన సొంత జిల్లా ముంగేర్‌లోని తారాపుర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ స్థానంతో సామ్రాట్ చౌదరి తల్లిదండ్రులకు బలమైన బంధం ఉంది. ఆయన తండ్రి శకుని చౌదరి 23 ఏళ్ల పాటు ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సేవలు అందించారు. 1985 నుంచి 2015 మధ్యకాలంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, సమతా పార్టీ, ఆర్‌జేడీ, హిందుస్థానీ అవామ్ మోర్చాల నుంచి శకుని చౌదరి ఎన్నికయ్యారు. శకుని చౌదరి సతీమణి, సామ్రాట్ చౌదరి తల్లి పార్వతీదేవి కూడా తారాపుర్ స్థానం నుంచి మూడేళు ఎమ్మెల్యేగా పనిచేశారు.2019లోనే బీజేపీలో శకుని చౌదరి జాయిన్ అయ్యారు. గత 30 ఏళ్లలో ఒక్కసారి కూడా ఈ సీటును బీజేపీ గెలవలేదు. 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లోనూ తారాపుర్ నుంచి జేడీయూ పార్టీ అభ్యర్థే గెలిచారు. డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి కోసం ఈ సీటును బీజేపీకి జేడీయూ ఇచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ఆయనకు ఉజ్వల రాజకీయ భవిష్యత్తు ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకత ప్రభావం ఆయనపై పడుతుందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ అసమ్మతిని చల్లార్చడానికి ఇటీవలే బీజేపీ పెద్దలు ప్రయత్నాలు చేశారు. ఈ సవాళ్లను ఎదురీది ఆయన గెలిస్తే, బీజేపీలో విజయ్ కుమార్ సిన్హా స్థాయి మరింత పెరుగుతుంది. మళ్లీ ఉప ముఖ్యమంత్రి ఛాన్స్ దక్కుతుంది.ఆరోగ్యశాఖ మంత్రి మంగళ్ పాండే : సివాన్‌బిహార్ ఆరోగ్యశాఖ మంత్రి మంగళ్ పాండే ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్సీగా ఉన్నారు. తొలిసారిగా ఆయన సివాన్ స్థానం నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. సివాన్ అనేది మంగళ్ పాండే సొంత జిల్లా. ఆరోగ్యశాఖ మంత్రిగా రాష్ట్రానికి అందించిన సేవలే తనను గెలిపిస్తాయని ఆయన అంటున్నారు. ఈ ఎన్నికల్లో మంగళ్ పాండే గెలిస్తే, ఆయన మంత్రి కాకుండా ఎవరూ ఆపలేరు. రాష్ట్రం నుంచి కేంద్ర స్థాయి వరకు బీజేపీలో ఆయనకు బలమైన పట్టు ఉంది. సీఎం నీతీశ్ కుమార్‌తోనూ మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే కీలకమైన ఆరోగ్యశాఖను మంగళ్ పాండేకు కేటాయించారు.రహదారుల శాఖ మంత్రి నితిన్ నవీన్ : బంకీపుర్‌బిహార్ రహదారుల నిర్మాణ శాఖ మంత్రి నితిన్ నవీన్ బంకీపుర్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ స్థానం నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఆయన హ్యాట్రిక్ కొట్టారు. 2006 అసెంబ్లీ ఉప ఎన్నికలో, 2010, 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో నితిన్ నవీన్ గెలిచారు. ఈయన తండ్రి నవీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా బీజేపీ సీనియర్ నేత. 1995, 2000, 2005 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి బంకీపుర్ ఎమ్మెల్యే అయిన రికార్డు నవీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా సొంతం. మొత్తం మీద ఈ స్థానంలో నితిన్ నవీన్ కుటుంబానికి బలమైన పట్టు ఉంది. సామాజిక, కుల సమీకరణాలు సైతం ఆయనకు అనుకూలంగా ఉన్నాయి. దీంతో ఈ ఎన్నికల్లోనూ ఈజీగా గెలిచే అవకాశాలు ఉన్నాయి.

# బీజేపీ నేత హంతకులు ఎన్‌కౌంటర్‌లో అరెస్ట్




**భోపాల్:** బీజేపీ నేతను హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నాటకీయ ఎన్‌కౌంటర్ తర్వాత వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ కాల్పుల్లో గాయపడిన హంతకులను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో కాట్ని జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బీజేపీ జిల్లా పిచ్డా మోర్చా మండల అధ్యక్షుడు నీలేష్ రజక్ మంగళవారం హత్యకు గురయ్యారు. కైమోర్‌లోని మార్కెట్ వద్ద బైక్‌పై వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. బైక్‌పై వచ్చిన ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు గన్‌తో కాల్పులు జరిపి రజక్‌ను హత్య చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. ఈ సంఘటన నేపథ్యంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయి.కాగా, ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. అక్రమ్ ఖాన్, ప్రిన్స్ జోసెఫ్‌లను నిందితులుగా గుర్తించారు. కాట్నిలోని కజ్రావారా సమీపంలో హైస్పీడ్ ఛేజింగ్ తర్వాత పోలీసులు వారిని చుట్టుముట్టారు. నిందితులు కాల్పులు జరుపగా ప్రతిగా కాల్పులు జరిపారు. ఎన్‌కౌంటర్‌లో గాయపడిన అక్రమ్ ఖాన్, ప్రిన్స్ జోసెఫ్‌లను చికిత్స కోసం జబల్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మరోవైపు లవ్‌జిహాద్ కేసులో జోక్యం చేసుకున్నందుకు నీలేష్ రజక్‌ను నిందితులు హత్య చేసినట్లు బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సంజయ్ పాఠక్ ఆరోపించారు. ఒక వ్యక్తి తన వెంటపడి వేధిస్తున్నట్లు స్కూల్ బాలిక నీలేష్‌కు ఫిర్యాదు చేసిందని తెలిపారు. దీంతో ఆయన పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నిందితుడిపై చర్యలకు డిమాండ్ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నీలేష్‌ను రోడ్డు మధ్యలో కాల్చి చంపుతానని నిందితుడు హెచ్చరించాడని, నెలన్నర తర్వాత ఆ విధంగా హత్య చేశాడని సంజయ్ పాఠక్ ఆరోపించారు. అయితే బీజేపీ నేత హత్యలో మరో నిందితుడు ప్రిన్స్ జోసెఫ్‌పై కేసు నమోదైనట్లు తెలుసుకున్న అతడి తండ్రి నెల్సన్ జోసెఫ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# రూ. 500కే గ్యాస్ సిలిండర్- బీజేపీ రిమోట్ కంట్రోల్‌లో నీతీశ్‌కుమార్ ప్రభుత్వం



**బిహార్ :** భారతీయ జనతా పార్టీ బిహార్‌లో రిమోట్ కంట్రోల్ ద్వారా నీతీ శ్‌కుమార్ ప్రభుత్వాన్ని నడిపిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అధికారం కోసం నీతీశ్ కుమా ర్‌ను ఆ పార్టీ వాడుకుంటోందని విమర్శించారు. బిహార్‌లో అసెంబ్లీ ఎన్ని కల ప్రచారంలో భాగంగా ముజఫర్‌పుర్ సభలో అగ్రనేత తేజస్వీ యాదవ్‌తో కలిసి రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగాపై రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ సర్కార్ సామాజిక న్యాయానికి వ్యతిరేకమన్నారు."బిహార్‌లో బిహారీలకు ఎలాంటి భవిష్యత్తు లేదు. ఇది వాస్తవం. బిహార్‌లో 20ఏళ్లుగా నీతీశ్ కుమార్ ప్రభు త్వాన్ని నడిపిస్తున్నారు. ఆయన తనను తాను వెనుకబడినవర్గంగా చెప్పుకు ంటారు. నేను మిమ్మల్ని అడగాలనుకుంటున్నాను. బిహార్‌లో విద్య, ఆరోగ్యం, ఉపాధి కోసం గత 20ఏళ్లలో నీతీశ్ కుమార్ ఏం చేశారో చెప్పండి. మీకు ఇక్కడ ఏమీ దొరక్కపోయినా అదానీకి మాత్రం ఒకట్రొండు రూపాయలకు భూమి లభిస్తుంది. మీకు మాత్రం ఉద్యోగాలు లేవు. అలాంటి బిహార్ మనకొద్దు. మనకు ఆరోగ్యం, విద్య, ఉపాధి లభించే బిహార్ కావాలి. దేశసంపద కొంతమంది సంపన్నుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. బిహార్ వంటి ప్రాంతాలు పేదరికంలో కూరుకుపోవడానికి ఇదే కారణం. నోట్ల రద్దు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టంపై ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు."రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేతరూ. 500కే గ్యాస్ సిలిండర్మహాగఠ్‌బంధన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బిహార్‌లో వలసలకు ముగింపు పలుకుతామని %=జీణ% అగ్రనేత తేజస్వీ యాదవ్ హామీ ఇచ్చారు. బిహార్‌ను నేరరహితంగా, అవినీతిరహితంగా మారుస్తామన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే బిహార్‌ను దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా మారుస్తానని తేజస్వీ యాదవ్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించారు. ఇటీవల కాలంలో ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో తీసుకున్న అనేక ప్రజాకర్షక చర్యలు గతంలో తాను ఇచ్చిన హామీలకు నకలు అని ఎద్దేవా చేశారు. అవినీతి, శాంతిభద్రతలపై రాజీలేని వైఖరిని అవలంబిస్తానని, బయటి వ్యక్తుల నియంత్రణలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు."20ఏళ్ల నీతీశ్ కుమార్, 11ఏళ్ల మోదీ పాలన తర్వాత కూడా బిహార్ దేశంలోనే అత్యంత పేదరాష్ట్రంగా ఉంది. బిహార్‌లో నిరుద్యోగం ఎక్కువగా ఉంది. ధరలు, వలసలు ఎక్కువగా ఉన్నాయి. తేజస్వీకి ఒక్క అవకాశం ఇస్తే ఉద్యోగం గ్యారంటీ. ప్రభుత్వం ఏర్పాటైన 20రోజుల్లో చట్టం తెస్తాం. ఏ కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం లేదో ఆ కుటుంబానికి ఉద్యోగం ఇస్తాం."

# మంటల్లో దగ్ధమైన బస్సు డ్రైవర్ అలెర్ట్‌తో ప్రయాణికులు సురక్షితం



**ముంబై:** ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన లగ్జరీ బస్సుకు మంటలు అంటుకున్నాయి. అయితే డ్రైవర్ అలెర్ట్‌తో అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం ఆ బస్సు మంటల్లో పూర్తిగా కాలిపోయింది. మహారాష్ట్రలో ఈ సంఘటన జరిగింది. ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన లగ్జరీ స్లీపర్ బస్సు ముంబై నుంచి జల్నాకు వెళ్తున్నది. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో నాగ్‌పూర్ జాతీయ రహదారిలో ఆ బస్సుకు మంటలు అంటుకున్నాయి. కాగా, మంటలను గమనించిన డ్రైవర్ హుస్సేన్ సయ్యద్ అలెర్ట్ అయ్యాడు. బస్సును వెంటనే రోడ్డు పక్కన ఆపాడు. అందులో ఉన్న 12 మంది ప్రయాణికులను సకాలంలో నుంచి దించివేశాడు. ఆ తర్వాత ఆ బస్సు మంటల్లో పూర్తిగా కాలిపోయింది.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను ఆర్పివేశారు. అంబులెన్సులు కూడా అక్కడకు చేరుకున్నాయి. ప్రయాణికులంతా క్షేమంగా ఉండటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.కాగా, బస్సు కాలిపోవడానికి కారణం ఏమిటన్నదని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటన వల్ల ఆ జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. మరోవైపు మంటల్లో కాలుతున్న బస్సు వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# చిన్నారులకు ఏది ఇష్టం... ఏది కష్టం...?

నెలల వయసు నుంచి స్కూల్ వయస్సు వరకు పిల్లలకు పోషకాహారం చాలా అవసరం. కొన్ని రకాల పదార్థాలంటేనే చిన్నారులకు మక్కువ. కొన్ని అంటే మోహం తిప్పుకుంటారు. ఇక్కడ ఏదన్నది కాదు ముఖ్యం వారికి అందాల్సిన పోషకాలు అందుతున్నాయా? లేదా? అన్నది తల్లిదండ్రులు చూసుకోవాల్సిన అంశం. ఈ నేపథ్యంలో ఏ వయసులో ఏ ఆహారం అందించొచ్చన్నది, పోషకాహార, వైద్య నిపుణుల సూచనలు ఎలా ఉన్నాయన్నది తెలుసుకుందాం.



**పసిపిల్లలు**

వీరికి ఈ వయసులో తల్లిపాలు లేదంటే ఫార్ములా మిల్క్ లేదంటే రెండూ కలిపి ఇవ్వొచ్చు. దాదాపుగా అన్ని పోషకాలు తల్లి పాల నుంచి అందుతాయి. కానీ, విటమిన్ డి తగినంత అందదు. అందుకే వీరిని ప్రతీ రోజూ సూర్యోదయం సమయంలో కొంత సమయం పాటు ఎండలో ఉంచితే విటమిన్ డి అందు తుంది. లేదంటే విటమిన్ డి చుక్కల మందు రూపంలో అందించాలి. అలానే ఐరన్ కూడా వీరికి తగినంత అందదు. అందుకే వైద్యులు ఐరన్, జింక్, విటమిన్స్ కూడిన డ్రాప్స్ ను సూచిస్తుంటారు. పిల్లలకు పాలిచ్చే తల్లులు పూర్తి పోషకాహారాన్ని తీసుకోవడంపై శ్రద్ద పెట్టాలి. ఎందుకంటే వారి నుంచే పిల్లలకు పోషకాలు అందాలి కనుక. తగిన పోషకాహారం తీసుకోవడం వల్ల బ్రెస్ట్ మిల్క్ తగినంత ఉత్పత్తి ఉంటుందని ఎన్నో పరిశోధనలు చెబుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల మేరకు శిశువులకు ఆరు నెలల వరకు తల్లిపాలు మినహా మరేమీ ఇవ్వకూడదు. పిల్లలకు రెండో ఏడాది ముగిసే వరకు బ్రెస్ట్ ఫీడింగ్ ను కొనసాగించాలి. ఆరు నెలల వయసులో శిశువులు ఘన ఆహారాన్ని తీసుకునేందుకు సిద్ధంగా ఉంటారు. కనుక వారికి రైస్, ఉడికించిన పండ్లు, కూరగాయలు ఇవ్వాలి. ఏడాది వయసుకు వచ్చిన తర్వాత సాధారణంగా ఇంట్లో తినే ఆహార పదార్థాలను ఒక్కొక్కటి యాడ్ చేయాలి. పిల్లలకు ఈ వయసు నుంచే రుచి తెలుస్తుంది. మంచి ఆహార అలవాట్లకు పునాది పడేది ఇప్పుడే. కొన్నింటి విషయంలో మోహం తిప్పుకుంటుంటే వాటిని పక్కన పెట్టేయకండి. అలా చేస్తే అది జీవితాంతం నిషేధ పదార్థంగా ఉండపోవచ్చు. ఒకవేళ ఏదైనా ఆహార పదార్థం సరిపడడం లేదని భావిస్తే పిల్లల వైద్య నిపుణు లకు తెలియజేస్తే వారు తగిన సూచనలు చేస్తారు.

**ఎంత మేర?**

పిల్లలు ఆకలి ఉన్నంత మేర తింటారు. కొంత తిన్న తర్వాత వద్దు అని ముఖం తిప్పుకుంటున్నారంటే వారి కడుపునిండినట్టుగానే అర్థం చేసుకోవాలి. పిల్లలు పెరిగేకొద్దీ వారిలో ఆకలి కూడా అలానే పెరగడం సహజంగానే జరుగుతుంది. ఒకవేళ పిల్లలు సరిగా ఆహారం తినడం లేదని మీరు గమనిస్తే ఆ విషయాన్ని పోషకాహార నిపుణుల దృష్టికి తీసుకెళ్లాలి. అలాగే, బరువు తగ్గుతూ ఉన్నా ఉపేక్షించ కుండా వైద్య నిపుణుల సలహా తీసుకోవడం తప్పనిసరి.

**అన్ని రుచులు**

కొత్త ఆహార పదార్థాలను రుచి చూసేలా చిన్నారులను ప్రోత్సహించాలి. పండ్లు, ఆకు కూరలు, గుడ్లు, కూరగాయలు, యోగర్ట్ లేదా పెరుగు ఇవి చాలా కీలకం. వీటిని పిల్లలు అవాయిడ్ చేయకుండా చూసుకుంటే చాలు. ఏడాది వయసు నుంచి పిల్లలు తోటి కుటుంబ సభ్యులు తినే వాటినే అనుసరిస్తుంటారు. కనుక కుటుంబ సభ్యుల ఆహార అలవాట్లు వారిపై ప్రభావం చూపిస్తాయి. శిశువుల ఆహారం విషయంలో జాతీయ శిశు సంక్షేమ శాఖ మార్గదర్శకాల కోసం ఈ లింక్ ను సందర్శించొచ్చు.

**ఏడాది తర్వాత...**

ఎదిగే వయసు కనుక పాలు సరిపడా ఉండేలా చూసుకోవాలి. తల్లిపాలే సరిపోవు కనుక విడిగా పాలు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఎముకలు, దంతాలకు క్యాల్షియం చాలా అవసరం. శరీర నిర్మాణంలో కండరాలతోపాటు ఎముకలకూ అంతే ప్రాధాన్యం ఉంటుంది. ఒకవేళ పాలతో అలర్జీ ఉండి, పిల్లలు తీసుకోకపోతే సోయా మిల్క్, క్యాల్షియంతో కూడిన పండ్ల రసం, రైస్, ఓట్ మీల్ ఇవ్వాలి. ఈ వయసులో వైద్యులు క్యాల్షియం సప్లిమెంట్లను కూడా సూచించొచ్చు. అలాగే, పీచు పదార్థం చాలా అవసరం. ఇచ్చే ఆహారంలో ఇది తగినంత ఉండాలి.

**తక్కువ ఫ్యాట్**

పిల్లలకు ఫ్యాట్ అవసరమే కానీ పరిమితి దాటకూడదు. అందుకే తక్కువ ఫ్యాట్ ఉన్న ఆహారం ఇస్తే సరిపోతుంది. అలాగే, తక్కువ శాచురేటెడ్ ఫ్యాట్,ట్రాన్స్ ఫ్యాట్ ఉండేలా శ్రద్ధ వహించాలి.

**ఐదేళ్ల తర్వాత శారీరక వృద్ధి**

పిల్లలకు ఐదేళ్ల వయసు నాటికి వారిలో మెదడు పూర్తిగా అభివృద్ధి చెందుతుంది. ఐదో ఏట నుంచి వారిలో అసలైన శారీరక వృద్ధి మొదలవుతుంది. ఇందుకోసం వారిలో తగినంత రక్త సరఫరా జరిగేందుకు వీలుగా ఐరన్ సప్లిమెంట్లను ఇవ్వాలి. కానీ, తల్లిదండ్రులు నేడు సహజ ఆహారానికి బదులు ప్రాసెస్డ్ ఆహార పదార్థాలైన బిస్కట్లు, శాండ్ విచ్ లు, నూడుల్స్ (ఇవన్నీ ప్రాసెస్ చేసినవి, వేయించినవి), కాండీలు, చాక్లెట్లు ఇవ్వడం జరుగుతోంది. వీటి వల్ల ట్రాన్స్ ఫ్యాట్ పిల్లలకు ఎక్కువ అందుతుంది. ఫలితంగా వారి శారీరక వృద్ధికి తీవ్ర హాని కలుగుతోందని ప్రముఖపోషకాహార నిపుణులు డాక్టర్ సువర్ణ పాఠక్ తెలిపారు. అలాగే, పిల్లలకు సరైన విటమిన్స్, ముఖ్యమైన పోషకాలు అందవు. ఇది కూడా వారిలో గ్యాస్ట్రో ఇంటెస్టినల్, పేగు సంబంధిత సమస్యలకు దారి తీస్తుంది. సాధారణంగా పిల్లల్లో విటమిన్ డి3 (ఎముకలకు),బి3(నరాలకు),బి12 (కండరాలకు),ఐరన్(రక్తానికి)చాలా అవసరం. పిల్లలు ఎదిగే క్రమంలో వారికి విటమిన్లు, మినరల్స్ తో కూడిన ఆహారం అందించే శ్రద్ధ తీసుకోవాలి. కనీస పోషకాలైన క్యాల్షియం, ప్రొటీన్స్, ఐరన్, విటమిన్స్ తో కూడిన సమతులాహారాన్ని అందించాలని డాక్టర్ సువర్ణ పాఠక్ సూచన.

**హెల్తీ బ్రేక్ ఫాస్ట్**

నేటి కాలం పిల్లలకు స్కూల్, క్రీడలు, ట్యూషన్స్, అదనపు ప్రావీణ్యాల్లో శిక్షణ వంటి వాటితో వారిలో ఉన్న శక్తి అంతా ఆవిరైపోతోంది. అందుకే ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పోషకాహార నిపుణులు డాక్టర్ గీతా ధర్మట్టి పలు రకాల ఆహార మెనూలను తెలియజేస్తున్నారు. 1.బ్రెడ్ స్లయిస్, దోశ, అటుకులు, అన్ని రకాల అల్పాహారాలు. 2.పాలు,పాల పదార్థాలు, గుడ్లు, సోయా మిల్క్. గుడ్లు ఏ రూపంలో అయినా తీసుకోవచ్చు. పాలు రోజూ 150 ఎంఎల్.పెరుగు రోజూ 100 గ్రాములు. పనీర్, చీజ్3. పండ్లు, కూరగాయలు. రుతువుల వారీగా అందుబాటులో ఉండే పండ్లు, యాపిల్, బెర్రీస్, క్యారట్, పచ్చి బఠానీలు తీసుకోవాలి.

**అల్పాహారం ఆప్షన్స్**

మిల్క్ షేక్, పండ్లు లేదా పాలతో కార్న్ ఫ్లేక్స్ లేదా ఓట్స్ కలిపి తీసుకోవచ్చు. అటుకులను కూరగాయలతో కలిపి తీసుకోవచ్చు. ఆమ్లెట్, చపాతీ కలిపి తీసుకోవచ్చు. ఉడికించిన గుడ్డు తినిపించొచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన ప్రకారం పిల్లలు రోజులో నాలుగు సార్లు ఫుల్ మీల్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఆహారం కూడా తాజా పండ్ల రసాలు, ప్రొబయోటిక్ పెరుగు, కూరగాయలు (రసాలు, ఉడకబెట్టిన రూపంలో) కలిపి తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే,చపాతీలు,పరాటాలు కూడా భాగం చేసుకోవాలి. మొలకెత్తిన ధాన్యం, బీన్స్ ను కూడా తీసుకోవడం వల్ల పోషకాహార బలం లభిస్తుంది. వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడుతుంది.

**ధాన్యాలు(గ్రెయిన్స్)**

ఆహారంలో ధాన్యాలు తప్పనిసరి.వీటిలో పోషకాలు, శక్తి అన్నవి పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడతాయి.తృణ ధాన్యాలతోపాటు, బ్రెడ్స్, ఓట్స్, బియ్యం తీసుకోవాలి. శుద్ధి చేసిన ఆహార పదార్థాలు, అధికంగా షుగర్ ఉన్నవి, శాచురేటెడ్ ఫ్యాట్ అధికంగా ఉన్నవి, ఉప్పు, లేదా సోడియం, కేక్స్, బిస్కట్లకు దూరంగా ఉండాలి.

**పండ్లు, కూరగాయలు**

వీటితో నీరు, విటమిన్స్, మినరల్స్, పీచు (ఫైబర్) తగినంత లభిస్తాయి. చిన్నారులు ఐదు భాగాల పండ్లు, కూరగాయలను ఒక రోజులో తీసుకోవాలి.

**ఫ్యాట్స్, నూనెలు**

చిన్న పిల్లలు, టీనేజీ వయసులో ఉన్నవారికి కొవ్వులు, నూనె పదార్థాలు ఎంతో అవసరం. చిన్నారుల మానసిక వృద్ధికి ఇవి తోడ్పడతాయి. కొవ్వు అన్నది మన శరీరంలో ఇంధనంలా పనిచేస్తుంది. ఫ్యాట్ లో కరిగే విటమిన్ ఎ, డీ, ఈ, కే లను శరీరం గ్రహించేలా చేయగలదు. కొవ్వుతో కూడిన పదార్థాలు అధికంగా తీసుకుంటే బరువు పెరగడం, స్థూలకాయం, గుండె జబ్బులు తదితర ప్రమాదాలుంటాయి. అందుకే వీటిని తగినంత మోతాదులో తీసుకుంటే ఆరోగ్య ప్రయోజనాలు పొందొచ్చు. నట్స్, అవొకాడో, కార్న్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్, ఆలివ్ ఆయిల్, కనోలా ఆయిల్ ను ఇందుకు ఎంచుకోవచ్చు.

**పాలు, పాల పదార్థాలు**

పాలు, పాల పదార్థాలు ఎన్నో పోషకాలకు నెలవు. వీటిలో విటమిన్ ఎ, డి, బి1, బి2, బి12 విటమిన్లు, మినరల్స్,ముఖ్యంగా క్యాల్షియం సమృద్ధిగా లభిస్తాయి. చిన్నారులు, యుక్త వయసులోకి వచ్చిన వారికి పాలు చాలా అవసరం. ఎముకల వృద్ధికి అవసరమైన క్యాల్షియం అందుతుంది.

**మాంసం, బీన్స్**

మాంసం,పౌల్ట్రీ,చేపలు,బీన్స్, బఠానీలు, గుడ్లు, విత్తనాలు ఎన్నో పోషకాలకు నెలవు. ఆరోగ్యకరమైన ఆహారంలో వీటికి చోటుండాలి. మన శరీరంలో వివిధ రకాల పనులకు అవసరం. మాంసం కూడా విటమిన్ 12, ఐరన్ నిల్వలకు కేంద్రం. ఐరన్ అధికంగా ఉండడంతో అనీమియా నిరోధించడానికి సహాయపడుతుంది.

ఎక్కువ మంది పిల్లల్లో కనిపించేది ఇదే. రక్త హీనత కారణంగా నీరసంగా, పాలిపోయినట్టు కనిపిస్తారు. శాకాహారులైతే మాంసానికి ప్రత్యామ్నాయంగా సోయా,బీన్స్,గుడ్లు, పాలు, జున్ను, పెరుగు,పుట్టగొడుగులు,నట్స్,సీడ్స్ను వాడుకోవచ్చు.

**ఎంత మేర పాలు అవసరం?**

2–3 ఏళ్ల మధ్య చిన్నారులకు రెండు కప్పుల పాలు (480 ఎంఎల్) ఇవ్వాలి. 4–8 ఏళ్ల పిల్లలకు రెండున్నర కప్పులు (600 ఎంఎల్) ఇవ్వాలి. 9 ఏళ్లు దాటిన వారికి మూడు కప్పులు (720 ఎంఎల్) ఇవ్వాలని డాక్టర్ దేవయాని బెనర్జీ సూచించారు. కొవ్వు తీసిన పాలు, 1 శాతం ఫ్యాట్ ఉన్న పాలను ఉపయోగించడం మంచిదని ఆమె సూచించారు.

**అనారోగ్యంతో ఉన్నప్పుడు...**

అనారోగ్యంతో ఉన్నప్పుడు కడుపు మాడ్చకూడదు. శక్తితో కూడిన ధాన్యాలు, పాలు, ఉడికించిన కూరగాయలు కొంచెం చొప్పున ఎక్కువ సార్లు అందించాలి.పుష్కలంగా నీరు,ద్రవ పదార్థాలు ఇవ్వాలి.డీహైడ్రేషన్ రాకుండా అవసరమైతే ఓరల్ రీహైడ్రేషన్ ద్రావకాన్ని తాగించాలి.

**పోషకాహారంతో కూడిన భోజన నమూనా**

ఉదయం నిద్ర నుంచి లేచిన తర్వాత ఒక గ్లాస్ గోరు వెచ్చని, ఫ్యాట్ తక్కువగా ఉన్న పాలు అల్పాహారం కింద కోడిగుడ్డు ఆమ్లెట్, ఉల్లిగడ్డలు, టమాటా, పాల కూర, ముడి ధాన్యాలు, యాపిల్.ఉదయం 11 గంటల సమయంలో ఫ్రూట్ సలాడ్, తక్కువ ఫ్యాట్ ఉన్న యోగర్ట్ మధ్యాహ్నం భోజనం కింద రైస్, పండ్ల రసం. మాంసాహారులైతే లీన్ చికెన్. సాయంత్రం పాలకూర, పుట్టగొడుగుల కట్లెట్. బాదం గింజలతో తాజా పండ్ల రసం (యాపిల్ లేదా జామ లేదా నిమ్మ) రాత్రి భోజనం కింద మల్టీ గ్రెయిన్ (ఒకటికి మించిన ధాన్యాలతో పట్టించిన పిండి) పుల్కాలు, పప్పు, పనీర్, పుట్టగొడుగులతో కూడిన కూర తీసుకోవాలి. నిద్రకు ముందు గ్లాస్ గోరువెచ్చని పాలు తాగాలి.

**గోధుమలు వద్దు**

చిన్నారులకు గోధుమలతో కూడిన ఆహారం ఇవ్వడం సరికాదని డాక్టర్ కాశిష్ ఎ చాబ్రియా అభిప్రాయం. దీనిలో గ్లూటెన్ ఉండడం వల్ల పేగులను జిగటలా మార్చి ఆహారాన్ని సరిగా ముందుకు పోనివ్వదని వివరించారు.చాలా మంది పిల్లలకు గ్లూటెన్ పడదు కనుక, దాన్ని డైట్ నుంచి మినహాయించడం మంచిదంటున్నారు.

**శారీరక కదలికలు**

పిల్లలకు రోజువారీ శారీరక శ్రమ అవసరం. బలమైన ఎముకలు, తగినంత కండరాల బలం కోసం శారీరక కదలికలు ఉండేలా చూడాలి. నడక, పరుగు, ఇతర క్రీడలు ఉపయోగపడతాయి. ఈ విషయంలో తల్లిదండ్రులే పిల్లలకు మార్గదర్శకం. కనుక వారు చేయడం ద్వారా పిల్లలను ప్రోత్సహించొచ్చు.

**వేటిలో ఏ పోషకాలు**

పిల్లలకు సమతుల పోషకాహారం ఎంతో ప్రాధాన్యమని ఇక్కడ చెప్పుకున్నాం. అవేంటన్న సందేహం రావచ్చు. కనుక పోషకాలు ఏవి, ఎందులోఅవి లభ్యమవుతాయన్నది తెలుసుకోవచ్చు.

**ప్రొటీన్స్**

శరీరంలో కణాల నిర్మాణానికి ప్రొటీన్లు అవసరం. ఆహారాన్ని శక్తిగా మార్చేందుకు, ఇన్ఫెక్షన్ పై పోరాడేందుకు, ఆక్సిజన్ ను సరఫరా చేసేందుకు ప్రొటీన్లు అవసరం. మాంసం, పౌల్ట్రీ, చేపలు, గుడ్లు, నట్స్ (బాదం, అక్రూట్ తదితర), బీన్స్, పాల ఉత్పత్తుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది.

**కార్బోహైడ్రేట్స్**

శరీరానికి శక్తినందించే కీలక వనరులు ఇవి. కొవ్వు, ప్రొటీన్లను శరీర కణజాల నిర్మాణానికి ఉపయోగించేందుకు ఇవి అవసరం. చక్కెరలు, గంజి, పీచు పదార్థాలు ఇలా భిన్న ఆహార పదార్థాల్లో కార్బొహైడ్రేట్స్ తగినంత ఉంటాయి. చిన్నారులకు మాత్రం చక్కెరలు కాకుండా, ఇతర రూపాల్లో ఇవి అందేలా శ్రద్ధ తీసుకోవాలి. బ్రెడ్స్, ధాన్యాలు, బియ్యం, ఆలుగడ్డల్లో కార్బొహైడ్రేట్లు పుష్కలం.

**ఫ్యాట్స్**

కొవ్వు పదార్థాలు పిల్లలకు అధికంగా ఇవ్వకూడదు. కానీ, తగినంత మోతాదు అవసరమే. కొన్ని రకాల పోషకాలను శరీరం తగిన విధంగా వినియోగించుకునేందుకు ఇవి అవసరమవుతాయి. కొవ్వులు అధికంగా ఉండే వాటిలో హోల్ మిల్క్ పదార్థాలు, వంట నూనెలు, మాంసం, చేపలు, నట్స్.

**క్యాల్షియం**

ఎముకలు, దంతాలకు అవసరమైన మూలకం క్యాల్షియం. నరాలకు, రక్తం గడ్డ కట్టేందుకూ, కండరాలకు, గుండె పనితీరుకూ క్యాల్షియం అవసరమవుతుంది. పాలు, పెరుగు, ఐస్ క్రీమ్, గుడ్డు పచ్చసొన, క్యాబేజీ, పాలకూర తదితర పదార్థాల్లో క్యాల్షియం తగినంత లభిస్తుంది.

# 12 జ్యోతిర్లింగాలు ఎక్కడున్నాయో తెలుసా..? వాటి ప్రత్యేకత ఏంటి..?



శివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో శివుని పూజలో పాల్గొంటారు. ఉపవాసం చేసి, రాత్రి జాగరణ చేస్తారు. ఈ సందర్భంలో 12 జ్యోతిర్లింగాల గురించి తెలుసుకోవడం ఎంతో ముఖ్యమైనది. భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఈ జ్యోతిర్లింగాలకు ప్రతి ఒక్కదానికి విశేషమైన ప్రత్యేకత ఉంది. జ్యోతిర్లింగాలు శివుని కాంతి రూపం అని చెబుతారు. ఈ 12 జ్యోతిర్లింగాలపై శివుని ప్రత్యేక ఆశీస్సులు ఉంటాయని అక్కడ పూజలు చేసిన వారికి శివుని కృప లభిస్తుందని భక్తులు నమ్ముతారు.

**సోమనాథ జ్యోతిర్లింగం..** గుజరాత్ లోని సౌరాష్ట్రంలో సోమనాథ జ్యోతిర్లింగం మొదటి జ్యోతిర్లింగంగా గుర్తించబడింది. ఇది శివుని ప్రధాన పూజా స్థలాలలో ఒకటి.

**మల్లికార్జున జ్యోతిర్లింగం..** శ్రీశైలం పర్వతంపై కృష్ణానది ఒడ్డున మల్లికార్జున జ్యోతిర్లింగం ఉంది.ఇది ఆంధ్రప్రదేశ్ లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.

**మహాకాలేశ్వర జ్యోతిర్లింగం..** ఉజ్జయినిలో ఉన్న మహాకాలేశ్వర జ్యోతిర్లింగం దక్షిణాభిముఖంగా ఉన్న ఏకైక జ్యోతిర్లింగంగా ప్రసిద్ధి పొందింది. ఇది మధ్యప్రదేశ్ లో ఉంది.

**ఓంకారేశ్వర జ్యోతిర్లింగం..** ఓంకారేశ్వర జ్యోతిర్లింగం నర్మదా నది ఒడ్డున ఇండోర్ సమీపంలోని మాల్వా ప్రాంతంలో ఉంది.

**భీమాశంకర జ్యోతిర్లింగం..** మహారాష్ట్రలోని పూణే సమీపంలోని సహ్యాద్రి పర్వత శ్రేణులపై ఉన్న భీమాశంకర జ్యోతిర్లింగం కూడా ప్రధానంగా గుర్తించబడింది.

**కేదారనాథ జ్యోతిర్లింగం..** హిమాలయాల్లో కేదార్ పర్వతంపై ఉన్న కేదారనాథ జ్యోతిర్లింగం ఉత్తరాఖండ్ లో ప్రసిద్ధి చెందింది. ఇది అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా భావిస్తారు.

**కాశీ విశ్వనాథ జ్యోతిర్లింగం..** ఉత్తరప్రదేశ్ లోని వారణాసిలో ఉన్న కాశీ విశ్వనాథ జ్యోతిర్లింగం పవిత్ర కాశీలో ప్రసిద్ధి చెందినది. ఇది శివుని అతి ముఖ్యమైన పూజా స్థలాలలో ఒకటి.

**త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం..** మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో గోదావరి నది ఒడ్డున ఉన్న త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం ఎంతో విశిష్టమైనది.

**వైద్యనాథ జ్యోతిర్లింగం..** జార?ండ్ లోని దేవఘర్లో ఉన్న వైద్యనాథ జ్యోతిర్లింగం మత విశ్వాసాల ప్రకారం చితాభూమి అని పిలువబడింది. ఇది ప్రధాన జ్యోతిర్లింగాలలో ఒకటి.

**నాగేశ్వర జ్యోతిర్లింగం..** గుజరాత్ లో ద్వారకా పురి సమీపంలో ఉన్న నాగేశ్వర జ్యోతిర్లింగం శివుని ఇష్ట ప్రకారం ప్రసిద్ధి చెందింది.

**రామేశ్వర జ్యోతిర్లింగం..** తమిళనాడులోని రామనాథంలో ఉన్న రామేశ్వర జ్యోతిర్లింగం 11వ జ్యోతిర్లింగంగా గౌరవించబడింది.

**ఘృష్టేశ్వర జ్యోతిర్లింగం..** మహారాష్ట్రలోని సంభాజీనగర్ లో దౌలతాబాద్ సమీపంలో ఉన్న ఘృష్టేశ్వర జ్యోతిర్లింగం శివుని 12వ జ్యోతిర్లింగం.

# ఔషధ గుణాల రోజా....ఆరోగ్యానికి రాజా

చూడగానే ఎంతో అందంగా కన్పించే రోజా పూలకు ఎన్నో ఔషధ గుణాలున్నాయి. అవి అందానికే కాదు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు. రోజా రేకులను తినడం వల్ల పలు రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అవేంటో ఒకసారి చూద్దాం...



**వీర్యవృద్ధి :** రోజా రేకులు మీ శృంగార జీవితానికి చాలా దోహదం చేస్తాయి. శాస్త్రీయ పరిశోధనల ప్రకారం, రోజా రేకులను రోజూ గుప్పెడు తింటూ వస్తే అవి మన శరీరంలోని దోషాలను పోగొడుతాయి. తద్వారా రక్తశుద్ధి జరుగుతుంది. అంతేకాక సహజంగానే వీటికి వీర్యవృద్ధిని కలిగించే గుణముంది.

**మొటిమలు, నల్లమచ్చలు మటుమాయం :** యుక్త వయసులో హార్మోన్ల ప్రభావంతో యువతీ యువకులకు మొహంపై వచ్చే మొటిమలు, తద్వారా ఏర్పడే నల్లమచ్చలను పోగొట్టడంలో రోజా రేకులు సమర్థవంతంగా పనిచేస్తాయి. రేకులను నీటిలో బాగా మరిగించాలి. తర్వాత వాటిని బయటకు తీసి ముద్దగా నూరాలి. దీనికి ముల్తానీ మట్టి కలిపి మిశ్రమంగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని వారంలో ఒక్కసారి మీ మొహంపై రాసుకుంటే సత్ఫలితం ఉంటుంది. క్రమేపీ నల్లమచ్చలు తగ్గిపోవడం మీరు గుర్తించవచ్చు. అంతేనా...రోజా రేకులు మీ మొహ చర్మాన్ని ఆరోగ్యవంతంగా కూడా ఉంచడంలో ఇవెంతగానో దోహదపడతాయి.


**రోజా రేకుల కషాయం :** రోజా రేకులతో తయారు చేసే కషాయం కూడా ఆరోగ్యానికి మంచిదే. మార్కెట్లలో లభించే ఔషధాల కంటే కూడా ఇది బాగా పనిచేస్తుంది. మీ చర్మానికి మెరుపును అందిస్తుంది. చర్మంపై ప్రధానంగా మొహంపై మొటిమల వల్ల ఏర్పడిన కూపములను ఇది తగ్గిస్తుంది. దీనిని మీరు మీ ఇంట్లోనే స్వయంగా తయారు చేసుకోవచ్చు. మీకు కావాల్సిందల్లా రోజా రేకులు, నీరు మాత్రమే.

**మనసుకు ప్రశాంతత :** రోజా పూల నుండి వచ్చే సువాసనను ఆస్వాదించడం వల్ల మీకు శారీరకంగానే కాక మీ మనసుకు కూడా ప్రశాంతత చేకూరుతుంది. ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికి దోహదపడుతుంది. వేడి నీటిలో రోజా రేకులతో పాటు కొంత బాత్ సాల్ట్ని కలిపాలి. ఈ మిశ్రమాన్ని ఒక పద్ధతి ప్రకారం, మీరు గనుక పీల్చితే తప్పకుండా ఉపశమనం లభించి, చురుగ్గా మారుతారు.

**నాజూకుతనానికి :** రోజా రేకుల్లో ఉండే పదార్థాలు నాజూకుతనానికి బాగా ఉపయోగపడుతాయి. కొద్దిగా మెంతులు, రోజా రేకులు కలిపి చేసుకున్న పేస్టును తినడం లేదా రోజా రేకులతో కాచిన కషాయాన్ని తాగినా మీరు సన్నబడతారు. అంతేకాక రోజా రేకులు జీవక్రియను మెరుగుపరుస్తాయి. తద్వారా మీరు సన్నబడే అవకాశముంటుంది.

# ఓటీపీలు చెప్పకపోయినా.. మీ బ్యాంకు ఖాతా హ్యాక్.. అర్జెంటుగా ఈ టిప్స్ తెలుసుకోకపోతే డేంజర్..

సైబర్ నేరగాళ్లు మీ బ్యాంకు అకౌంట్‌లో డబ్బు కొట్టేయడానికి సరికొత్త మార్గాలు వెతుక్కుంటు న్నారు. ఇప్పుడు వాళ్లకు మీ మనీ కాజేయడానికి మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీలు, ఏటీఎం పిన్‌లు కూడా అవసరం లేదు. ఇటీవల కాలంలో ఈ కేటుగాళ్లు మీకు బ్యాంకుల నుంచి వచ్చినట్లుగా నకిలీ మెసేజ్‌లు పంపిస్తున్నారు. మీరు పొరపాటున ఆ లింకులపై క్లిక్ చేశారో అంతే సంగతులు, మీ ఖాతాలోని డబ్బు క్షణాల్లో మాయం అవుతుంది.ఆమెకు మీరు ఒక బహుమతి గెలుచుకున్నారని మెసేజ్ వచ్చింది. కానీ ఆ మెసేజ్‌లో ఉన్న ఒక చిన్న తప్పును ఆమె గమనించింది. అనుమానం రావడంతో ఆ మోసం నుంచి ఆమె తప్పించుకోగలిగింది. కానీ అందరికీ ఆమెలాంటి పరిశీలన ఓపిక తెలివి ఉండకపోవచ్చు. సురక్షితంగా ఉండాలంటే ఏం చేయాలి.. ఎవరైనా తెలియని వ్యక్తులు ఫోన్ చేసినా, మెసేజ్‌లు పంపినా చాలా జాగ్రత్తగా ఉండాలి. మీ వ్యక్తిగత వివరాలు, బ్యాంకు అకౌంట్ డీటెయిల్స్ లాంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరితోనూ షేర్ చేసుకోవద్దు. అది ఎంత నమ్మకంగా అనిపించినా తొందరపడొద్దు. డిస్కౌంట్లు, వోచర్లు, క్యాష్ రివార్డులు అంటూ ఆఫర్లు ఇచ్చే లింకులపై అస్సలు క్లిక్ చేయవద్దు.అవి మిమ్మల్ని ట్రాప్ చేయడానికే అని గుర్తుంచుకోవాలి. యాప్స్ డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు నమ్మకమైన ప్లే స్టోర్ లేదా




యాప్ స్టోర్ వంటి వాటి నుంచే చేసుకోవాలి. ఎక్కడ పడితే అక్కడ దొరికే యాప్స్ అస్సలు వద్దు. ఎందుకంటే ఆ యాప్‌లు మీ ఫోన్ కెమెరా, ఫొటో గ్యాలరీ వంటి వాటికి యాక్సెస్ తీసుకుంటాయి.వాటితో స్కామర్లు కేవైసీ మోసాలు చేస్తారు. ఒకవేళ మీకు ఏదైనా అనుమానాస్పదమైన ఫోన్ కాల్ వస్తే, వెంటనే స్పందించవద్దు. ముందు ఆ విషయాన్ని అధి కారిక మార్గాల ద్వారా క్రాస్ చెక్ చేసుకోవాలి. అవసరమైతే వస్తే అధికారులకు ఫోన్ చేయాలి. అప్పుడే మోసాల బారిన పడకుండా సురక్షితం గా ఉండగలరు. కాల్ మెర్జింగ్ స్కామ్ ఈ ట్రిక్‌లో స్కామర్ మీకు ఫోన్ చేస్తాడు. తెలిసిన వ్యక్తిలా మాట్లాడుతూ ఏదో ఒక ఈవెంట్ కవర్ చేయమని అడుగుతాడు. మీరు మాట్లాడుతుండ్‌గానే మరో నంబర్ నుంచి మీకు కాల్ వస్తుంది. అప్పుడు స్కామర్ రెండో కాల్ ఏదో వీఐపీ నుంచి అని నమ్మించి, రెండు కాల్స్‌ను మెర్జ్ చేయమని అడుగుతాడు. మీరు మెర్జ్ చేయగానే, హ్యాకర్ మీ మాటలు వింటూ ఉంటాడు. మీరు బ్యాంకు నుంచి గానీ, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి యాప్‌ల నుంచి గానీ వచ్చే ఓటీపీలను చెప్పేస్తే అవి వాళ్లకు తెలిసిపోతాయి. అంతే, మీ అకౌంట్లు హ్యాక్ చేసి డబ్బు కొట్టేస్తారు. మీ ఫ్రెండ్‌కి ఫ్రెండ్‌ని అని కూడా చెప్తారు జాగ్రత్త. మాల్వేర్ స్కామ్ హ్యాకర్లు ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ ఫైల్స్‌లో, రిమోట్ యాక్సెస్ ట్రోజన్‌లు )లో మాల్వేర్‌ను దాచిపెడతారు. ఈ మాల్వేర్‌తో స్కామర్లు మీ ఫోన్‌ను మీకు తెలియకుండానే కంట్రోల్ చేయగలరు. ఉదాహరణకు, గతేడాది మే 21న హసన్ సబ్-డివిజన్‌కు చెందిన ఒక డీఎస్పీ ఏకంగా రూ.15.98 లక్షలు పోగొట్టుకున్నారు. ఆయన ఒక నేషనలైజ్డ్ బ్యాంకు నుంచి వచ్చినట్లుగా ఉన్న మెసేజ్‌లోని లింక్ ద్వారా ఒక యాప్ ఇన్‌స్టాల్ చేసుకు న్నారు. ఆ లింక్‌లో మాల్వేర్ ఉండటంతో, హ్యాకర్లు ఆయన ఫోన్‌లోకి ఈజీగా ఎంటర్ అయిపోయారు.

గురువారం, అక్టోబర్ 30, 2025
చర్చ
తెలుగు దిన పత్రిక
10

# ఈ తరహా ఆండ్రాయిడ్ యాప్స్ తో జాగ్రత్త..
## ఫోన్ స్లో అవుతుంది, వ్యక్తిగత డేటాకూ ప్రమాదమే!

ఏదో ఒక కొత్త తరహా యాప్ వస్తుంటుంది. మనం ఇన్ స్టాల్ చేస్తూ వెళుతుంటాం. దీనివల్ల చాలా సమస్యలు ఎదురవుతాయి. ఫోన్ పనితీరు దెబ్బతినడంతోపాటు మన వ్యక్తిగత అంశాలూ ప్రమాదంలో పడతాయి. మన బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డుల వివరాలు వంటివీ పరుల పాలయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల కొన్ని రకాల యాప్ లకు దూరంగా ఉండడమే ఉత్తమం. గూగుల్ ప్లేస్టోర్ లో రోజూ కొన్ని వేల సంఖ్యలో కొత్త యాప్ లు పుట్టుకొస్తున్నాయి. అందువల్ల అన్నింటినీ గూగుల్ సంస్థ ట్రాక్ చేయలేదు. ఒక వేళ వినియోగించాల్సి వచ్చినా.. కాస్త పేరున్న, రక్షణపరంగా ఉత్తమమైనవిగా రేటింగ్ ఉన్న వాటిని ఇన్ స్టాల్ చేసుకోవడం బెటర్. మరి ఎలాంటి యాప్ లతో ప్రమాదం, ఎలాంటి వాటికి దూరంగా ఉండాలో చూద్దాం... వాతావరణ (వెదర్) వివరాల యాప్స్ తో ప్రమాదం ఉష్ణోగ్రతలు, వర్షం పడే అవకాశాలు, గాలిలో తేమ వంటి వివరాలు కచ్చితంగా అందిస్తామంటూ చాలా రకాల యాప్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో కొన్ని ప్రఖ్యాత యాప్ లు మినహా మిగతావన్నీ ఫోన్ పనితీరును దెబ్బతీసేవేనని, వాటితో భద్రతకూ ముప్పు ఉంటుందని టెక్నాలజీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా రకాల యాప్స్ లో అంతర్గతంగా ట్రోజాన్లు అనే వైరస్ లు ఉంటున్నాయి. మనం యాప్ ను ఇన్ స్టాల్ చేసేటప్పుడే లొకేషన్, మెస్సెజెస్, కాల్ లాగ్ డేటా వంటి చాలా రకాల పర్మిషన్లు అడుగుతుంటాయి. మనం పర్మిషన్ ఇచ్చేయడం తో అవి డేటాను సేకరిస్తూ, హ్యాకర్లకు చేరవేస్తుంటాయి. అందువల్ల మనకు అంతగా వాతావరణ వివరాలు తెలుసుకోవాలనుకుంటే నేరుగా ఫోన్ లోని ఏదైనా ఇంటర్నెట్ బ్రౌజర్ లో సులువుగా తెలుసుకునే అవకాశం ఉంది. సోషల్ మీడియా యాప్స్ తో ఫోన్ స్లో ఇప్పుడంతా ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్ స్టాగ్రామ్, ట్వీటర్ వంటి ఎన్నో సోషల్ మీడియా అకౌంట్లను వినియోగిస్తున్నారు. ఇందుకోసం ఫోన్లో వాటన్నింటి యాప్స్ ను ఇన్ స్టాల్ చేస్తూ ఉంటాం. అయితే ప్రముఖ సోషల్ మీడియా యాప్స్ తో భద్రతా పరమైన ప్రమాదం పెద్దగా లేకపోయినా వాటి వల్ల ఇతర సమస్యలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా ఫేస్ బుక్ వంటి యాప్స్ చాలా ఎక్కువ మెమరీని వినియోగించుకుంటూ, ఎక్కువ మొత్తంలో బ్యాటరీని వినియోగించుకుంటూ ఉంటాయి. సోషల్ మీడియా యాప్స్ నిరంతరం బ్యాక్ గ్రౌండ్ లో రన్ అవుతూ.. ఇంటర్నెట్ కు కనెక్ట్ అవుతూ.. డేటా సింక్రనైజేషన్ కు ప్రయత్నిస్తాయి. దీనివల్ల ఫోన్ బాగా స్లో అవుతుంది. తక్కువ ప్రాసెసర్, ర్యామ్ సామర్థ్యమున్న ఫోన్లు అయితే వీటి వల్ల తరచూ ల్యాగ్ అవుతూ ఉంటాయి కూడా. మన వినియోగించేవి మినహా అవసరం లేని సోషల్ మీడియా యాప్స్ ను వెంటనే ఫోన్ లోంచి తొలగించడం చాలా బెటర్. ముఖ్యంగా ఫేస్ బుక్ యాప్ చాలా ఎక్కువగా డేటాను కూడా వినియోగించుకుంటుంది. దాని బదులుగా నేరుగా క్రోమ్ వంటి ఇంటర్నెట్ బ్రౌజర్ ను ఇన్ స్టాల్ చేసుకుని దానిలో ఫేస్ బుక్ ను వినియోగించడం బెటర్. దీనివల్ల డేటా తక్కువగా వినియోగం అవడంతోపాటు ఫోన్ కూడా చాలా వేగంగా పనిచేస్తుంది. ఫోన్ ఆప్టిమైజర్ యాప్ లు దండగస్మార్ట్ ఫోన్ లో



జంక్ ఫైల్స్ ను, అనవసరపు డేటాను, బ్యాక్ గ్రౌండ్ ప్రాసెస్ లను తొలగించి.. ఫోన్ లో మెమరీని ఫ్రీ చేస్తామని, వేగంగా పనిచేసేలా చేస్తామని పేర్కొంటూ ఎన్నో రకాల యాప్ లు అందుబాటులో ఉన్నాయి. కానీ వాస్తవంగా చెప్పాలంటే అలాంటి యాప్ ల వల్ల ఎలాంటి ఉపయోగ మూ లేదు. పైగా ఫోన్ స్లో అవడంతో పాటు మన వ్యక్తిగత డేటా చోరీకి గురయ్యే ప్రమాదం ఎక్కువ. అంతేగాకుండా వాటి వల్ల అనవసరపు యాడ్స్ ను భరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చాలా ఆండ్రాయిడ్ ఫోన్లలో కస్టమ్ ఆపరేటింగ్ సిస్టం వస్తోంది. అంటే ఫోన్ తయారీదారులే ఫోన్ కు తగినట్లుగా ఆ ఫోన్ మెరుగ్గా పని చేసేలా ఆండ్రాయిడ్ లో మార్పులు చేసి అందజేస్తు న్నారు. అలాంటివాటిలోనే ఇన్ బిల్ట్ గా డేటా క్లీనింగ్, బ్యాక్ గ్రౌండ్ ప్రాసెస్ లను క్లోజ్ చేయడం వంటి ఆప్షన్లు ఉంటున్నాయి. గూగుల్ ప్లే స్టోర్ లో అత్యధిక రేటింగ్ ఉన్న క్లీన్ మాస్టర్, డీయూ బ్యాటరీ డాక్టర్ సహా అన్ని రకాల ఆప్టిమైజర్ యాప్ లు కూడా ఫోన్ పనితీరు మందగించేలా చేస్తాయని ఇప్పటికే టెక్నాలజీ నిపుణులు నిర్ధారించారు. ఆప్టిమైజర్ యాప్ లు వినియోగించడానికి బదులుగా.. కొద్ది రోజులకోసారి ఫోన్ లోని డేటాను బ్యాకప్ తీసుకుని, ఫోన్ ను ఫ్యాక్టరీ రీసెట్ చేయడం మేలు. దానివల్ల ఫోన్ చాలా వేగంగా పనిచేస్తుంది. స్మార్ట్ ఫోన్ లో ఇన్ బిల్ట్ గా వచ్చే బ్రౌజర్లతో సమస్యలు మనం స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేసినప్పుడు ఇన్ బిల్ట్ గా ఇంటర్నెట్ బ్రౌజర్లు వస్తుంటాయి. అవి చాలా వరకు పాపులర్ కాకపోవడంతోపాటు చాలా స్లోగా పనిచేస్తుంటాయి. ఫోన్ లో ఏదైనా ఇంటర్నెట్ లింక్ ను క్లిక్ చేయగానే దాదాపుగా ఇన్ బిల్ట్ గా వచ్చిన బ్రౌజర్ లో ఓపెన్ అయ్యేలా సెట్టింగ్ ఉంటుంది. అయితే ఏ బ్రౌజర్ తో ఓపెన్ చేయాలనే ఆప్షన్ కూడా వస్తుంటుంది. అందువల్ల సెట్టింగ్స్ లో డీఫాల్ట్ ఇంటర్నెట్ బ్రౌజర్ ను మార్చుకుంటే బెటర్. ఇన్ బిల్ట్ గా వచ్చే బ్రౌజర్లు పాత వెర్షన్లకు సంబంధించినవి అయి ఉంటాయి. వాటిల్లో సెక్యూరిటీ లోపాలు ఉండే అవకాశాలు ఎక్కువ. అందువల్ల మన డేటా హ్యాకర్లు, మాల్ వేర్ల బారిన పడే ప్రమాదం ఉంటుంది. పేరులేని సంస్థల యాంటీ వైరస్ లతో ప్రమాదం మన స్మార్ట్ ఫోన్ ను వైరస్ లు, ట్రోజాన్లు, మాల్ వేర్ల నుంచి రక్షించుకునేందుకు యాంటీ వైరస్ యాప్ లను ఇన్ స్టాల్ చేస్తూ ఉంటాం. గూగుల్ ప్లే స్టోర్ లో కొన్ని వందల రకాల యాంటీ వైరస్ యాప్ లు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో చాలా వరకు ఊరూ పేరులేని సంస్థలకు చెందిన యాప్ లే. ఆకర్షణీయమైన లోగోలు, పేర్లతో ఉండే ఈ యాంటీ వైరస్ యాప్ లతో ప్రమాదం చాలా ఎక్కువ. అలాంటి వాటిల్లో ట్రోజాన్లు ఉంటాయి. అవి మన ఫోన్ లోని సమాచారాన్ని, వ్యక్తిగత డేటాను తస్కరిస్తాయి. కొందరు హ్యాకర్లు ఆకర్షణీయమైన పేర్లతో, లోగోలతో యాంటీ వైరస్ సాఫ్ట్ వేర్లను తయారు చేసి గూగుల్ ప్లేస్టోర్ లో పెడుతున్నారు. వాటిని డౌన్లోడ్ చేసుకున్నారో అంతే సంగతి. కాస్పర్ స్కీ, అవైరా, ఏవీజీ, అవాస్ట్, మెకఫీ వంటి ఏదైనా ప్రముఖ సంస్థకు చెందిన యాంటీ వైరస్ ను మాత్రమే వినియోగించడం బెటర్. ఇటీవల గూగుల్ సంస్థ ప్లేప్రొటెక్ట్ పేరుతో యాంటీ వైరస్, ట్రోజాన్ స్కానర్ ను తీసుకువచ్చింది. ఏదైనా యాప్ ను డౌన్ లోడ్ చేసుకునే ముందు ప్లే ప్రొటెక్ట్ అప్రూవ్ ఉందా లేదా చూడాలి. అదనపు సౌకర్యాలున్న ఇంటర్నెట్ బ్రౌజర్లతో జాగ్రత్త కేవలం ఇంటర్నెట్ ను బ్రౌజ్ చేయడంతోపాటు వీడియోలు, ఆడియోను నేరుగా స్ట్రీమ్ చేయడం వంటి అదనపు సౌకర్యాలున్న ఇంటర్నెట్ బ్రౌజర్లతో చాలా సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి యాప్ లకు మన ఫోన్ కు సంబంధించిన చాలా పర్మిషన్లు ఇవ్వాల్సి ఉంటుంది. దానివల్ల ఈ యాప్ ల ద్వారా కీలకమైన వ్యక్తిగత డేటా, కాల్ డేటా, ఎస్సెమ్మెస్ లు వంటి సమాచారం చోరీకి గురయ్యే అవకాశం ఎక్కువ. దీనితోపాటు ఇలాంటి యాప్ లలో విపరీతంగా యాడ్స్ వస్తుంటాయి. దాని వల్ల మన డేటా వేస్ట్ కావడమే కాకుండా.. ఫోన్ చాలా స్లో అవుతూ ఉంటుంది. అటు ఇంటర్నెట్ బ్రౌజ్ చేయడానికి, ఇటు స్ట్రీమింగ్ కు ఉపయోగపడే యాప్ లను వినియోగించకపోవడం చాలా బెటర్. దానికి బదులుగా విడిగా స్ట్రీమింగ్ కు వినియోగించే.. మంచి సంస్థల యాప్ లను ఉపయోగించాలి. ర్యామ్ ఇంప్రూవ్ మెంట్ యాప్స్ తో లాభం సున్నా.. మీ ఫోన్ లో ర్యామ్ ను పెంచుతామంటూ కొన్ని రకాల యాప్స్ గూగుల్ ప్లేస్టోర్ లో అందుబాటులో ఉన్నాయి. వేరే ఇతర యాప్ లను ఉపయోగించినప్పుడు, వెబ్సైట్లు బ్రౌజ్ చేస్తున్నప్పుడు ఇలాంటి యాప్ లకు సంబంధించిన ప్రకటనలు కనిపిస్తూ.. ఇన్ స్టాల్ చేసుకునేలా ఊరిస్తుంటాయి. వాస్తవానికి ఇలాంటి యాప్ లు కేవలం ఆప్టిమైజర్లు మాత్రమే. అవి ఫోన్ లో క్యాచీని, ఇతర తాత్కాలిక ఫైళ్లను క్లీన్ చేస్తాయంతే. అంతేతప్ప వాటితో ఫోన్ లో ర్యామ్ పెరగడం వంటివేవీ ఉండవు. అసలు ఫోన్ లో ఇచ్చిన ర్యామ్ కు మించి సామర్థ్యాన్ని పొందడం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదు. ఇలాంటి యాప్స్ కేవలం యాడ్స్ (ప్రకటనల) ద్వారా డబ్బు సంపాదించుకోవడానికి, మన ఫోన్ లోని డేటాను తస్కరించడానికి మాత్రమే తయారు చేస్తుంటారు. లై డిటెక్టర్లు పనిచేయవు.. అవి జస్ట్ ఫర్ ఫన్ మన వాయిస్ ను బట్టి మనం నిజం చెబుతున్నామో, అబద్ధం చెబుతున్నామో చెప్పగలమంటూ గూగుల్ ప్లేస్టోర్ లో కొన్ని రకాల యాప్స్ ఉన్నాయి. అవేవీ వాస్తవానికి లై డిటెక్టర్ గా పని చేయలేవు. కేవలం సరదా కోసం రూపొందించేవి మాత్రమే. ఇది తెలిసి కూడా కొందరు సరదాగా అలాంటి యాప్స్ ఇన్ స్టాల్ చేస్తుంటారు. వీటివల్ల సరదా ఏమోగానీ మన ఫోన్ పనితీరు దెబ్బతింటుంది. సాధారణం గా ఇలాంటి ఫన్నీ యాప్స్ కు మన ఫోన్ లోని కాంటాక్టులు, ఎస్సెమ్మెస్ లు, లొకేషన్ వంటి వ్యక్తిగత వివరాల పర్మిషన్లు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. అయినా ఇలాంటి ఏదైనా యాప్ ఇన్ స్టాల్ చేస్తున్నప్పుడు అలాంటి పర్మిషన్లు అడిగితే.. దానిని ఇన్ స్టాల్ చేయకుండా ఉండటమే బెటర్. లేకుంటే మన వ్యక్తిగత సమాచారం ఇతరుల పాలవుతుంది.

# పాము - ముంగిస శత్రుత్వం నిజమేనా, పాము కాటేసినా ముంగిస చనిపోదా?

పాములు, ముంగిసల గొడవ గురించి ఎప్పుడూ చర్చ జరుగుతూనే ఉంటుంది. ఇవి రెండూ భారత్‌లో తరచూ కనిపించే జీవులే. అయితే, ఈ రెండింటి పోరాటంపై ప్రజలకు విపరీతమైన ఆసక్తి కూడా. పాము, ముంగిసల మధ్య జరిగే పోరాటాన్ని భారత ఉపఖండంలోని అనేక పురాతన గాథలు, ఇతిహాసాలు, ఆధునిక కథల్లోనూ వివరించారు. వీటి మధ్య శత్రుత్వం గురించి మనం చాలా కథలు విన్నాం. అయితే, పాము,ముంగిస గొడవపడితే ముంగిస గెలుస్తుందా? ఒకవేళ ఈ గొడవలో పాము ముంగిసను కాటేస్తే? అయినా, ఆ ముంగిస ఎందుకు చనిపోదు? ముంగిస పిల్లలను పాములు తింటాయని, అందుకే వాటి మధ్య శత్రుత్వమని చెబుతారు. పాములు తమ పిల్లలను చంపేస్తాయని ముంగిసలు భయపడతాయి. అందుకే, పామును చూడగానే ఆడ ముంగిస దాడి చేస్తుంది. అయితే, పరిమాణం పెద్దగా ఉండే ముంగిసల వంటి వాటిని కొండచిలువలు మాత్రమే మింగగలవని నిపుణులు చెబుతున్నారు. ఇతర పాములు బల్లులు, కప్పలు, ఎలుకల వంటి వాటిని తింటాయి. ముంగిసకు ఇతర పాముల నుంచి ఎక్కువగా ప్రమాదం ఉండదు. కానీ, పాములకు ముంగిస నుంచి ప్రమాదం ఉంటుంది. ముంగిసల ప్రవర్తనపై డాక్టర్ రష్మీ శర్మ 'స్టడీ ఆఫ్ బిహేవియర్ ఆఫ్ ఇండియన్ మంగూస్' అనే పరిశోధనా పత్రం రాశారు. అందులో "ముంగిసలు ప్రధానంగా పగటిపూట చురుగ్గా ఉంటాయి. అవి విషపూరిత పాములతో పోరాడి, వాటిని చంపుతుంటాయి. చురుకుదనమే ముంగిసలకు గొప్ప బలం" అని రష్మీ శర్మ అందులో రాశారు "ముంగిసలుఎక్కువగా గుంపులుగా ఉంటాయి. ప్రతీ గుంపులో 6 నుంచి 40 వరకు ముంగిసలు ఉంటాయి. ఈ గుంపులో ఏ ముంగిస బలంగా ఉంటే (ఆడదైనా, మగదైనా) అది ఆ గుంపు లీడర్‌గా ఉంటుంది. గుంపులోని ప్రతి ముంగిసకు ఒక నిర్దిష్టమైన పని ఉంటుంది"



అని పరిశోధనా పత్రంలో పేర్కొన్నారు. "కొన్ని ముంగిసలకు వాటిచుట్టూ పొంచివున్న ముప్పులను పర్యవేక్షించే బాధ్యత అప్పగిస్తాయి. సమయాన్ని బట్టి వాటి పని కూడా మారుతుంటుంది. ముంగిసలకు చాలా పదునైన ముక్కుతోపాటు చెవులు, కళ్లు చురుగ్గా ఉంటాయి" అని రష్మీ శర్మ తన పరిశోధన పత్రంలో వివరించారు. ముంగిసను పాము కాటేస్తే? విషపూరితమైన పాములు, కోబ్రాలను కూడా ఎదుర్కొని ముంగిసలు ఎలా పోరాడగలుగుతాయి? కొన్నిరకాల ముంగిసలు అత్యంత విషపూరితమైన, ప్రమాదకరమైన పాముల నుంచి తమను తాము రక్షించుకోగలవు. పాము విషంలో సాధారణంగా వేగంగా ప్రభావం చూపే ఆల్ఫా-న్యూరోటాక్సిన్ ఉంటుంది. విషం శరీరంలోకి వెళ్లాక నాడీ వ్యవస్థ నుంచి వచ్చే సందేశాలను ఆల్ఫా-న్యూరోటాక్సిన్ బ్లాక్ చేస్తుంది. ఇది పక్షవాతానికి, చివరికి మరణానికి దారితీస్తుంది. కానీ, ముంగిస శరీరానికి పాము విషంతో పోరాడే అద్భుత సామర్థ్యం ఉంది. వాటి శరీరంలోని ఎసిటైల్‌కోలిన్ రిసెప్టార్ (గ్రాహకం )లో జరిగే మార్పులు, వాటి కండరాలకు సందేశాలు చేరేలా చేస్తాయి. కాబట్టి, పాము కాటేసినా ముంగిస తన ప్రాణాలను కాపాడుకోగలదు. దీనర్థం, పాము కాటు వేసినా ముంగిసకు ఏమీ కాదని కాదు. భారీ విష సర్పం, లేదా అత్యంత విషపూరితమైన పాము ముంగిసను చంపగలదని, భారీ మొత్తంలో విషం ముంగిస శరీరంలోకి వెళ్తే చనిపోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. పోరాటంలో అనుభవంలేని ముంగిస కూడా పాముపై గెలవగలదు. కానీ, కోబ్రాతో ముంగిస పోరాటం చాలా భయానకంగా ఉంటుంది. స్టడీ ఆఫ్ బిహేవియర్ ఆఫ్ ఇండియన్ ముంగూస్' పరిశోధనా పత్రం దీని గురించి వివరించింది. "ముంగిస శరీరంలోని ఎసిటైల్‌కోలిన్ గ్రాహకాల కారణంగా పాము విషం దాని శరీరాన్ని ప్రభావితం చేయదు. అయితే, అవి సాధారణంగా కోబ్రా వంటి అత్యంత విషపూరిత పాములతో పోరాడవు. అవి కోబ్రా మాంసాన్ని ఇష్టపడవు." పాములు, ముంగిసల ను సాధారణంగా ఒకదానికొకటి శత్రువులుగా చెబుతారు. అయితే, ముంగిసలు క్షీరదాలు. బ్రిటానికా ప్రకారం.. ముంగిసలు ప్రధానంగా ఆఫ్రికా, దక్షిణాసియా, దక్షిణ ఐరోపాలో కనిపిస్తుంటాయి. ముంగిసలకు ఎక్కువగా నేల బొరియల్లో, చెట్ల తొర్రల్లో నివసిస్తాయి. చిన్నచిన్న క్షీరదాలు, పక్షులు, సరీసృపాలు, జంతువుల గుడ్లు, పండ్లు ముంగిసకు ప్రధాన ఆహారం. ముంగిసలకు పాము తల అంటే ఇష్టం. ముంగిస ఎంత శక్తితో దాడి చేస్తుందంటే, ఆ దెబ్బకు పాము తల ఛిద్రమవుతుంది. ముంగిస చాలా చురుకైన జీవి కావడంతో, దాడి చేయడానికి ధైర్యం చేస్తుంది. ముంగిస దాడి చాలా తీవ్రంగా ఉంటుంది, కొన్నిసార్లు ఒక్క దెబ్బకే పాము చనిపోతుంది. పాముల సంఖ్యను అదుపులో ఉంచడానికి ముంగిసలు సాయపడతాయి. కొంతమంది ముంగిసలను పెంపుడు జంతువులుగా కూడా పెంచుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా అనేక రకాల ముంగిసలు ఉన్నాయి. భారతదేశంలో కనిపించే ప్రధాన జాతి 'బూడిద రంగు ముంగిస (ఇండియన్ గ్రే ముంగూస్)'. ఇదికాకుండా చారల ముంగిస ఎక్కువగా కనిపిస్తుంది. ఆఫ్రికాలో పొడవాటి తోక కలిగిన ముంగిస, కంగారూ ముంగిసలు కనిపిస్తాయి.

# చిన్న వయసులోనే విజయం సాధించవచ్చు..!
## ప్రతి వ్యక్తి తెలుసుకోవాల్సిన ముఖ్య విషయాలు..!

మహాభారతంలో మహాత్మా విదురది ఒక గొప్ప పాత్ర. ధర్మం, నీతి, రాజకీయాలలో అత్యున్నత జ్ఞానంతో ఉన్న విదురని ప్రతి ఒక్కరూ గౌరవించారు. వారికి దాసీ పుత్రుడైనా వారి ధర్మం,నీతి,విజ్ఞానంతో గౌరవాన్ని సంపాదించారు. ధృతరాష్ట్రునితో వారు చేసిన సంభాషణను విదుర నీతి అంటారు. ఇందులో ధర్మం, వ్యక్తిగత జీవితం, రాజకీయాల గురించి చాలా ముఖ్యమైన విషయాలు చెప్పబడ్డాయి. ఈ నీతులను పాటించే వారికి జీవితంలోని అనేక విషయాలలో లోతైన అవగాహన కలుగుతుంది. వారు వివిధ రంగాలలో విజయం సాధిస్తారు.

### విజయానికి మార్గం
మహాత్మా విదుర నీతి ప్రకారం కష్టపడటమే విజయానికి మూలము. క్రమశిక్షణతో కష్టపడే వ్యక్తి ఎప్పటికైనా విజయాన్ని సాధిస్తాడు. ఈ క్రమంలో ప్రతి సవాలునూ ధైర్యంగా ఎదుర్కొనే



సామర్థ్యం కలిగిస్తాయి. కానీ ఆలస్యం లేదా పనులను వాయిదా వేసే అలవాటు వ్యక్తిని విజయానికి దూరం చేస్తుంది. క్రమంగా నిర్లక్ష్యం చేసే స్వభావం వ్యక్తిని నిరుపయోగంగా మార్చేస్తుంది.

### కొత్త విషయాలు
విదుర నీతి ప్రకారం వ్యక్తి నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవాలని చెప్పబడింది. నిరంతరం నేర్చుకోవడం వ్యక్తికి విజయం సాధించడానికి అవసరమైన పరిజ్ఞానం, నైపుణ్యాలను పెంచుతుంది. ఈ విధంగా విద్య, నైపుణ్యాలు ఉన్న వ్యక్తులు జీవితంలో ప్రతి రంగంలో విజయం పొందుతారు. ఈ అలవాటు ప్రతి ఒక్కరికి ఉండాలి. ఎందుకంటే అది మనలోని అభివృద్ధిని వేగవంతం చేస్తుంది.

### నైపుణ్యాలు
విదురుడి మాటల ప్రకారం ప్రతి ఒక్కరికీ తమకు తగిన నైపుణ్యాలు తెలుసుకోవాలి. నైపుణ్యాలను సరిగ్గా అర్థం చేసుకోకపోతే మన శక్తిని వృధా చేయడమే కాకుండా దాని వినియోగంలో కూడా విఫలమవుతాం. చిన్న వయసులోనే తన జ్ఞానం, నైపుణ్యాలను గుర్తించేవారు ఎంతో వేగంగా విజయం సాధిస్తారు. ఈ అవగాహన వ్యక్తిని నైపుణ్య పరంగా మెరుగులు దిద్దడానికి దోహదపడుతుంది.

# పానీ పూరీ... ఇంట్లోనే టేస్టీగా చేసుకోవచ్చు...

పానీ పూరీ అంటే ఎగిరి గంతేసేవారు ఎందరో. ముఖ్యంగా చిన్నారులు ఒకసారి రుచిచూస్తే రోజూ పానీ పూరి కావాలని మారాం చేస్తుంటారు. మరి చిన్నారులు అడిగితే పెద్దలు కాదనలేరు. కానీ, వీధి పక్కన కనిపించే బండ్ల వద్ద అపరిశుభ్రతే వారిని వద్దు అనేలా చేస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో చిన్నారుల నుంచి పెద్దల వరకు చక్కని పానీ పూరీ రుచి చూసేందుకు మరో మార్గం ఉంది. ఇంట్లో చేసుకోవడం. శుభ్రతకు శుభ్రత, రుచికి రుచి. మరి ఎలా చేసుకోవాలన్నది తెలుసుకోండి.



### పూరి కోసం కావాల్సినవి
ఒక కప్పు సుజి (గోధుమ రవ్వ) లేదా ఆటా, మూడు టేబుల్ స్పూన్ల మైదా, పావు టీ స్పూను బేకింగ్ సోడా, అర టీ స్పూను ఉప్పు, బాగా వేయించేందుకు సరిపడా వంట నూనె.

### పానీ కోసం
అర కప్పు చింతపండు గుజ్జు, రెండు కప్పుల నీరు, రెండు టేబుల్ స్పూన్ల జీలకర్ర పొడి, రెండు టేబుల్ స్పూన్ల జీలకర్ర, అర కప్పు కొత్తిమీర ఆకులు (వద్దనుకుంటే మినహాయించుకోవచ్చు), మూడు పచ్చి మిరపకాయలు, ఒక కప్పు పుదీనా ఆకులు (వద్దనుకుంటే మినహాయించుకోవచ్చు), ఒక టేబుల్ స్పూన్ కాలా నమక్ (ఉప్పులో ఒక రకం) సిద్ధం చేసుకోవాలి.

### స్టఫ్ కోసం (పూరీలో పెట్టేందుకు)
రెండు బంగాళాదుంపలు, రెండు తరిగిన పచ్చి మిరపకాయలు, పరిమాణాన్ని బట్టి ఒకటి లేదా రెండు తరిగిన ఉల్లిపాయ ముక్కలు, ఒక టీ స్పూను వేయించిన జీలకర్ర పొడి, రుచి కోసం



కాస్తంత ఉప్పు, తరిగిన కొత్తిమీర అవసరం.

### పూరీ తయారీ విధానం
ఒక పాత్ర తీసుకుని అందులో సుజి లేదా ఆటా వేసి, కాస్తంత ఉప్పు వేసి, వేడి నీరు పోసి బాగా కలిపిన తర్వాత 30 నిమిషాల పాటు పక్కన పెట్టాలి. ఆ తర్వాత పిండిని చాలా చిన్న పరిమాణంలో ఉండలుగా చేసుకోవాలి. వీటిని పూరీల్లానే వత్తి, పొయ్యిపై వేడెక్కిన నూనెలో బంగారు వర్ణంలో వేయించుకోవాలి.


### పానీ తయారీ
మిక్సర్ లో కొత్తి మీర, పుదీనా, పచ్చి మిరపకాయలు వేసి పేస్ట్ లా చేసుకోవాలి. దీనికి నీటిని కలుపుకోవాలి. తర్వాత పానీకి సంబంధించి ఇతర ముడి పదార్థాలను కూడా కలపాలి. మీ రుచికి అనుగుణంగా కొన్ని ఎక్కువ, తక్కువ వేసుకోవచ్చు.

### పూరీలోకి స్టఫ్ తయారీ
బంగాళాదుంపలను ఉడకబెట్టి దించేయాలి. వీటిని గుజ్జుగా చేసి పొయ్యిపై పెనం పెట్టి కాస్తంత నూనె వేసి ఈ మిశ్రమంలో తరిగిన పచ్చి మిరపకాయలు, తరిగి ఉంచుకున్న ఉల్లిపాయ ముక్కలు వేయాలి. వేయించిన జీలకర్ర పొడి, ఉప్పు, కొత్తిమీర వేసి గరిటెతో కలియబెడుతూ వేడెక్కిన తర్వాత దించేయాలి. దీంతో స్టఫ్ రెడీ.

# జీవితంలో అనుసరించాల్సిన ముఖ్యమైన విషయాలు..!
## ఈ నాలుగు తప్పులు చేయకండి..!

గరుడ పురాణం అనుసరించడం వల్ల మన జీవన పద్ధతులు మెరుగుపడతాయి. ఇందులో చెప్పబడిన విషయాలు కర్మతో నిమిత్తం పెట్టుకుని ఉంటాయి. కర్మ ఆధారంగా మానవుడు మరణానంతరం ఎలా జీవించాలన్నది ఇందులో వివరిస్తారు. ఈ పురాణం జీవితంలో వచ్చే సమస్యలను ఎలా పరిష్కరించా లో చెప్పడం వల్ల మన జీవన విధానంలో మార్పులు తీసుకురావచ్చు. విష్ణువు నోటి నుండి వచ్చినట్లు చెప్పబడిన గరుడ పురాణంలో జ్ఞానం, నీతి, త్యాగం, తపస్సు, రహస్యాలు, పరలోక జీవితం వంటి అంశాలు పొందుపరచబడ్డాయి. ఈ పురాణంలో మానవుడు సంతోష కరమైన జీవితం గడపడానికి అనుసరించ వలసిన రహస్యాలు ఉన్నాయి. ఇందులోని విషయాలు జీవితంలో వచ్చే పెద్ద నష్టాలను ఎలా నివారించాలో సూచిస్తాయి. గరుడ పురా ణం ప్రకారం మనం కొన్ని ముఖ్యమైన సమస్య లను ముందుగానే గుర్తించి వాటిని నివారించవచ్చు. ఈ పురాణంలో నాలుగు ముఖ్యమైన అంశాలను వదలకుండా అనుసరించాలని సూచిస్తారు. వాటినిసగంలో వదిలిపెట్టకూడదట.

### అప్పు తీసుకోవడం
ఎవరైనా డబ్బు అప్పుగా తీసుకుంటే త్వరగా చెల్లించడంలో ఆలస్యం చేయరాదు. తద్వారా అప్పు తిరిగి చెల్లించడం మాత్రమే కాకుండా స్నేహం లేదా సంబంధాలను కూడా కాపాడుకోవచ్చు. అప్పు సకాలంలో తిరిగి ఇవ్వకపోతే అది సంబంధాలకు తగినంత హాని చేస్తుంది.



### వైద్య చికిత్స
ఏదైనా వ్యాధి కలిగినపుడు డాక్టర్ సూచించిన విధంగా మందులు పూర్తిగా తీసుకోవాలి. సగం మానేయడం వలన వ్యాధి మరింత తీవ్రమవుతుంది. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని గరుడ పురాణం హెచ్చరిస్తుంది.

### మంటలు
చిన్న మంట కూడా పెద్ద ప్రమాదానికి దారితీస్తుంది. ఒక చిన్న నిప్పు రవ్వ గనక మిగిలిపోతే అది తరువాత పెరిగి అన్నింటినీ బూడిద చేస్తుంది. అందుకే ఎక్కడైనా మంట ఉంటే దానిని పూర్తిగా ఆర్పివేయాలని గరుడ పురాణం చెబుతుంది.

### శత్రుత్వం
శత్రువుతో ఉన్న విభేదాలను వీలైనంత త్వరగా పరిష్కరించాలి. శత్రుత్వాన్ని త్వరగా ముగించకపోతే భవిష్యత్తులో ఆ శత్రువు మరింత ప్రమాదకరంగా మారవచ్చు. శత్రువు చేసే హానిని ముందుగానే గుర్తించి శాంతియుత మార్గంలో పరిష్కారం కనుగొనడం ఉత్తమం.

గరుడ పురాణం ప్రకారం ఈ నాలుగు విషయాల్లో నిర్లక్ష్యం చేయడం అనేక సమస్యలకు దారితీస్తుంది. అందుకే వాటిని సగంలో వదిలిపెట్టకుండా పూర్తి స్థాయిలో జాగ్రత్తగా అనుసరించాలని సూచించబడింది.

# భారత్-ఆస్ట్రేలియా తొలి టీ20 మ్యాచ్ వర్షార్పణం



కాన్‌బెర్రా వేదికగా భారత్-ఆస్ట్రేలియా తొలి 20టీ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. మ్యాచ్‌ను తిరిగి ప్రారంభించే అవకాశం లేకపోవడంతో మ్యాచ్‌ను నిలిపివేస్తున్నట్లు అంపైర్లు వెల్లడించారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ఆస్ట్రేలియా మొదట బౌలింగ్ ఎంచుకుంది. వర్షం మ్యాచ్‌కు రెండుసార్లు అంతరాయం కలిగించింది. ఐదు ఓవర్ల తర్వాత మ్యాచ్ వర్షం కారణంగా నిలిచిపోయింది. ఆ తర్వాత అంపైర్లు రెండు ఓవర్లు కుదించి.. 18 ఓవర్ల మ్యాచ్ ఆడించాలని నిర్ణయించారు. తిరిగి మ్యాచ్ ప్రారంభమైంది. భారత్ 9.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 67 పరుగులు చేసింది. మరోసారి భారీ వర్షం కురవడంతో మ్యాచ్ నిలిచిపోయింది. తిరిగి మ్యాచ్‌ను ప్రారంభించే పరిస్థితి లేకపోవడంతో మ్యాచ్‌ను అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మ్యాచ్‌లో శుభ్‌మాన్ గిల్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. రెండో వికెట్‌కు హాఫ్ సెంచరీ భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఆట ఆగిపోయే సమయానికి గిల్, సూర్యకుమార్ జోడీ 62 పరుగులు జోడించారు. సూర్యకుమార్ 24 బంతుల్లో 39 పరుగులు చేశాడు. ఇందులో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. గిల్ 20 బంతుల్లో.. నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్ సహాయంతో 37 పరుగులు చేశాడు. అభిషేక్ శర్మ 19 పరుగుల వద్ద నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. సిరీస్‌లో రెండుజట్ల మధ్య మూడో టీ20 మ్యాచ్ ఈ నెల 31న మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగనున్నది.

# మళ్లీ పెరిగిన బంగారం ధర



గత మూడు రోజులుగా కొండదిగుతూ వస్తున్న బంగారం ధరలు ఇవాళ స్వల్పంగా పెరిగాయి. బుధవారం ఉదయం ట్రేడింగ్‌లో తులంపై గరిష్ఠంగా రూ.700 పెరిగింది. దీంతో హైదరాబాద్ బులియన్ మార్కె ట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన పది గ్రాముల ధర రూ.760 పెరిగి రూ.1,21,580కి చేరింది. 22 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.700 పెరిగి రూ.1,11,450గా నమోదైంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,21,730గా, 22 క్యారెట్ల పది గ్రాముల పుత్తడి ధర రూ.1,11,600గా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1.60 లక్షల వద్ద కొనసాగుతోంది. కాగా, గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 4 వేల డాలర్ల దిగువకు పడిపోవడంతోపాటు అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్త పరిస్థితులు తగ్గుముఖం పట్టడంతో దేశీయంగా ధరలు భారీగా తగ్గిన విషయం తెలిసిందే. మంగళవారం దేశీయంగా తులం బంగారంపై ఏకంగా రూ.4వేలు తగ్గింది. గత రెండు రోజుల్లో గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ ధర 200 డాలర్లకు పైగా తగ్గడంతో 3,887 డాలర్లకు పడిపోయింది. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా పసిడి ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. 880 మెట్రిక్ టన్నులకు. ఈ ఏడాది సెప్టెంబర్ ఆఖరునాటికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) దగ్గరున్న బంగారం నిల్వలు 880 మెట్రిక్ టన్నులకు చేరాయి. గడిచిన ఏడాది కాలంలో 25.45 మెట్రిక్ టన్నులు పెరిగినట్టు మంగళవారం 2025 ఏప్రిల్-సెప్టెంబర్ విదేశీ మారకపు నిల్వల నిర్వహణపై విడుదలైన ఆర్బీఐ అర్ధ వార్షిక నివేదిక తెలియజేసింది. గత ఏడాది సెప్టెంబర్ ఆఖర్లో ఆర్బీఐ వద్ద 854.73 మెట్రిక్ టన్నులుగా ఉన్న పసిడి నిల్వలు.. ఈ ఏడాది సెప్టెంబర్ చివరినాటికి 880.18 మెట్రిక్ టన్నులకు పెరిగాయి. ఇందులో 575.82 మెట్రిక్ టన్నులు దేశీయంగానే ఉండగా, మిగతా వాటిని విదేశాల్లో ఆర్బీఐ నిల్వ చేసింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ వద్ద 290.37 మెట్రిక్ టన్నులుండగా, 13.99 మెట్రిక్ టన్నులు గోల్డ్ డిపాజిట్ల రూపంలో ఉన్నాయి. ఈ సెప్టెంబర్ 30 నాటికి ఆర్బీఐ ఫారెక్స్ నిల్వల్లో బంగారం వాటా 13.92 శాతంగా ఉన్నది.



## చరిత్ర సృష్టించిన రోహిత్ శర్మ వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో టాప్

ముంబై: రోహిత్ శర్మ చరిత్ర సృష్టించాడు. ఐసీసీ మెన్స్ వన్డే బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్ మూడో మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీ సాధించిన రోహిత్ ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకాడు. ఆ మ్యాచ్‌లో కోహ్లీతో కలిసి రోహిత్ దుమ్మురేపిన విషయం తెలిసిందే. ఆఫ్ఘనిస్తాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్, ఇండియన్ కెప్టెన్ శుభమన్ గిల్‌ను ర్యాంకింగ్స్‌లో రోహిత్ ఓవర్‌టేక్ చేశాడు. వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్‌తో పాటు ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ ర్యాంకింగ్స్‌లో పైచేయి సాధించాడు781 రేటింగ్ పాయింట్లు సాధించాడు రోహిత్ శర్మ? ఇక ఇబ్రహీం 764 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ మాత్రం 725 పాయింట్లతో బ్యాటింగ్ ర్యాంకుల్లో ఆరో స్థానంలో ఉన్నాడు. 38 ఏళ్ల బ్యాటర్ రోహిత్ తన కెరీర్‌లో తొలిసారి వన్డే ర్యాంకుల్లో టాప్ ప్లేస్‌లో నిలిచాడు. ఇటీవల ఆసీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ సిరీస్ అవార్డు గెలుచుకున్నాడతను. ఆ సిరీస్‌లో అతను 101 సగటుతో మొత్తం 202 రన్స్ స్కోరు చేశాడు. వన్డే బ్యాటర్ల జాబితాలో రోహిత్ శర్మ అగ్రస్థానంలో నిలవడం శుభదాయకం అవుతుంది. వన్డే భవిష్యత్తుపై అనుమానాలు కమ్ముకున్న నేపథ్యంలో .. రోహిత్ టాప్ ర్యాంకులో నిలవడం గమనార్హం. వన్డే కెప్టెన్సీని గిల్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. రోహిత్ వన్డేల నుంచి రిటైర్ అవుతున్న ఊహాగానాలు కూడా వినిపించాయి. కానీ ఆసీస్ సిరీస్‌తో అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబరిచాడతను.

# క్రెడిట్ కార్డు ఈఎమ్ఐతో షాపింగ్ చేస్తున్నారా




ఏదైనా షాపింగ్ లేదా కొనుగోలు చేసినప్పుడు చాలామంది క్రెడిట్ కార్డుతో పేమెంట్ చేసి దాన్ని ఈఎమ్ఐగా మార్చుకుంటుంటారు. క్రెడిట్ కార్డులు అందించే ప్రయోజనాల్లో ఈఎంఐ ఆప్షన్ చాలా ఉపయోగకరమైందని చెప్పొచ్చు. అయితే క్రెడిట్ కార్డు ఈఎంఐకు సంబంధించి కొన్ని రూల్స్ ఉంటాయి. ఆ రూల్స్ తెలుసుకోకుండా ఈఎంఐ ఆప్షన్ ఎంచుకోవడం ద్వారా కొన్నిసార్లు నష్టపోయే అవకాశం ఉంది. అందుకే క్రెడిట్ కార్డు ఈఎమ్ఐ తీసుకునేముందు వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజు, ప్రీపేమెంట్ లేదా ఫోర్‌క్లోజర్ ఛార్జీల గురించి తెలుసుకోవాలి. వీటిని చెక్ చేశాకే. సాధారణంగా క్రెడిట్ కార్డు జారీ చేసే సంస్థలు, కార్డు రకాన్ని బట్టి వడ్డీరేట్లను మారుస్తుంటాయి. అలాగే కొన్నింటికి ప్రాసెసింగ్ ఫీజు ఉంటుంది. ఇది ఒకసారి మాత్రమే చెల్లించాలి. అలాగే ఈఎమ్ఐ కాలపరిమితికి ముందే క్రెడిట్ చెల్లించాలనుకుంటే ముందస్తు చెల్లింపు ఛార్జీలు వర్తిస్తాయి. వీటన్నింటినీ చెక్ చేసుకుని ఏ కార్డులో తక్కువ ఛార్జీలు ఉన్నాయో వాటిని ఎంచుకోవడం బెటర్. అలాగే క్రెడిట్ కార్డు విషయంలో ఎక్కువ టైం పీరియడ్ ఎంచుకుంటే తక్కువ వడ్డీ రేటు పడుతుంది. కానీ దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తుంది. కాబట్టి ఒకసారి చెక్ చేసుకోవాలి. అలాగే కొన్ని క్రెడిట్ కార్డు సంస్థలు 'నో కాస్ట్ ఈఎమ్ఐ' ఆప్షన్ ను అందిస్తాయి. అంటే వీటిపై ఎలాంటి వడ్డీ ఉండదు. తీసుకున్న మొత్తాన్ని ఈఎమ్ఐల రూపంలో తిరిగి చెల్లిస్తే చాలు. టెన్యూవర్ ఇలా.. ఇకపోతే ఏఎమ్ఐ టెన్యూవర్‌ను వెసులుబాటుకు అనుగుణంగా ఎంచుకోవాలి. ఎక్కువ ఈఎమ్ఐ చెల్లించలేము అనుకుంటే ఎక్కువ నెలలను ఎంచుకోవాలి. కొన్ని క్రెడిట్ కార్డు సంస్థలు షాపింగ్ పై క్యాష్‌బ్యాక్/రివార్డ్‌లను అందిస్తుంటాయి. అలాంటి కార్డులను ఎంచుకుంటే మరోసారి షాపింగ్ చేసినప్పుడు డిస్కౌంట్స్, రివార్డ్స్ లాంటి ప్రయోజనాలను పొందొచ్చు. క్రెడిట్ కార్డు బిల్లును ఈఎమ్ఐ కిందకు మార్చుకుంటే.. ఎంత మొత్తం వాడుకున్నారో అంత క్రెడిట్ లిమిట్ తగ్గుతుంది. ఈఎమ్ఐల రూపంలో చెల్లిస్తూ ఉంటే మళ్లీ పెరుగుతుంటుంది. కాబట్టి ఈఎమ్ఐలు పూర్తయ్యే వరకు తక్కువ క్రెడిట్ లిమిట్‌తో సర్దుకోవాల్సి ఉంటుంది.

# సూర్య 150 రోహిత్ రికార్డ్‌నే బ్రేక్ చేసేశాడుగా





భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరుగుతోంది. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లోనే, భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఓ ఘనతను సాధించాడు. అతను ప్రత్యేక జాబితాలో స్థానం సంపాదించాడు. ప్రపంచంలో ఇంతకు ముందు నలుగురు ఆటగాళ్ళు మాత్రమే సాధించిన ఘనతను సూర్యకుమార్ యాదవ్ సాధించాడు. అతను రోహిత్ శర్మను కూడా అధిగమించాడు. చరిత్ర సృష్టించిన సూర్యకుమార్ యాదవ్. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన టీ20 కెరీర్‌లో 150 సిక్సర్లు బాదాడు. ఈ మైలురాయిని చేరుకున్న ప్రపంచంలో ఐదవ బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన టీ20 సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో రెండు భారీ సిక్సర్లు బాదడం ద్వారా అతను ఈ ఘనతను సాధించాడు. సూర్యకుమార్ సాధించిన అత్యంత ముఖ్యమైన అంశం ఏమిటంటే, టీ20లో 150 సిక్సర్లు బాదిన భారత జట్టు తరపున రెండో ఆటగాడిగా నిలిచాడు. అతని కంటే ముందు, ఈ ఘనతను భారత కెప్టెన్ రోహిత్ శర్మ సాధించాడు. అయితే, ఇన్నింగ్స్ పరంగా సూర్య రోహిత్‌ను అధిగమించాడు. రోహిత్ ఈ మైలురాయిని 111 ఇన్నింగ్స్‌లలో సాధించగా, సూర్యకుమార్ కేవలం 86 ఇన్నింగ్స్‌లలోనే సాధించడం గమనార్హం. దీంతో భారత జట్టు తరపున 150 టీ20ఐ సిక్సర్లు కొట్టిన అత్యంత వేగవంతమైన బ్యాట్స్‌మన్‌గా కూడా అతను నిలిచాడు. టీ20ఐ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన టీ20ఐ సిక్సర్ల రికార్డు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన మహ్మద్ వసీం పేరిట ఉంది. అతను కేవలం 66 ఇన్నింగ్స్‌లలో 150 సిక్సర్లు కొట్టాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన టీ20 సిరీస్ తొలి మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ రెండు సిక్సర్లు బాది కొత్త రికార్డు సృష్టించాడు. తన టీ20 కెరీర్‌లో 150 సిక్సర్లను చేరుకుని ప్రత్యేక జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన టీ20 సిరీస్ తొలి మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ రెండు సిక్సర్లు బాది కొత్త రికార్డు సృష్టించాడు. తన టీ20 కెరీర్‌లో 150 సిక్సర్లను చేరుకుని ప్రత్యేక జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన టీ20 సిరీస్ తొలి మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ రెండు సిక్సర్లు బాది కొత్త రికార్డు సృష్టించాడు. తన టీ20 కెరీర్‌లో 150 సిక్సర్లను చేరుకుని ప్రత్యేక జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. సూర్యకుమార్ తర్వాతి స్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన మార్టిన్ గుప్టిల్ 101 ఇన్నింగ్స్‌లలో, రోహిత్ శర్మ 111 ఇన్నింగ్స్‌లలో, ఇంగ్లాండ్‌కు చెందిన జోస్ బట్లర్ 120 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనతను సాధించాడు. అంతేకాకుండా, పూర్తి సభ్య జట్లలో, సూర్య 150 సిక్సర్లు కొట్టిన అత్యంత వేగవంతమైన బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. గర్భంతో 145 కేజీల డెడ్‌లిఫ్ట్ పోటీలకు.. కట్‌చేస్తే. మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన సూర్యకుమార్ యాదవ్. ఈ మ్యాచ్ సూర్యకుమార్ యాదవ్‌కు చాలా విధాలుగా ప్రత్యేకమైనది. అతను తన మునుపటి ఐదు మ్యాచ్‌లలో 20 పరుగులు చేయలేకపోయాడు. కానీ, ఈ మ్యాచ్‌లో 30ం పరుగులు సాధించగలిగాడు. 2025 ఆసియా కప్ సమయంలో, అతను ఏడు మ్యాచ్ లలో ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. ఒక్కసారి మాత్రమే 20 పరుగులు దాటాడు. అతను 100 పరుగుల మార్కును దాటగలిగాడు. కానీ, ఈ మ్యాచ్‌లో బలమైన పునరాగమనం చేయగలిగాడు.

# ఖజానాలపై నమ్మకం తగ్గిందా ఆర్బీఐ ఆపరేషన్ గోల్డ్ 6 నెలల్లో 64 టన్నుల బంగారం





ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న రాజకీయ గందరగోళం, ఆర్థిక అనిశ్చితి మధ్య భారత రిజర్వ్ బ్యాంక్ దేశ ఆస్తులను కాపాడటానికి ఒక ముఖ్యమైన చర్య తీసుకుంది. ఈ సంవత్సరం మార్చి-సెప్టెంబర్ మధ్య, కేవలం ఆరు నెలల్లో రిజర్వ్ బ్యాంక్ విదేశాలలో దాచిన 64 టన్నుల బంగారాన్ని తిరిగి తీసుకువచ్చింది. భారతదేశం ఇకపై తన విలువైన ఆస్తులను విదేశాలలో ఉంచుకోవడానికి ఇష్టపడటం లేదు. ప్రపంచ వేదికపై మారుతున్న అధికార సమతుల్యత, పెరుగుతున్న ఆర్థిక యుద్ధ ముప్పు దృష్ట్యా ఈ చర్య తీసుకుంది. ఈ బంగారం తిరిగి తీసుకురావడం వెనుక ఒక నిర్దిష్టమైన, తక్షణ కారణం ఉంది. ఇటీవలి సంవత్సరాలలో విదేశీ ఖజానాల విశ్వసనీయత గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తిన అనేక సంఘటనలను ప్రపంచం చూసింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, తాలిబన్లు ఆఫ్ఘనిస్తాన్‌ను ఆక్రమించడం అత్యంత ప్రముఖ ఉదాహరణలు. రెండు సందర్భాలలోనూ పాశ్చాత్య దేశాల సమూహం రష్యా, ఆఫ్ఘనిస్తాన్ నుండి బిలియన్ల డాలర్ల విదేశీ మారక నిల్వలను స్వాధీనం చేసుకుంది. ఈ చర్య ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులను వారి ఆస్తుల భద్రతను పరిగణనలోకి తీసుకోవలసి వచ్చింది. పదేళ్ల తర్వాత ఒక కంపెనీని వదిలివేస్తే పెన్షన్ వస్తుందా? మీకు ఒక దేశంతో రాజకీయ విభేదాలు ఉంటే అది మీ స్వంత డబ్బును మీకు వ్యతిరేకంగా ఆయుధంగా ఉపయోగించుకోవచ్చు లేదా దానిని స్తంభింపజేయవచ్చు అనే భయం పెరుగుతోంది. అటువంటి పరిస్థితిలో ఒక దేశం సురక్షితమైన ఆస్తిగా పరిగణించబడే మీ బంగారాన్ని మీ స్వంత గడ్డపై మీ స్వంత ఖజానాలలో ఉంచుకోవడం తెలివైన పని. ఆర్బీఐ మార్చి 2023 నుండి విదేశాల నుండి భారతదేశానికి మొత్తం 274 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఇది కూడా చదవండి: : ఆధార్‌ను ఏ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదు.. నియమాలు ఏం చెబుతున్నాయి? భారతదేశ ఖజానాలో ఇప్పుడు ఎంత బంగరం ఉంది? సెప్టెంబర్ 025 చివరి నాటికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మొత్తం 880.8 టన్నుల బంగారాన్ని కలిగి ఉంది. ఈ చర్య తర్వాత ఇందులో గణనీయమైన భాగం, 575.8 టన్నులు, ఇప్పుడు భారతదేశం స్వంత ఖజానాలలో ఉంచబడింది. అదనంగా ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ , బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ వద్ద 290.3 టన్నుల బంగారం ఉంది. ఈ రెండు సంస్థలు సాంప్రదాయకంగా ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులకు బంగారు నిల్వలుగా పనిచేస్తున్నాయి. అదనంగా 14 టన్నుల బంగారం బంగారు నిక్షేపాలలో ఉంది. ఈ సంవత్సరం మార్చి 31 నాటికి ఉన్న గణాంకాలను పోల్చి చూస్తే వద్ద మొత్తం 879 టన్నుల బంగారం ఉంది. అందులో 512 టన్నులు భారతదేశంలో, 348.6 టన్నులు విదేశాలలో ఉన్నాయి. ఈ గణాంకాలను ప్రత్యక్షంగా పోల్చి చూస్తే ఆరు నెలల్లో 64 టన్నుల బంగారం భారతదేశానికి ఎలా తీసుకురాబడిందో, విదేశీ నిల్వలు ఎలా తగ్గాయో తెలుస్తుంది.

# జోరుగా ఐఫోన్ అమ్మకాలు యాపిల్ కంపెనీ విలువ 4 ట్రిలియన్ డాలర్లు



తాజాగా ఆ కంపెనీ మార్కెట్ విలువ 4 ట్రిలియన్ల డాలర్లు దాటింది. కొత్త ఐఫోన్ మోడల్స్ అమ్మకాల జోరు పెరగడంతో.. యాపిల్ కంపెనీ షేర్లు కూడా దూసుకెళ్తున్నాయి. యాపిల్ కంపెనీ చరిత్రలో 4 ట్రిలియన్ మార్కెట్ వాల్యూను చేరుకోవడం ఇదే తొలిసారి. ఆ మైలురాయి అందుకున్న మూడవ టెకీ కంపెనీగా యాపిల్ సంస్థ నిలిచింది. గతంలో ఈ రికార్డు అందుకున్న కంపెనీల్లో మైక్రోసాఫ్ట్, నిదియా ఉన్నాయి. సెప్టెంబర్ 9వ తేదీన కొత్తగా రిలీజైన ఐఫోన్ల అమ్మకాల వేగం పెరగడంతో యాపిల్ కంపెనీ షేర్లు అప్పటి నుంచి 13 శాతం వృద్ధి సాధించాయి. దీంతో స్టాక్ మార్కెట్ పాజిటివ్‌గా ముందుకెళ్తున్నది. బుధవారం ఉదయం యాపిల్ కంపెనీ షేర్లు 0.4 శాతం పెరిగాయి. గడిచిన జూలైలో మైక్రోసాఫ్ట్ సంస్థ కూడా 4 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువ అందుకున్నది.

## సినిమాలకు సూపర్‌స్టార్ గుడ్ బై?.. కోలీవుడ్‌లో మళ్లీ హాట్ టాపిక్!



భారతీయ సినీ పరిశ్రమలో 'సూపర్‌స్టార్' అనే పదానికి చిరునామాగా నిలిచిన రజనీకాంత్ సినిమాల నుంచి తప్పుకోనున్నారా? ఆయన రిటైర్మెంట్‌పై కోలీవుడ్ వర్గాల్లో మరోసారి జోరుగా చర్చ జరుగుతోంది. 75 ఏళ్ల వయసులోనూ యువ హీరోలతో పోటీపడుతూ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న తలైవా, త్వరలోనే నటనకు స్వస్తి పలకనున్నారనే వార్తలు ఆయన అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.ప్రస్తుతం రజినీకాంత్ 'జైలర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'జైలర్ 2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా తర్వాత గతంలో 'అరుణాచలం' వంటి బ్లాక్‌బస్టర్ అందించిన దర్శకుడు సుందర్ సి దర్శకత్వంలో ఓ ప్రాజెక్టుకు అంగీకరించినట్లు సమాచారం. ఆ తర్వాత లోకనాయకుడు కమల్ హాసన్‌తో కలిసి, దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించే భారీ మల్టీస్టారర్‌లో నటించనున్నారు.
అయితే, ఈ చిత్రమే రజనీకాంత్ కెరీర్‌లో చివరి సినిమా కాబోతోందని తమిళ సినీ వర్గాల్లో గట్టిగా ప్రచారం జరుగుతోంది.ఇటీవల కాలంలో రజనీకాంత్ ఆధ్యాత్మికత వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. సినిమాల మధ్య విరామం దొరికినప్పుడల్లా హిమాలయాలకు వెళ్తుండటంతో ఆయన రిటైర్మెంట్ వార్తలకు మరింత బలం చేకూరుతోంది. అయితే, 'నా ఊపిరి ఉన్నంతవరకు నటిస్తూనే ఉంటాను' అని సూపర్‌స్టార్ గతంలో పలుమార్లు స్పష్టం చేశారు. గతంలోనూ ఇలాంటి వదంతులు వచ్చినప్పటికీ, అవన్నీ అవాస్తవాలని తేలిపోయాయి. అయినప్పటికీ, తాజా ప్రచారంతో ఈసారి ఆయన కచ్చితంగా రిటైర్మెంట్ నిర్ణయం తీసుకుంటారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.ఈ వార్తలతో ఆయన అభిమానులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. "తలైవా లేకుండా తమిళ సినీ పరిశ్రమను ఊహించుకోలేం" అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మరి ఈ వదంతులపై రజనీకాంత్ లేదా ఆయన ప్రతినిధులు స్పందిస్తారో, లేక ఎప్పటిలాగే మౌనంగా ఉంటారో వేచి చూడాలి

## చిరుతో సినిమా నా కల..

### మాళవిక మోహనన్



మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ బాబీ కాంబినేషన్‌లో రాబోతున్న 'మెగా 158' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నట్లు వస్తున్న వార్తలపై నటి మాళవిక మోహనన్ స్పష్టత ఇచ్చారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అవన్నీ వదంతులేనని ఆమె తేల్చిచెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు."మెగా 158 చిత్రంలో నేను నటిస్తున్నట్లు ఆన్‌లైన్‌లో ప్రచారం జరుగుతోంది. ఐకానిక్ స్టార్ చిరంజీవి గారితో ఏదో ఒక రోజు స్క్రీన్ పంచుకోవాలనే కోరిక నాకు బలంగా ఉంది. కానీ, ప్రస్తుతానికి నేను ఆ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదు. దయచేసి ఆ వదంతులను నమ్మవద్దు" అని మాళవిక తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆమె ప్రకటనతో చిరంజీవి సరసన నటించబోయే హీరోయిన్‌పై గత కొద్ది రోజులుగా సాగుతున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.
'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'మెగా 158'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. మాళవిక స్పష్టత ఇవ్వడంతో ఈ చిత్రంలో నటించబోయే అసలు కథానాయిక ఎవరనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీనిపై చిత్ర బృందం త్వరలోనే అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## తీర ప్రాంతంలో రౌడీ-రాణీ మధ్య రొమాన్స్!




విజయ్ దేవరకొండ, కీర్తి సురేష్ జంటగా రవి కిరణ్ కోలా దర్శకత్వంలో రౌడీజనార్దన్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా రూపొందుతుంది. ప్రేమ, రాజకీయం అంశాలను ఆధారంగా చేసుకుని అల్లిన స్క్రిప్ట్ ఇది. ఇందులో విజయ్ పాత్ర మాస్ కోణంలో ఉంటుందని..హీరో పాత్రకు ధీటుగా హీరోయిన్ రష్మిక పాత్ర కూడా ఉంటుందని ప్రచారంలో ఉంది. జనార్దన్ పాత్ర రౌడీ తరహాలో ఉంటే? రౌడీ రాణిలా కీర్తి పాత్ర ఉంటుందని వినిపిస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి షూటింగ్ అప్ డేట్ తెరపైకి వచ్చింది. రొమాన్స్ పీక్స్ లో ఉంటుందా: ప్రస్తుతం మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఓ తీర ప్రాంతంలో చిత్రీకరణ జరుపుకుంటోంది. ఇదే సినిమాకు సంబంధించిన తొలి షెడ్యూల్ గా వినిపిస్తోంది. దీనిలో భాగంగా విజయ్-కీర్తి సురేష్ లపై రొమాంటిక్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. రొమాన్స్ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయంటున్నారు. ఇద్దరి మధ్య రొమాంటిక్ సన్నివేశాలు రెగ్యులర్ రొమాన్స్ కు భిన్నంగా ఉంటాయని చెబుతున్నారు. రొమాంటిక్ సన్నివేశాలు విజయ్ దేరకొండకు కొత్తేం కాదు. ఇప్పటి వరకూ నటించిన చాలా సన్నివేశాల్లో రొమాంటిక్ సన్నివేశాల్లో తనదైన మార్క్ వేసాడు. రొమాంటిక్ భామగా కనెక్ట్ అవుతుందా: అర్జున్ రెడ్డి%-, -%గీతగోవిందం%-, -%డియర్ కామ్రేడ్ సహా చాలా చిత్రాల్లో తనదైన మార్క్ వేసాడు. కానీ కీర్తి సురేష్ మాత్రం రొమాంటిక్ హీరోయిన్ గా ఇంతవరకూ హైలైట్ కాలేదు. తొలి నుంచి అమ్మడు డీసెంట్ పాత్రలు పోషించుకుంటూ వచ్చింది. హీరోలతో రొమాంటిక్ సన్నివేశాలున్న సినిమాలకు దూరమైంది. ఆ రకంగా చాలా అవకాశాలు కూడా కోల్పోయింది. హీరోయిన్ల రేసులో వెనుకబాటుకు కారణం కూడా అదే. కానీ సర్కారు వారి పాట నుంచి కీర్తి కూడా పంథా మార్చింది. గ్లామర్ బ్యూటీ గాహైలైట్ అయ్యే ప్రయత్నాలు మొదలు పెట్టింది. కానీ ఆ తర్వాత ఆ రకంగా తనను ప్రూవ్ చేసుకునే అవకాశాలు రాలేదు. రెట్టింపు క్రేజ్ తథ్యం: దసరా లో మాస్ పాత్ర పోషించినా? అందులో రొమాంటిక్ యాంగిల్ హైలైట్ కాదు. భోళా శంకర్ లో సిస్టర్ పాత్రకే పరిమితమైంది. బాలీవుడ్ సినిమా బేబి జాన్ లో అటెంప్ట్ చేసింది. కానీ అది హిందీ సినిమా కావడంతో తెలుగు వరకూ చేరలేదు. ఈ నేపథ్యంలో రౌడీ జనార్దన్ రూపంలో రొమాంటిక్ భామగా ప్రూవ్ చేసుకునే అవకాశం వచ్చింది. వివాహ బంధంలోకి అడుగు పెట్టిన నేపథ్యంలో నటిస్తోన్న తొలి రొమాంటిక్ చిత్రం కూడా ఇదే అవుతుంది. కీర్తి సురేష్ రొమాంటిక్ రోల్స్ తో యువతకు కనెక్ట్ అయితే అమ్మడి క్రేజ్ రెట్టింపు అవుతుందడనంలో ఎలాంటి సందేహం లేదు.



## ఒకేరోజు రెండు బ్లాక్ బస్టర్ సినిమాలు ఓటీటీలో!

ఒకే రోజున రెండు బ్లాక్ బస్టర్ సినిమాలు ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి రావడానికి సిద్ధమయ్యాయి. ఒకటి రిషబ్ శెట్టి కథానాయకుడిగా నటించిన 'కాంతార చాప్టర్ -1' అయితే, మరొకటి కల్యాణి ప్రియదర్శన్ ప్రధానమైన పాత్రను పోషించిన 'లోకా -చాప్టర్ 1: చంద్ర'. ఒకటి 800 కోట్లకుపైగా వసూళ్లను రాబట్టిన కన్నడ సినిమా అయితే, మరొకటి 300 కోట్లకి పైగా కొల్లగొట్టిన మలయాళ మూవీ. ఈ రెండు సినిమాలు ఈ నెల 31వ తేదీ నుంచి ఓటీటీ ప్రేక్షకులను పలకరించనున్నాయి.'కాంతార చాప్టర్ -1' సినిమా ఓటీటీ హక్కులను అమెజాన్ ప్రైమ్ వారు దక్కించుకున్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి ఈ సినిమాను కన్నడతో పాటు, తెలుగు .. తమిళ .. మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ చేయనున్నారు. 'కాంతార' అడవులను ఆక్రమించడానికీ .. అక్కడి గిరిజనులను అణగదొక్కడానికి ఒక రాజు ప్రయత్నిస్తాడు. అడవినీ .. తనవారిని కాపాడుకోవడానికి ఆ నాయకుడు ఏం చేశాడు? అనేదే కథ. ఇప్పటికీ థియేటర్స్ లో ఆడుతున్న ఈసినిమా ఓటీటీ కి వస్తుండటం విశేషం. ఇక 'లోకా -చాప్టర్ 1: చంద్ర' విషయానికి వస్తే, దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ సినిమాకి డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమాలో చంద్ర అనే పాత్రలో కల్యాణి ప్రియదర్శన్ నటించింది. అతీంద్రియ శక్తులను దాచిపెట్టి ఒక సామాన్య యువతిగా రోజులు గడుపుతూ ఉంటుంది.







## గ్లోబల్ గా ఇదిపవర్ స్టార్ స్టామినా..!

పవన్ కళ్యాణ్ హీరోగా సాహో సుజీత్ దర్శకత్వంలో వచ్చిన ఓజీ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. రెగ్యులర్ సినీ ప్రేక్షకులు పెదవి విరిచినా, పవన్ కళ్యాణ్ వీరాభిమానులు మాత్రం ఓజీ సినిమాను నెత్తిన ఎత్తుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో రెండు వారాల పాటు ఓజీ ఫీవర్ ఓ రేంజ్ లో ఊపేసిన విషయం తెల్సిందే. ఓజీ సినిమాను కేవలం ఫ్యాన్స్ కోసమే అన్నట్లుగా దర్శకుడు సుజీత్ రూపొందించిన తీరు, దానికి తమన్ అందించిన సంగీతం మరో లెవల్ అన్నట్లుగా చెప్పుకోవచ్చు. తమన్ ప్రతి సీన్‌కు ఇచ్చిన ఎలివేషన్ చూసి చాలా మంది షాక్ అయ్యారు. పవన్ ఫ్యాన్స్ ను ఇప్పటి వరకు ఈ స్థాయిలో ఊపేసింది ఎవరూ లేరు అంటూ తమన్, సుజీత్ గురించి సోషల్ మీడియాలో ప్రముఖంగా చెప్పుకుంటున్నారు. ఇప్పుడు ఓజీ ఓటీటీలో సందడి చేస్తోంది. పవన్ కళ్యాణ్ ఓజీ నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్... ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్‌లో ఓజీ సినిమా స్ట్రీమింగ్ ఇప్పటికే మొదలైంది. థియేట్రికల్ రిలీజ్ అయిన నాలుగు వారాల తర్వాత ఈ సినిమాను ఓటీటీలో నెట్‌ఫ్లిక్స్ స్ట్రీమింగ్ మొదలు పెట్టింది. థియేట్రికల్ రిలీజ్ సమయంలో చూసిన ప్రేక్షకులు, చూడని ప్రేక్షకులు అంతా కూడా నెట్‌ఫ్లిక్స్ లో ఓజీ ని తెగ స్ట్రీమింగ్ చేయడం ఖాయం అని మొదటి నుంచే అంతా అనుకున్నారు. అనుకున్నట్లుగానే ఓటీటీ లో ఓజీ సినిమాకు అద్భుతమైన స్పందన దక్కింది. నెట్‌ఫ్లిక్స్ ఇచ్చిన స్టాట్స్ ప్రకారం 23 అక్టోబర్ నుంచి 26 అక్టోబర్ వరకు ఏకంగా 3.2 మిలియన్‌ల వ్యూస్ ఓజీ సినిమా సొంతం చేసుకుంది.

Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com